అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ


సోమవారం 07-10-2024
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 279 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



వైవాహిక లైంగికదాడి నేరం ఎందుకు కాదు?

ఇప్పటికే శిక్షార్హంగా పరిగణిస్తున్న పలు దేశాలు



- వందకు పైగా దేశాల్లో ఇది అమలు
- భారత్‌లో మాత్రం అందుకు విరుద్ధం
- లైంగికదాడిగా పరిగణించలేమంటున్న కేంద్రం
- మహిళా న్యాయవాదులు, హక్కుల నేతల విస్మయం
- కేంద్రం సమర్పించిన అఫిడవిట్‌పై ఆగ్రహం

6లో..



అన్నదాతల బలిదానాలకు రేవంత్‌రెడ్డి సర్కారే కారణం

మాజీమంత్రి కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పొలం ఉన్న రైతులనూ పొట్టనబెట్టుకుంటున్నారనీ, కౌలు తీసుకున్న కర్షకులనూ కబళిస్తున్నారనీ, ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు బలికావడానికి ముమ్మాటికీ రైతు వ్యతిరేక రేవంత్ రెడ్డి సర్కారే కారణమంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఆదివారం ట్వీట్ ...6లో

కేసీఆర్ ఎక్కడ..వెతికి పెట్టండి!

గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

నియోజకవర్గంలో ఎక్కడికక్కడే ఆగిన పనులు



నవతెలంగాణ-గజ్వేల్


గజ్వేల్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ నియోజకవర్గ ప్రజలకు కనిపించడం లేదని, వెతికి పెట్టాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు, పీసీసీ ప్రధాన కార్యదర్శి నాయిని యాదగిరి ...13లో

దమ్ముంటే అభివృద్ధికి నిధులిప్పించండి

మూసీ ప్రక్షాళనపై అర్థరహిత విమర్శలు తగవు | **ఈటలా.. మోడీ దగ్గరకెళ్లి అడుగుదాం పదా**

- బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు సలహాలివ్వండి
- సబర్మతి నది ప్రక్షాళన కోసం 65 వేల కుటుంబాల తరలించారు..ఇక్కడ పదివేల కుటుంబాలను తరలిస్తే తప్పేంటి ?
- హరీశ్‌రావు, కేటీఆర్ వారంపాటు మూసీ పక్కన ఇండ్లల్లో ఉండండి.. కష్టాలేంటో తెలుస్తాయి
- బాధితుల కోసం ప్రత్యేక కాలనీలు..అక్కడే విద్యాసంస్థలు
- బాధ్యతతో విధులు నిర్వర్తించండి :ఉద్యోగ నియామక పత్రాల అందజేతలో సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 6లో



రుణమాఫీపై వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాం

మీ ప్రకటన వేదనకు, ఆశ్చర్యానికి గురి చేసింది

ఇవిగో వాస్తవాలు

తెలంగాణ రైతుకు మద్దతు ఇవ్వండి : ప్రధాని మోడీకి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ

వివరాలు 5లో

డిజిటల్ మీడియాపై మోడీ దాడి

ఆధిపత్యం కోసమే బ్రాడ్‌కాస్టింగ్ బిల్లు



- దాన్నీ కార్పొరేటీకరణ చేసేందుకు ప్రయత్నాలు
- జాతీయ 'మోడియా'గా మారిన మీడియా
- టీ-10 వార్షికోత్సవ జాతీయ సదస్సులో కేరళ ఎంపీ డాక్టర్ జాన్ బ్రిట్టాస్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జాతీయ మీడియా 'మోడియా'గా మారాక, ఇప్పుడు ప్రధాని దృష్టి డిజిటల్ మీడియాపై పడిందని కేరళ ఎంపీ, కైరళి టీవీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బ్రిట్టాస్ అన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ మీడియా తటస్థంగా వ్యవహరించి ఉంటే, మోడీకి మూడు శాతం ఓట్లు తగ్గి, 200 సీట్లకంటే తక్కువ వచ్చిఉండేవని విశ్లేషించారు. టీ-10 ఆరవ వార్షికోత్సవం సందర్భంగా 'డిజిటల్ యుగంలో ప్రజాఉద్యమాలు, సోషల్ మీడియా, ఇండిపెండెంట్ జర్నలిస్టుల పాత్ర-సవాళ్లు' అంశంపై ఆదివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ సదస్సు జరిగింది. దీనిలో ఆయన ముఖ్యవక్తగా మాట్లాడారు. ప్రధాన మీడియాపై ప్రజల్లో ఆదరణ తగ్గి, డిజిటల్ మీడియా ప్రభావం పెరిగి, మైండ్ ఇండస్ట్రీగా మారిందనీ, ఈ ప్రమాదాన్ని గుర్తించిన మోడీ బ్రాడ్‌కాస్టింగ్ బిల్ పేరుతో దానిపై ఆంక్షలు విధిస్తున్నారని చెప్పారు. డిజిటల్ మీడియాను క్రమేణా కార్పొరేటీకరణ చేసే ప్రయత్నాలు మొదలయ్యాయని హెచ్చరించారు. యూట్యూబ్‌లో ఏ వీడియో పోస్ట్ చేసినా, అది ప్రభుత్వానికి, ప్రధానికి వ్యతిరేకంగా ఉంటే, దాన్ని ఎడిట్ చేయడం, లేదా తొలగించడం కూడా ప్రభుత్వమే చేసేలా బ్రాడ్‌కాస్టింగ్ బిల్లులో నిబంధనలు చేర్చారని వివరించారు. ఇందిరాగాంధీ ...5లో

వాంగ్‌చుక్ నిరవధిక దీక్ష

అనుమతి నిరాకరించిన పోలీసులు

తమను నిర్బంధించిన లడక్ భవన్‌లోనే దీక్ష ప్రారంభించిన పర్యావరణ కార్యకర్తలు



13లో..

మసీదుపై ఇజ్రాయిల్ బాంబుల వర్షం

26 మంది మృతి

వివరాలు 13లో

ముంబయిలో ఏడుగురు సజీవ సమాధి

ఘటనాస్థలికి సీఎం..క్షతగాత్రులకు వైద్యసేవలందించాలని ఆదేశం

13లో..



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

దేశానికే రోల్ మోడల్‌గా కొత్త రెవెన్యూ చట్టం

యాచారం, తిరుమలగిరి ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా అమలు

త్వరలో యంత్రాంగం పునరుద్ధరణ : డిప్యూటీ కలెక్టర్ల ముఖాముఖిలో మంత్రి పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశానికి రోల్ మోడల్‌గా ఉండేలా 'తెలంగాణ రెవెన్యూ చట్టం-2024'ను తీసుకురాబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లతో ఆదివారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోనే విధంగా రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసి సామాన్యునికి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కొత్త రెవెన్యూ చట్టం రాకముందే ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక అధికారిని నియమిస్తామని చెప్పారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి, రంగారెడ్డి జిల్లా యాచారం మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామనీ, అక్కడ ఎదురయ్యే సమస్యలను పరిగణనలోకి ...13లో

చెన్నై మెరీనా బీచ్ వద్ద తొక్కిసలాట

ఐదుగురు మృతి..ఆస్పత్రుల్లో క్షతగాత్రులు

మెగా ఎయిర్ షో వీక్షించేందుకు భారీగా సందర్శకులు



మెరీనా బీచ్ వద్ద కిటకిట



తిరుగుప్రయాణంలో అవస్థలు

చెన్నై: భారత వైమానిక దళం 92వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా తమిళనాడులోని చెన్నై మెరీనా బీచ్ వద్ద తోక్కిసలాట జరిగింది. భారత వైమానిక దళం ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించిన 'మెగా ఎయిర్ షో' ను వీక్షించేందుకు లక్షలాది సందర్శకులు పోటెత్తారు. తిరుగు ప్రయాణంలో ఎక్కడికక్కడ రద్దీ ఏర్పడటంతో వారంతా తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఉక్కపోత, ఎండవేడిమి తాళలేక నలుగురు సొమ్మసిల్లి ప్రాణాలు విడిచారు. మరొకరు గుండెపోటుతో మృతి చెందారు. అస్వస్థతకు గురైన దాదాపు 230 మందిని చెన్నైలోని 3 ఆస్పత్రులకు తరలించారు. మృతులు శ్రీనివాసన్, కార్తికేయన్, జాన్‌బాబు, దినేశ్‌గా పోలీసులు గుర్తించారు. ఎయిర్ షోకు దాదాపు 13 లక్షలమందికి పైగా సందర్శకులు హాజరైనట్లు అంచనా. మధ్యాహ్నం ఒంటిగంటకే ప్రదర్శన ముగిసినప్పటికీ.. సాయంత్రం వరకు ట్రాఫిక్ కొనసాగింది. క్షతగాత్రులను అంబులెన్స్‌ల ద్వారా ఆస్పత్రులకు తరలించేందుకూ ఇబ్బంది ఎదురైంది. చెన్నైనుంచే కాకుండా పరిసర ప్రాంతాల ప్రజలు భారీగా తరలివచ్చారు.. దీంతో మెరీనా బీచ్ సమీపంలోని లైట్‌హౌస్ మెట్రో స్టేషన్, వెళచ్చేరి వద్ద ఉన్న ఎంఆర్‌టీఎస్ రైల్వేస్టేషన్‌లు కిక్కిరిసిపోయాయి. షో ముగిసిన ...5లో

జిల్లా గ్రంథాలయ సంస్థలకు చైర్మెన్లు

13 మంది నియామకం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పలు జిల్లాల గ్రంథాలయ సంస్థలకు చైర్మన్‌లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆదివారం ఈ మేరకు ఉత్తర్వులు ...13లో

భోపాల్‌లో రూ.1800 కోట్ల డ్రగ్స్ సీజ్

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గుట్టుగా సాగుతున్న దందా

మత్తు వెనుక రాజకీయనేతలు, అధికారులేనంటున్న జనం





వివరాలు 13లో..

ఉల్లి మంట..టమాటా తంటా

ఆకాశాన్నంటుతున్న ఆకుకూరలు | **ఇతర రాష్ట్రాల నుంచి తగ్గిన దిగుమతులు**

- పండుగ వేళ పెరుగుతున్న ధరలు
- లబోదిబోమంటున్న వినియోగదారులు

రాష్ట్రంలో కూరగాయల ధరలు దడపుట్టిస్తున్నాయి. టమాట పైపైకి ఎగబాకుతూ సెంచరీ కొట్టే దిశగా వెళ్తున్నది. ఉల్లి ఘాటెక్కిస్తున్నది. కేజీ రూ.50 తగ్గేదే లేదంటున్నది. వర్షాల దెబ్బకు ఆకుకూరల రాక మార్కెట్‌కు బాగా తగ్గింది. దీంతో వాటి రేట్లు కూడా పెరిగిపోయాయి. ఏ కూరగాయ పట్టుకున్నా కేజీ రూ.60 నుంచి రూ.80 పలుకుతున్నది. టమాటధర అమాంతం పెరగడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని కూరల్లో తప్పకుండా ఉపయోగించే టమాటకు రెక్కలు రావడంతో పండుగపూట ప్రజలు తినలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్‌కు పోయి ఐదారు రకాల కూరగాయలు తెచ్చుకోవడం కూడా కష్టంగా మారింది. చిన్నకుటుంబానికి సైతం వారానికి మూడొందలు ఖర్చుపెడితేగానీ సరిపోను కూరగాయలు రావడం గగనమైంది.



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గడిచిన వారం రోజులుగా టమాటా ధర రోజురోజుకు పెరుగుతూ వస్తున్నది. కిలో టమోటా సెప్టెంబర్ మూడో వారంలో 15 నుండి 20 రూపాయల వరకు ఉండేది. నాలుగో వారానికి వచ్చేసరికి అది కాస్తా రెండింతలు దాటి రూ.50 కి చేరింది. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే అదికాస్తా రూ.80కి చేరింది. శంకర్‌మట్, రాంనగర్, తదితర మార్కెట్లలో కేజీ రూ.90 నుంచి రూ.100 దాకా అమ్ముతున్నారు. ఈ ధర ఇంతటితో ఆగే అవకాశాలు లేవని మరింత పెరుగుతుందని వ్యాపారులు అంటున్నారు. కొందరు వ్యాపారులు, దళారీలు ఇదే అదునుగా తమ అక్రమ వ్యాపారాలకు తెరలేపి, కృత్రిమ కొరత సృష్టిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. టమోటా ధరలు గణనీయంగా పెరుగుతున్న ఈ నేపథ్యంలో అధికారులు కూడా వెంటనే అప్రమత్తమై సమీక్షలు నిర్వహిస్తున్నారు.

రాష్ట్రానికి కూరగాయల అవసరం ఎంత?

రాష్ట్ర జనాభాకు ప్రతిఏటా 38.54 లక్షల టన్నుల కూరగాయలు అవసరం. ప్రస్తుతం 19.54 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. రాష్ట్రంలో ఒక కోటి 31 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన ఆహార పంట వరి సహా పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, పొద్దుతిరుడు, నువ్వులు, కంది, పెసర, ఇతర చిరుధాన్యాలు వంటి అన్ని రకాల పంటలు సాగవుతున్నాయి. అందులో కూరగాయల సాగు 3.11 లక్షల ఎకరాలకే పరిమితమైంది. ఈ కారణంగా సుమారు 19 లక్షల టన్నుల దిగుబడుల కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇటీవల ఎగువన ఉన్న మహారాష్ట్ర, పక్కనున్న కర్నాటక రాష్ట్రాల్లో వర్షాలు బాగా పడటంతో అక్కడ కూడా కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో అనివార్యంగా కూరగాయల రేట్లు పెరిగాయి. మోండా, మెహిదీపట్నం, ఎన్టీఆర్ నగర్ కూరగయాల మార్కెట్లకు కూరగాయల పంటలు రావడం బాగా తగ్గింది. రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, మహబూబ్‌నగర్, ...5లో





మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య

అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు

దసరాకంటే ముందే నిర్మాణానికి భూమి పూజ : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మించి, పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అందించనుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ ...13లో

పర్యాటక, వాణిజ్య, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి నాంది

- సికింద్రాబాద్-గోవా బైవీక్లీ రైలు ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సికింద్రాబాద్-గోవా బైవీక్లీ రైలుతో పర్యాటక, వాణిజ్య, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి మరింత దోహదపడుతుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గోవా-సికింద్రాబాద్ రైలును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి గోవాకు డైరెక్టుగా రైలు నడపాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరగానే అంగీకరించారని తెలిపారు. 20 గంటలపాటు సాగే ఈ ప్రయాణం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, గోవా రాష్ట్రాల మధ్య పర్యాటక, వాణిజ్య సాంస్కృతిక సంబంధాల బలోపేతానికి మరింత దోహదపడుతుందన్నారు. ఈ బైవీక్లీ రైలు బుధ, శుక్రవారాల్లో సికింద్రాబాద్ నుంచి బయలుదేరి కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూల్ సిటీ, డోన్, గుంతకల్, బళ్లారి, హొస్పేట, కొప్పల్, గడగ్, హుబ్బళ్లి, ధార్వాడ్, లోండా, క్యాసిల్ రాక్, కులెం, సాన్వోర్‌డెమ్, మడగావ్ జంక్షన్లలో ఆగుతూ.. వాస్కోడగామా చేరుకుంటుందని వివరించారు. ప్రతి గురు, శనివారాల్లో వాస్కోడిగామా నుంచి తిరుగు ప్రయాణం అవుతుందని చెప్పారు. తెలంగాణలో పదేండ్లలో కొత్త రైల్వే లైన్లు, విద్యుదీకరణ, డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులు చాలా వరకు పూర్తయ్యాయనీ, దక్షిణమధ్య రైల్వే రీజియన్లో దాదాపుగా ఎలక్ట్రిఫికేషన్ (విద్యుదీకరణ) పూర్తయిందని వివరించారు. సికింద్రాబాద్ (రూ.715 కోట్లు), కాచిగూడ (రూ.425 కోట్లు), నాంపల్లి (రూ.429 కోట్లు) స్టేషన్ల ఆధునీకరణ, అత్యాధునిక వసతులతో చర్లపల్లి టర్మినల్(రూ. 415 కోట్లు) అభివృద్ధి చేశామని వివరించారు. ఢిల్లీ తర్వాత అత్యధిక వందేభారత్ రైళ్లు సికింద్రాబాద్ నుంచే నడుస్తున్నాయనీ, అవన్నీ వంద శాతం ఆక్యుపెన్సీ కలిగి ఉన్నాయని చెప్పారు. మూడోసారి మోడీ ప్రధాని కాగానే వంద రోజుల్లో రూ. 4,109 కోట్ల అంచనా వ్యయంతో భద్రాచలం-మల్కాన్‌గిరి మధ్య 173 కి.మీ.ల ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేశామని తెలిపారు. జహీరాబాద్‌లో రూ. 2,361 కోట్లతో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ నిర్మాణానికి పచ్చజెండా ఊపిందన్నారు. హైదరాబాద్-నాగ్‌పూర్ మధ్య రూ.6,661 కోట్లతో జాతీయ రహదారుల అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని తెలిపారు.

నేడు ఢిల్లీకి తెలుగు రాష్ట్రాల సీఎంలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలుగు రాష్ట్రాలు సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఆదివారం ఢిల్లీకి వెళ్లనున్నారు. తీవ్రవాద నిరోధంపై అన్ని రాష్ట్రాల సీఎంలతో కేంద్ర హోం శాఖ నిర్వహించే సమావేశానికి వీరిద్దరు హాజరు కానున్నారు. మరోవైపు వరద పరిహారం విషయమై సీఎం రేవంత్ కేంద్ర మంత్రులను కలిసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ పర్యటనలోనే కాంగ్రెస్ అగ్రనేతలను సీఎం రేవంత్ కలవొచ్చని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

రైల్వే అధికారుల నియామకాలపై కేంద్రం యూటర్న్

- యూపీఎస్సీ ద్వారా ఇకపై రెండు పరీక్షల నిర్వహణ

న్యూఢిల్లీ : రైల్వే అధికారుల నియామక విధానంపై కేంద్రం యూటర్న్ తీసుకుంది. రైల్వే ఉద్యోగాలలో నియామకాలకు సంబంధించి సుమారు ఐదు సంవత్సరాల క్రితం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఎనిమిది రైల్వే సర్వీసులను ఒకే సివిల్ సర్వీస్‌గా విలీనం చేస్తూ ఐదు సంవత్సరాల క్రితం కేంద్రం నిర్ణయం తీసుకుంది. అయితే 2019లో తీసుకున్న క్యాబినెట్ నిర్ణయానికి విరుద్ధంగా రైల్వే సర్వీసులలో నియామకాలను రెండు వేర్వేరు పరీక్షల ద్వారా చేపట్టాలని తాజాగా నిర్ణయించింది. సాంకేతికేతర సర్వీసులకు సివిల్ సర్వీసెస్ పరీక్షలు (సీఎస్ఈ), సాంకేతిక సర్వీసులకు ఇంజినీరింగ్ సర్వీస్ పరీక్షలు (ఈఎస్ఈ) నిర్వహిస్తారు. ఈ పరీక్షలను యూపీఎస్సీ చేపడుతుంది. ఈ మేరకు రైల్వే మంత్రిత్వ శాఖ శనివారం టెలీకమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖకు ఓ లేఖ రాసింది. దానిపై 'ఎలాంటి జాప్యం లేకుండా' అని పేర్కొంది. ఈఎస్ఈకి టెలీకమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ నోడల్ మంత్రిత్వ శాఖగా వ్యవహరిస్తుంది.రైల్వే శాఖలో సాంకేతిక, సాంకేతికేతర సిబ్బంది అవసరాలను పరిగణనలోకి తీసుకొని ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతున్నామని సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ తన ఆఫీస్ మెమొరాండంలో తెలియజేసింది. సర్వీసుల విలీనం తర్వాత సాంకేతిక అధికారుల కొరత పెరిగిన నేపథ్యంలో విలీన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

7 నుంచి స్పెషల్ రౌండ్ కౌన్సిలింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్ ఎడ్‌సెట్ - 2024 స్పెషల్ రౌండ్ కౌన్సిలింగ్‌ను ఈ నెల 7 నుంచి నిర్వహించనున్నట్టు టీఎస్ ఎడ్ సెట్-2024 అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ పి.రమేశ్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫేస్ 1, ఫేస్ 2లో రిజిస్టర్, సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసుకోని అభ్యర్థులు ఈ దఫా రిజిస్టర్‌తో పాటు స్కాన్ చేసిన ఒరిజినల్ కాపీలను అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇది వరకే రిజిస్టర్ చేసుకుని, సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన అభ్యర్థులు నేరుగా వెబ్ ఆప్షన్లను పెట్టుకోవాలని సూచించారు.

నయా ఉదారవాద విధానాలపై పోరాడి
ఫాసిజాన్ని పాతిపెట్టాలి

- సామ్రాజ్యవాదంపై పోరాడి లెనిన్ వారసత్వాన్ని నిలబెట్టాలి : విశాఖ లెనిన్ శత వర్ధంతి సభలో ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్



విశాఖ : ఫాసిజాన్ని ఓడించాలంటే దానికి మూలమైన నయా ఉదారవాద విధానాలపై నిరంతరం పోరాడాలని ప్రముఖ ఆర్థికవేత్త, ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ పిలుపునిచ్చారు. సోవియట్ సోషలిస్ట్ విప్లవ రథసారథి, సమసమాజ నిర్మాత వి.ఐ.లెనిన్ శత వర్ధంతి సభ విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఆదివారం జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. తొలుత లెనిన్ చిత్రపటానికి, ఇటీవల కన్నుమూసిన సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ అంశాలపై సెమినార్లు జరిగాయి. 'లెనిన్ విప్లవ జీవితం - సోషలిస్టు విప్లవం - నేటి సామ్రాజ్యవాదం', అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ప్రభాత్ పట్నాయక్, 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి - లెనినిస్టు దృక్పథం- ప్రత్యామ్నాయ విధానాలు అంశంపై సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. లోకనాధం, 'లెనినిజం - వర్తమానం-కర్తవ్యం' అంశంపై మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్ శర్మ కీలక ఉపన్యాసం చేశారు. ప్రభాత్ పట్నాయక్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదం, ఫాసిజంపై పోరాటానికి లెనిన్ రచనలే ఆయుధమన్నారు. గతంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాలు సామ్రాజ్యవాదుల మధ్య ఘర్షణ వల్లే తలెత్తాయని, ఆ కాలంలోనే ప్రపంచంలోని పలు దేశాలు సామ్రాజ్యవాద వలసల నుంచి బయటపడ్డాయని వివరించారు. మార్క్స్, ఎంగెల్స్ చూపిన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడానికి లెనిన్ తగిన ప్రణాళిక వేశారన్నారు. 1917లో రష్యాలో సోషలిజం విజయానికి బాటలు వేశారని తెలిపారు. కార్మికవర్గ పార్టీ ఎలా ఉండాలో తెలియజెప్పిన మహోపాధ్యాయుడు లెనిన్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో అనేక దేశాలు వలసల నుంచి విముక్తి పొంది 1917 తర్వాత స్వాతంత్ర్యం సాధించాయన్నారు. నయా ఉదారవాద విధానాల అమలుకు ముందు మన దేశంలో చిన్నచిన్న ఉత్పత్తిదారులకు పంటల మద్దతు ధరలను ప్రభుత్వాలు ఇచ్చాయని గుర్తు చేశారు. పెట్టుబడులు సమకూర్చాయన్నారు. పరిశోధనలకు ప్రాధాన్యమిచ్చి నీటిపారుదల సౌకర్యాలను సమకూర్చి, ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేశాయని తెలిపారు. ప్రభుత్వ జోక్యం అన్ని విషయాల్లోనూ ఉండడంతో దేశంలో అనేక రంగాలు అభివృద్ధి జరిగి ఉపాధి పెరిగి, వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి ఎంతోకొంత జరిగిందన్నారు. నయా ఉదారవాద విధానాలు అమలయ్యాక ప్రభుత్వాలు ద్రవ్యలోటును తగ్గించుకుంటూ ప్రజలపై భారాలు వేశాయని తెలిపారు. వ్యవసాయం దెబ్బతిందన్నారు. వ్యవసాయం చేయలేక ఆత్మహత్యలు చేసుకునేవారి సంఖ్య గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసల సంఖ్య పెరిగిపోయిందని తెలిపారు. 1991-2011 మధ్యకాలంలో 1.4 కోట్ల మంది వ్యవసాయం వదిలేసి వేర్వేరు పనులకు ఇలా వెళ్లిపోయారన్నారు. నేడు అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలపై పెత్తనం చెలాయించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని, ఇజ్రాయిల్, ఉక్రెయిన్‌లను పావులుగా వాడుకుంటోందని తెలిపారు. గతేడాది నుంచి ఇజ్రాయిల్‌తో పాలస్తీనాపై దాడులు చేయిస్తోందన్నారు.

పశ్చిమాసియా దేశాలకు విస్తరించేందుకు అమెరికన్ సామ్రాజ్యవాదం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని వివరించారు. ప్రపంచ చమురు ఉత్పత్తులపై అమెరికా పెత్తనం కోసం రష్యా, చైనా దేశాలను దెబ్బకొట్టే చర్యలను తీవ్రం చేసిందన్నారు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రమాదాన్ని వివరించారు. నయా ఉదారవాద విధానాలను అమలు జరిపించడం ద్వారా పలు దేశాల్లో సహజ వనరులను దోపిడీ చేయడం, ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య యుద్ధ వాతావరణం పెంపొందించడం వంటివి చర్యలకు పాల్పడుతోందని వివరించారు. ప్రపంచంలో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి, రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం దీనికి ఒక తార్కాణమని పేర్కొన్నారు. నయా ఉదారవాద విధానాలు దేశ సార్వభౌమత్వంపై దాడిని పెంచుతూ దేశాన్ని ఫాసిజం వైపునకు తీసుకెళ్తాయని ప్రభాత్ పట్నాయక్ ఆందోళన చెందారు. ఉదారవాద విధానాలతో స్థూల జాతీయోత్పత్తి రేటు పెరుగుతున్నట్టు పాలకులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. సామ్రాజ్యవాదంపై పోరాడడం ద్వారా లెనిన్ వారసత్వాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు.

ఎల్జీకి ఆ అధికారం లేదు

- మంత్రిమండలి నిర్ణయం తప్పనిసరి
- సభ్యుల నామినేషన్‌పై జమ్మూకాశ్మీర్ పార్టీల మనోగతం
- న్యాయ నిపుణుల భిన్నాభిప్రాయాలు



శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ శాసనసభ ఎన్నికలలో ఏ పార్టీకి లేదా కూటమికి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ లభించదని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేసిన నేపథ్యంలో... లెఫ్టినెంట్ గవర్నర్ ఐదుగురు సభ్యులను శాసనసభకు నామినేట్ చేసే విషయం రాజకీయ పార్టీలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో మంత్రిమండలి ఏర్పడిన తర్వాత దాని సలహా, సూచన మేరకే లెఫ్టినెంట్ గవర్నర్ సభ్యులను నామినేట్ చేయాల్సి ఉంటుందని ప్రతిపక్ష పార్టీలు అభిప్రాయపడ్డాయి. అయితే ఆ అవసరం లేదని బీజేపీ చెబుతోంది. న్యాయ నిపుణులు సైతం దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. శాసనసభకు అదనంగా నామినేట్ అయ్యే సభ్యులకు ఇతర ఎమ్మెల్యేలకు ఉండే అధికారాలు, ఓటింగ్ హక్కులు ఉంటాయి. ఐదుగురి నామినేషన్‌తో శాసనసభలో సభ్యుల సంఖ్య 95కు పెరుగుతుంది. అప్పుడు ప్రభుత్వ ఏర్పాటుకు 48 మంది సభ్యుల మద్దతు అవసరమవుతుంది. పద్ధతి ప్రకారం అయితే ఎన్నికైన ప్రభుత్వమే సభ్యులను నామినేట్ చేయాలని, అంతేకానీ నామినేటెడ్ సభ్యుడైన వ్యక్తి (లెఫ్టినెంట్ గవర్నర్) సభ్యులను ఎలా నామినేట్ చేస్తారని నేషనల్ కాన్ఫరెన్స్ ప్రతినిధి ఇమ్రాన్ నబీ దార్ ప్రశ్నించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కేంద్రం విస్మరించరాదని ఆయన అన్నారు. మంత్రిమండలి సలహా తీసుకోకుండా సభ్యులను నియమించే అధికారం లెఫ్టినెంట్ గవర్నరుకు లేదని చెప్పారు.

మంత్రిమండలి సలహా తీసుకోకుండా సభ్యులను నామినేట్ చేయడమంటే ప్రజాతీర్పును నీరుకార్చడమే అవుతుందని పీడీపీ సీనియర్ నేత మెహబూబ్ బేగ్ తెలిపారు. జమ్మూకాశ్మీర్ పునర్విభజన చట్టం ప్రకారం శాసనసభకు సభ్యులను నామినేట్ చేసే ముందు లెఫ్టినెంట్ గవర్నర్ మంత్రిమండలి సలహా తీసుకోవాల్సిన అవసరం లేదని జమ్మూకాశ్మీర్ మాజీ న్యాయ కార్యదర్శి మహమ్మద్ అష్రఫ్ మిర్ అభిప్రా యపడ్డారు. అయితే శాసనసభకు ఏకపక్షంగా సభ్యులను నామినేట్ చేసే అధికారం లెఫ్టినెంట్ గవర్నరుకు ఉండదని సుప్రీంకోర్టు న్యాయవాది షరీక్ రియాజ్ చెప్పారు.

మీ పాత స్పీచ్‌లు..
బీజేపీ వైఫల్యాలను కప్పిపుచ్చలేవు

- మోడీపై ఖర్గే విమర్శలు



న్యూఢిల్లీ: ప్రధాని మోడీపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని ఎప్పుడూ పాత ప్రసంగాలే చేస్తున్నారని.. మళ్లీ మళ్లీ వాటినే పునరావృతం చేసినా దేశ ఆర్థిక వ్యవస్థలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చలేరన్నారు. మేకిన్ ఇండియా విఫలమైందన్న ఖర్గే.. ప్రజలపై గృహ రుణాల భారం, ధరల పెరుగుదల, తయారీ రంగంలోని సమస్యలను లేవనెత్తారు. 2013-14 నుంచి నేటి వరకు గృహ సంబంధిత ఖర్చులు 241 శాతం పెరిగాయి. జీడీపీలో గృహ రుణం ఎన్నడూ లేని విధంగా పెరిగింది. కొవిడ్ సమయం నుంచి ప్రజలకు ఆదాయం కంటే ఖర్చు రెట్టింపైంది" అని ఖర్గే 'ఎక్స్'లో పేర్కొన్నారు.

"గతేడాదితో పోలిస్తే.. ప్రస్తుతం నిత్యావసరాల ధరలు పెరిగాయి. మేకిన్ ఇండియా ఘోరంగా విఫలమైంది" అంటూ రాహుల్ గాంధీ మండిపడ్డారు.

9న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా
ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేత



సీఎస్ శాంతి కుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈనెల 9న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమ ఏర్పాట్లపై ఆమె సంబంధిత కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో ఆదివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా సీఎస్ శాంతకుమారి మాట్లాడుతూ దాదాపు 10 వేలకుపైగా ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈ నియామక పత్రాలను జారీ చేస్తున్నట్టు తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల కు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను సంబంధిత జిల్లా కలెక్టర్లు పూర్తి చేశారనీ, సోమవారం సాయంత్రంలోగా తుది జాబితాను పాఠశాల విద్యా కమిషనర్ సంబంధిత జిల్లా కలెక్టర్లకు అందజేస్తారని తెలిపారు. ఈనెల 9న ఎంపికైన ఉపా ధ్యాయ అభ్యర్థులందరినీ మధ్యాహ్నం రెండు గంటల లోపే ఎల్.బి.స్టేడియానికి చేరేలా తగు ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులను హైదరాబాదుకు చేరవేయడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి బస్సులో ఒక పోలీస్ కానిస్టేబుల్, సమన్వయ అధికారిని నియమించాలని సూచించారు. జిల్లా నుంచి వచ్చే బస్సులను వేదికకు సమీపంలోనే తగు పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అభ్యర్థులను స్టేడియం సమీపంలోనే దించే విధంగా చర్యలు చేపట్టాలని నగర పోలీస్ కమిషనర్‌కు సూచించారు. నగరంలో వర్షం వచ్చే అవకాశం ఉన్నందున రేయిన్ ప్రూఫ్ షామియానాను వేయాలని ఆదేశించారు. ఈ ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేసే కార్యక్రమానికి అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా వచ్చే అవకాశం ఉన్నందున తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. స్టేడియంలో అభ్యర్థులకు నియామక పత్రాలు అంద చేసేందు కుగాను జిల్లాల వారీగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, అడిషనల్ డీజీ మహేష్ భగవత్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ స్వగృహ'.. ఫర్ సేల్

మిగిలిన ప్లాట్లు, ఖాళీ స్థలాల అమ్మకం

- అసంపూర్తి ఇండ్లు ఉన్నవి ఉన్నట్టుగానే విక్రయం
- త్వరలో సర్కార్ కొత్త ధరలు నిర్ణయించే ఛాన్స్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాజీవ్ స్వగృహలో మిగిలిపోయిన ప్లాట్లు, ఖాళీ స్థలాలను విక్రయించాలని సర్కార్ భావిస్తోంది. అసంపూర్తిగా ఉన్న ఇండ్లను సైతం ఉన్నవి ఉన్నట్టుగా అమ్మకానికి పెట్టనున్నారు. అలాగే గతంలో అమ్ముడుపోగా అసంపూర్తిగా మిగిలి ఉన్న ఇండ్లతో పాటు, మరిన్ని ఇండ్ల నిర్మాణం కోసం కేటాయించిన భూములను కూడా అమ్మి నిధులను సమీకరించుకోవాలనే ఆలోచనతో సర్కార్ ఉన్నది. ఇందుకోసం ప్లాట్లకు ధరలను నిర్ణయించేందుకు గతంలో వేసిన కమిటీ ఆయా ఇండ్ల పరిస్థితి, అక్కడి మార్కెట్ డిమాండ్ ఆధారంగా ధరలను సిఫార్సు చేస్తూ ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వం మరికొద్ది రోజుల్లో అధికారికంగా ధరలను వెల్లడించి లాటరీ లేదా వేలం పద్ధతిలో ఇండ్లను విక్రయించాలనే ఆలోచన చేస్తున్నది. ఇలా ఇండ్లు, ఖాళీ స్థలాలను అమ్మగా వచ్చే నిధులను సగం కట్టి మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, కొత్తగా ప్రభుత్వం నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్లకు వినియోగించేందుకు ప్రభుత్వం ప్లానింగ్ చేస్తున్నట్టు సమాచారం. సర్కార్ నిర్ణయం వెలువడిన వెంటనే విక్రయానికి సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేయనున్నట్టు తెలుస్తోంది. కాగా ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి గృహ నిర్మాణశాఖపై సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలోనూ రాజీవ్ స్వగృహ ఇండ్ల అంశం ప్రస్తావించారు. నిరుపయోగంగా ఉన్న ఇండ్లను వేలం వేయాలనీ, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు ఎంపికైన వారికి ఈ ఇండ్లను అప్పగించాలని సూచించారు. అలాగే నగరంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ బ్లాక్‌లకు మౌలిక వసతులు కల్పించి అర్హులైన వారికి అప్పగించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

గతేడాది ధరలు ఇలా..

ఆయా ప్రాంతాల్లో భూమి ధర, ఇండ్ల ధరను ప్రస్తుత కండిషన్ ఆధారంగా చూస్తే చదరపు అడుగు ధరను నిర్ణయిస్తూ కమిటీ సభ్యులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అధికారికంగా ధరను ఖరారు చేసిన తర్వాత ఇండ్ల అమ్మకపు ప్రకటన వెలువడనుంది. కాగా గతంలో వైఎస్ హయాంలో నిర్మించిన ఇండ్లు, ప్లాట్లు చాలా నిరుపయోగంగా ఉన్నాయి. ఈ ఇండ్లకు ఇప్పటికే ఆరుసార్లు వేలం వేయగా.. చాలా పాట్లు, ఖాళీ ప్లాట్లు అమ్ముడుపోకుండా మిగిలిపోయాయి. గతేడాది పోచారంలో చదరపు అడుగు ధర రూ.1,600 వరకు ఖరారు చేశారు. వాటిని కొన్నవారు చదరపు అడుగుకు రూ.1000 ఖర్చు చేసి ప్రయివేటు బిల్డర్లతో ఇండ్లను సిద్ధం చేసుకున్నారు. వెరసి ఒక్కో ప్లాట్ చదరపు అడుగు ధర దాదాపు రూ.3వేలు పలికినట్టు అయ్యింది. ఆ ప్రాంతంలో ప్రయివేట్ నిర్మాణ దారులు చదరపు అడుగును రూ.5 వేల వరకు అమ్ముతున్నారు. ఇక గాజులరామారంలో చదరపు అడుగును రూ.1,600 చొప్పున కొనుగోలు చేయగా, చదరపు అడుగుకు రూ. 1,100 చొప్పున ఖర్చు చేశారు. ప్రస్తుతం అక్కడ చదరపు అడుగుకు ధర రూ.6వేలకు పైగా పలుకుతోంది. మిగిలిన ప్లాట్లను పాత ధరలకు 5-10 శాతం వరకు పెంచి విక్రయిస్తారా..? లేదా బిల్డర్ రేట్లకే విక్రయిస్తారా..? అనేది త్వరలోనే తెలియనుంది.

జిల్లాలో ఇండ్లు, స్థలాలు ఇలా..

ప్రస్తుతం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పోచారం, నాగోలు సమీపంలోని బండ్లగూడ, గాజుల రామారం, జవహర్‌నగర్‌లో ఇండ్లు ఉన్నాయి. నిర్మాణాలు చేపట్టకుండా ఉన్న ఖాళీ భూములు సైతం 135 ఎకరాల వరకు ఉన్నాయి. ఇక ప్రస్తుతం చిన్న చిన్న పనులు, మరమ్మతులు మినహా మిగతా మొత్తం ఉన్న ఇండ్లు నాగోలు సమీపంలోని బండ్లగూడ, ఘట్‌కేసర్ పరిధిలోని పోచారంలో మాత్రమే ఉన్నాయి. సింగిల్ బెడ్‌రూమ్ ప్లాట్లు బండ్లగూడలో 105, పోచారంలో 255 ఉన్నాయి. డబుల్ బెడ్‌రూమ్ ప్లాట్లు బండ్లగూడలో 19, పోచారంలో 340 ఉన్నాయి. త్రిబుల్ బెడ్‌రూమ్ ప్లాట్లు బండ్లగూడలో 08, పోచారంలో 04 ఉన్నాయి. సీనియర్ సిటిజన్స్ ప్లాట్లు బండ్లగూడలో 24 సిద్ధంగా ఉన్నాయి. ఇలా బండ్లగూడలో మొత్తం 160 వరకు ప్లాట్లు, పోచారం టౌన్‌షిప్‌లో మొత్తం 600 వరకు ప్లాట్లు, దాదాపు 1300 వరకు ఓపెన్ ప్లాట్లు, 350 వరకు ఇండ్లు అమ్ముడు పోలేదు. గాజుల రామారంలో 408 ప్లాట్లు అసంపూర్తిగా ఉన్నాయి. ఒక్కొక్కటి 8 అంతస్తులుగా ఉన్న 5 టవర్లు ఇక్కడ ఉన్నాయి. వీటిలో 3 బీహెచ్‌కే ప్లాట్ల టవర్లు 3, 2 బీహెచ్‌కే ప్లాట్ల టవర్లు 2 ఉన్నాయి.

పోచారంలో పూర్తయిన ఇండ్లలో జీ ప్లస్ 9 అంతస్తులతో కూడిన 19 టవర్లుంటే.. వీటిలో చాలా పనులు చేసుకోవాల్సిన అసంపూర్తి ఇండ్ల టవర్లు 8 ఉన్నాయి. గతేడాది రెండు టవర్లను అమ్మగా ఇంకా ఆరు మిగిలి ఉన్నాయి. వీటిలో పైకప్పులు నిర్మించినవి 376 ఉన్నాయి. మిగతా టవర్లలో పైకప్పులు నిర్మిస్తే మొత్తం 694 ప్లాట్లు అందుబాటులోకి వస్తాయి. టవర్ల మధ్యలో 19 ఎకరాల ఖాళీ స్థలం కూడా ఉంది.



ఎఫ్ఐఆర్ నమోదైనా

మారని విషోన్మాదం

- తాజాగా ముస్లింలపై హింసకు ఘజియాబాద్ స్వామి పిలుపు
- ఎలాంటి చర్యలూ తీసుకోని పోలీసులు
- ముస్లిం సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తల ఆగ్రహం

లక్నో : ద్వేషపూరిత ప్రసంగాల విషయంలో యూపీలో స్వామి రామ స్వరూపానందపై ఎఫ్ఐఆర్ దాఖలు అయినప్పటికీ ఆయన తీరులో మార్పు రాలేదు. తాజాగా ముస్లింలపై హింసకు ఆయన పిలుపునిచ్చాడు. ఇదంతా వారం వ్యధిలోనే జరగటం గమనార్హం. అయితే, తాజా వ్యాఖ్యలకు సంబంధించి సదరు స్వామిపై పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవటం గమనార్హం. దీంతో ఇటు స్వామి, అటు పోలీసు అధికారుల తీరుపై ముస్లిం సంఘాల నేతలు, సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామస్వరూపానంద సమాజంలో శత్రుత్వాన్ని, ద్వేషాన్ని పెంచుతున్నారని దలన్‌వాలా పోలీసులు ఆయనపై సుమోటో చర్యను తీసుకున్నారు. ఆయనపై ఎఫ్ఐఆర్‌ను దాఖలు చేశారు. ద్వేషపూరిత ప్రసంగాలపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయనపై చర్య తీసుకున్నట్టు దలన్‌వాలా పోలీసులు ఇప్పటికే వెల్లడించారు. ఒక తరగతికి వ్యతిరేకంగా హింసకు ఆయన పిలుపునిచ్చారు. గత నెల 14 నుంచి 18 మధ్య ఘజియాబాద్‌లోని ఒక ఫామ్‌హౌజ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ముస్లింలకు వ్యతిరేకంగా ఆయుధాలు పట్టాలని ఈ కార్యక్రమానికి వచ్చిన భారీ జనసందోహాన్ని ఉద్దేశిస్తూ ఆయన అన్నట్టు ఆ వీడియోలో ఉన్నది. దీనిపై స్థానిక ఏసీపీ అభిషేక్ శ్రీవాస్తవను ప్రశ్నించగా.. ఆయన స్పందించలేదు.

ద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తూ సమాజంలో అలజడిని సృష్టిస్తున్న రామస్వరూపానందపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. యూపీలోని యోగి పాలనలో ముస్లింలపై ద్వేషపూరిత వ్యాఖ్యలు నిత్యకృత్యమయ్యాయనీ, వీటికి అడ్డుకట్ట పడాల్సిన అవసరం చాలా ఉన్నదని వారు అంటున్నారు.

వ్యవసాయం కార్పొ'రేట్ల'కే

మోడీ 3.0లో ప్రతీ చర్యా అటు వైపే

- కార్పొరేట్‌కు అనుకూలం.. రైతులకు వ్యతిరేకం
- కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు కోత
- పరిశోధనల కోసం బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు
- తప్పదోవ పట్టిస్తున్న కార్పొరేటు మీడియా
- కేంద్రం విధానాలతో అన్నదాతల జీవనోపాధికి ముప్పు
- విశ్లేషకులు, నిపుణుల హెచ్చరిక



న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కారు వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అనుకూలంగా మారుస్తున్నది. రైతన్నలకు మాత్రం ఇబ్బందులను తీసుకొస్తున్నది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని చెప్పి కేంద్రంలో 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. అయితే, రైతుల ఆదాయం రెట్టింపు కాకపోగా.. వారికి కష్టాలు తీవ్రమయ్యాయి. అదే మోడీ 2.0 పాలనలోనూ కొనసాగింది. ఆ తర్వాత మూడు వివాదాస్పద సాగు చట్టాలు తీసుకొచ్చి కార్పొరేట్లకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించే యత్నాన్ని చేసింది మోడీ సర్కారు. అయితే, కేంద్రం కుట్రలను గ్రహించిన రైతన్నలు తమ పోరాటాలతో ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా చేశారు. దిగొచ్చిన మోడీ సర్కారు సాగు చట్టాలను వెనక్కి తీసుకున్నది. మోడీ 2.0 పాలనలో ఇది రైతన్నల పెద్ద విజయంగా చెప్పొచ్చు.

బీజేపీకి స్పష్టమైన మెజారిటీ లేక 2024లో కేంద్రంలో సంకీర్ణ మోడీ సర్కారు మూడోసారి అధికారంలోకి వచ్చింది. గతంలోలా కాకుండా ఈ సారి కచ్చితంగా మిత్రపక్షాల దయదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితులు కేంద్రంలోని బీజేపీకి ఏర్పడ్డాయని కొందరు వ్యాఖ్యానించారు. కానీ మోడీ 3.0 సర్కారు తన రైతు వ్యతిరేక విధానాన్ని వీడటం లేదని విశ్లేషకులు చెప్తున్నారు. మోడీ సర్కారు విధానాల తీరే అందుకు నిదర్శనంగా ఉన్నదని వారు అంటున్నారు. గత మోడీ ప్రభుత్వ హయాంలో ప్రధాన విధాన నిర్ణయాలకు బాధ్యత వహించే వ్యక్తులను కీలక నాయకత్వ స్థానాల్లో కొనసాగించటం ఇందుకు నిదర్శనమని చెప్తున్నారు.

రైతులపై కాల్పులు జరిపించిన శివరాజ్‌సింగ్ చౌహాన్ వ్యవసాయ మంత్రి

మోడీ సర్కారు.. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ కీలక నాయకుడు శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా నియమించింది. అయితే, శివరాజ్‌సింగ్ చౌహాన్ సీఎంగా ఉన్న సమయంలో 2017, జూన్‌లో ఎంపీలోని మందసౌర్‌లో పోలీసు కాల్పుల్లో ఆరుగురు రైతులు మరణించారు. అన్ని పంటలకు న్యాయమైన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో పాటు 50 శాతంతో రుణమాఫీ, రైతు ఆత్మహత్యలకు పరిష్కారం కోరుతూ రైతులు చేసిన నిరసనలో శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వం రైతన్నలపై గన్ను ఎక్కుపెట్టి వారిని అక్షరాల హత్య చేసిందని కొందరు సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాంటి నాయకుడిని తీసుకొచ్చి ఇప్పుడు కేంద్ర వ్యవసాయ మంత్రిని చేయటం ఎంత వరకు సబబు అని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్ణయం భారత్‌లోని రైతులు, వ్యవసాయ సంక్షోభం పట్ల ఎన్డీయే ఆలోచనా విధానం, దృక్పథానికి నిదర్శనమని చెప్తున్నారు.

పీఎం-కిసాన్‌పై తప్పదారి పట్టించే ప్రచారాలు

కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు నయా ఉదారవాద అజెండాను ముందుకు తీసుకుపోతున్నదనీ, ఇందులో భాగంగా వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేటీకరణ చేసే దిశంగా కృషి చేస్తున్నదని రైతు సంఘాల నాయకులు వాపోతున్నారు. మోడీ 3.0 సర్కారు నిర్ణయాలు ఈ ధోరణిని ధృవీకరిస్తున్నాయని చెప్తున్నారు. రైతులకు వ్యతిరేకంగా, కార్పొరేటు లాభాలను పెంచుకోవటమే లక్ష్యంగా మోడీ సర్కారు పెట్టుకున్నదని వారు అంటున్నారు.

మీడియా సైతం ఈ విషయంలో ప్రభుత్వానికి అనుకూలంగా ప్రచారం చేస్తూ, రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని కొందరు సామాజికవేత్తలు చెప్తున్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన (పీఎం-కిసాన్) యోజన కింద రూ. 2వేలు పంపిణీ చేయటం కేవలం పైకి కనిపించే విషయమేననీ, అయితే ఈ చెల్లింపు ప్రతి రైతు కుటుంబానికి నెలకు కేవలం రూ.500 మాత్రమేనని వారు అంటున్నారు. ఈ పథకం రైతులను లాభసాటి ధర కోసం వారి న్యాయమైన డిమాండ్ నుంచి దృష్టిని మరల్చటానికి రూపొందించబడిందిగా కొందరు అభివర్ణిస్తున్నారు. 2019లో విడుదలైన పీఎం-కిసాన్ మొదట్లో 14.5 కోట్ల మంది రైతులకు సహాయం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే, అది 9.3 కోట్ల మంది రైతులకు తగ్గటం పథకం తీరుకు అద్దం పడుతున్నది. ఈ విషయాన్ని సాక్షాత్తూ ప్రభుత్వ గణాంకాలే తెలియజేయటం గమనార్హం. ఇక ఖరీఫ్ పంటలకు ఎంఎస్‌పీ ఉత్పత్తి ఖర్చు కంటే 1.5 రెట్లు నిర్ణయించబడిందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రి ప్రకటించారు. అయితే, దీనిపై ఎలాంటి విమర్శనాత్మక పరిశీలన లేకుండానే ప్రభుత్వ కథనాన్ని కార్పొరేటు మీడియా తీవ్రంగా ప్రచారం చేసింది.

డిజిటలైజేషన్ పేరుతో కార్పొరేట్ చేతిలోకి

వ్యవసాయాన్ని కార్పొరేటీకరించే ప్రయత్నాలను మోడీ సర్కారు ఆది నుంచే చేస్తున్నదనీ, ఇందుకోసం పలు ప్రయత్నాలు చేసిందని కొందరు విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా, కేంద్ర మంత్రి వర్గం గత నెల 2న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ (డీఏఎం)పై దృష్టి సారించి ఏడు కొత్త పథకాలను ప్రారంభించాలని నిర్ణయించింది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకయ్యే దీని మొత్తం వ్యయం రూ.14 వేల కోట్లు. వాస్తవానికి, భారత్‌లో ఉండే రైతులు చిన్న, సన్నకారు, భూమిలేని, భాగస్వామ్య రైతులు. వీరు వ్యాపార ఆధారిత డిజిటలైజేషన్‌తో కలిసిపోతే.. దోపిడీ సంస్థలు వ్యవసాయ ఉత్పత్తిపై ఆధిపత్యం చెలాయిస్తాయనీ, దీంతో రైతుల జీవనోపాధికి ముప్పు వాటిల్లుతుందని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే, వ్యవసాయ పరిశోధనను సైతం కార్పొరేటీకరించే చర్యలను మోడీ 3.0 సర్కారు మొదలు పెట్టిందని చెప్తున్నారు. ఇందులో భాగంగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)తో బేయర్, సింజెంటా, అమెజాన్ వంటి బహుళజాతి సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వ్యవసాయ పరిశోధన రంగంలోకి ఇవి భారీగా ప్రవేశిస్తే భవిష్యత్తుపై ప్రమాదంలో పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వ్యవసాయ కార్పొరేటీకరణ కోసం బడ్జెట్

మోడీ 3.0 బడ్జెట్ ఫెడరల్ స్ఫూర్తిని ఉల్లంఘిస్తూ బడ్జెట్‌ను తీసుకొచ్చిందన్న ఆరోపణలు ప్రతిపక్షాలు ఇప్పటికే చేశాయి. అలాగే, వ్యవసాయ వ్యాపార లాభాలను పెంచటానికి, వ్యవసాయాన్ని మరింత కేంద్రీకరణ, కార్పొరేటీకరణ చేయటానికి బడ్జెట్‌లో దారులు సుగమం చేసిందని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. మొత్తం బడ్జెట్‌లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు కేటాయింపులు 2019లో 5.44 శాతం నుంచి 3.15 శాతానికి తగ్గిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు కేటాయింపులతో పోలిస్తే ఇది 21.2 శాతం తగ్గింపును సూచిస్తున్నది. అలాగే, పంటల పెంపకానికి కేటాయింపులు 24.7 శాతం, ఎరువులకు నిధులు గతేడాదితో పోలీస్తే దాదాపు 34.7 శాతం తగ్గాయి. మొత్తంగా, రూ.87,238 కోట్లు తగ్గినట్టుగా తెలుస్తున్నది. బడ్జెట్‌లో ఈ కోతలు వ్యవసాయ ఉత్పాదకతను ప్రతికూలంగా ప్రభావితం చేసే ప్రమాదమున్నదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న బీజేపీ

సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిటాస్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గవర్నర్లను స్వతంత్రంగా వ్యవహరించకుండా బీజేపీ దుర్వినియోగం చేస్తున్నదని సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిటాస్ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మలయాళీ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేరళ కామ్రేడ్స్‌తో ఆయన సమావేశమయ్యారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ సిటీ సెంట్రల్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేరళ ప్రజలు ఎన్నుకున్న అక్కడి వామపక్ష ప్రభుత్వాన్ని పాలన చేయకుండా గవర్నర్ ద్వారా బీజేపీ ఇబ్బందులు పెడుతున్నదన్నారు. ఆ గవర్నర్ యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్లను నియమించకుండా ప్రభుత్వ సిఫారసులను పెండింగ్‌లో పెడుతూ ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. బీజేపీకి రామునిపై భక్తి కన్నా తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడమే తెలుసని విమర్శించారు. అధికార బీజేపీకి భయపడకుండా ప్రతీ సందర్భంలో, అంశంలో సీపీఐ(ఎం) నికరంగా నిలబడి సమాధానిస్తున్నట్టు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్, బీహార్ ప్రాంతాలకు చెందిన వారిని ఓటర్లుగా చేర్చడం, కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీని మార్చి బలహీనమైన అభ్యర్థిని నిలబెట్టడం ద్వారా కేరళలో బీజేపీ ఒక ఎంపీ సీటు గెలుచుకుందని తెలిపారు. కమలం పార్టీ చేస్తున్న తప్పులను ప్రశ్నించకుండా మెజారిటీ మీడియా మౌనంగా ఉండిపోయిందనీ, సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచారాలను వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. వీటిని పార్టీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేరళ కామ్రేడ్స్ కో ఆర్డినేషన్ కన్వీనర్లు రాధాకృష్ణ, సంతోష్, కోర్ కమిటీ సభ్యులు కె.డి.ఉదయన్, కె.డి.దేవరాజన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



మీ రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్ ఇస్తే...

బీజేపీకి ప్రచారం చేస్తా

కేజ్రీవాల్ సవాల్

న్యూఢిల్లీ : ఢిల్లీ శాసనసభ ఎన్నికలు జరిగే లోగా బీజేపీ అధికారంలో ఉన్న 22 రాష్ట్రాలలో ప్రజలకు ఉచిత విద్యుత్ అందించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సవాలు విసిరారు. అలా చేస్తే ఢిల్లీ ఎన్నికలలో బీజేపీ తరపున ప్రచారం చేస్తానని చెప్పారు. జార్ఖండ్, మహారాష్ట్రలతో పాటే నవంబరులో ఢిల్లీ శాసనసభకు కూడా ఎన్నికలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు ఎన్నికలకు తమ పార్టీ సిద్ధంగా ఉన్నదని తెలిపారు. ఆదివారం నిర్వహించిన 'జనతా కీ అదాలత్' కార్యక్రమంలో కేజ్రీవాల్ ప్రసంగిస్తూ రాష్ట్రాలలో బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. హర్యానా, జమ్మూకాశ్మీర్‌లో బీజేపీ ఓటమి తప్పదని అన్నారు.

'డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలంటే ద్రవ్యోల్బణం, అవినీతి, నిరుద్యోగం' అని కేజ్రీవాల్ ఎద్దేవా చేశారు. హర్యానా, జమ్మూకాశ్మీర్‌లో బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు త్వరలోనే కుప్పకూలుతాయని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయని తెలిపారు. తమ ప్రభుత్వం విద్యుత్, నీరు, మహిళలకు బస్సు ప్రయాణం, వృద్ధులకు పుణ్యక్షేత్రాల సందర్శన, ఆరోగ్య రక్షణ, విద్య...వంటి ఆరు ఉచిత సేవలు అందించిందని చెప్పారు. ప్రజలు పొరబాటున బీజేపీకి ఓటేస్తే ఈ ఆరు ప్రయోజనాలూ కోల్పోతారని హెచ్చరించారు. ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వస్తే డీటీసీ, ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు ప్రైవేటు పరం అవుతాయని ఆరోపించారు. మణిపూర్‌లో ఏడు సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ ఆ రాష్ట్రాన్ని రావణకాష్టం చేసిందని మండిపడ్డారు. డబుల్ ఇంజిన్‌ను ఆయన డబుల్ దోపిడీ...డబుల్ అవినీతిగా అభివర్ణించారు. లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలో ఢిల్లీలో ప్రజాస్వామ్యం అనేదే లేకుండా పోయిందని అంటూ రాష్ట్రాన్ని 'ఎల్జీ రాజ్' నుండి విముక్తి చేస్తామని, రాష్ట్ర హోదా కల్పిస్తామని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు.

ప్రత్యామ్నాయం చూపకుండా

పేదల ఇండ్లు కూల్చితే ఊరుకోం

ముందు ఫామ్ హౌస్‌లు కూల్చండి.. మేమూ సహకరిస్తాం

- ఫార్మా వ్యర్థాలను అడ్డుకునే దమ్ముందా..?
- కేంద్ర ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి
- కమ్యూనిస్టు అంటే లక్ష్మీదేవమ్మలా ఉండాలి : ఐద్వా నాయకులు
- లక్ష్మీ దేవమ్మ సంస్మరణ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

మూసీ సుందరీకరణ పేరుతో ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇండ్లు కూల్చితే ఊరుకోబోమని, నిర్వాసితులతో కలిసి ఆందోళనలు చేపడతామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. ఎక్కువ కాలం పరిపాలించిన కాంగ్రెస్ పాలనలోనే అక్రమ నిర్మాణాలు ఎక్కువగా జరిగాయని, ఇంటి నిర్మాణం కోసం అనుమతులు, విద్యుత్ మీటర్లకు అనుమతులు ఇచ్చిన అధికారుల సంగతేంటని ప్రశ్నించారు. సీపీఐ(ఎం) ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు ఎన్ఎస్ లక్ష్మీదేవమ్మ సంస్మరణ సభ ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కళ్యాణ్ సాయి ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అధ్యక్షతన జరిగింది. ముందుగా ఎన్ఎస్ లక్ష్మీదేవమ్మ చిత్రపటానికి తమ్మినేనితో పాటు మాజీ ఎంపీ, పార్టీ సీనియర్ నాయకులు పి.మధు, కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులు, కుటుంబసభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో తమ్మినేని మాట్లాడారు.

తెలంగాణ పాలకులకు చిత్తశుద్ధి ఉంటే పెద్దలు అక్రమంగా నిర్మించుకున్న ఫామ్‌హౌస్‌లు, కంపెనీలను కూల్చివేయాలని, ప్రభుత్వానికి సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ముఖ్యంగా కూల్చివేతలకు ముందు అన్ని రాజకీయ పార్టీల వైఖరిని పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసే రైతు చట్టాలు, కార్మికులకు గొడ్డలిపెట్టుగా మారే కార్మిక కోడ్‌లను తెచ్చి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న బీజేపీని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అడవి నరికి సుందరమైన పట్టణాలను నిర్మిస్తామంటే సీపీఐ(ఎం) వ్యతిరేకించి తీరుతుందని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పాక్షికంగానే అమలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రెండు లక్షల రుణమాఫీ సగం మందికే అందిందని, మిగతా వారికి ఎప్పటిలోగా అమలు చేస్తారని ప్రశ్నించారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం పని అయిపోయిందని అంటున్న వితండవాదులంతా ఒక్కసారి శ్రీలంక వైపు చూడాలన్నారు. గత ఎన్నికల్లో ముగ్గురు పార్లమెంటు అభ్యర్థులు ఉన్న ఆ దేశంలో ఈ సారి అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్న విషయం గుర్తించుకోవాలన్నారు. మనదేశంలో సైతం బీజేపీకి ఎదురులేదని చెప్పుకొని తిరుగుతున్న నాయకులకు.. మొన్న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఇండియా కూటమి సరిగ్గా పోటీ ఇచ్చి బీజేపీ దూకుడుకు కళ్లెం వేసిందని తెలిపారు. నాయకులు ఎవరైనా అనుకూల పరిస్థితుల్లో ఉద్యమాలు చేయడం కాదని, ప్రతికూల పరిస్థితుల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. కుటుంబంలో, పార్టీలో, సమాజంలో ఎక్కడైనా నిజమైన నాయకులు సరియైన నిర్ణయంతో ముందుకెళ్తారని, అందుకు లక్ష్మీదేవమ్మ ఉదాహరణ అన్నారు. ఆమె ఉన్నతమైన జీవన విధానంతో పాటు ఆదర్శవంతమైన కమ్యూనిస్టుగా బతికారని గుర్తు చేశారు. ఆమె లక్ష్యాన్ని నెరవేర్చడమే ఆమెకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.

మహబూబ్‌నగర్‌లో మహిళా ఉద్యమాన్ని ముందుండి నడిపారు : కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్ కుమార్

మహబూబ్‌నగర్‌లో మహిళా ఉద్యమాన్ని లక్ష్మీదేవమ్మ ముందుండి నడిపారని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఆర్. అరుణ్ కుమార్ అన్నారు. లక్ష్మీ దేవమ్మ హైదరాబాద్‌లో ఉంటూ మహబూబ్‌నగర్‌లో మహిళా ఉద్యమాన్ని నడిపారని తెలిపారు. కుటుంబంలోనైనా, పార్టీలోనైనా తనకు అప్పగించిన పనిని పూర్తి చేయడంలో లక్ష్మీదేవమ్మను చూసి మనం నేర్చుకోవాలన్నారు. పుస్తక రచన ద్వారా.. ఈ సమాజంలో మనం ఎలా ఉండాలి, ఎలాంటి సమస్యల కోసం ఉద్యమించాలో మనకు నేర్పించారని తెలిపారు. ఆమె భర్త శ్రీహరి.. కొన్ని కారణాల వల్ల పార్టీ మారినా తన నిబద్ధతతో పార్టీ మారకుండా నిక్కచ్చిగా పనిచేసిన విషయం గుర్తు చేశారు. నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు పోరు చేయడమే కాక, చనిపోయిన తర్వాత కూడా తన దేహాన్ని పరిశోధనా కేంద్రానికి ఇవ్వడం ఆమె సేవా దృక్పథానికి నిదర్శమన్నారు. పార్టీ పట్ల ఎంత నిబద్ధత ఉండేదంటే.. అజ్ఞాత సోదరిగా పార్టీకి నిధులు సమకూర్చేవారని అన్నారు. చదవడం, రాయడం, ప్రజలకు అర్థమయ్యే భాషలో చెప్పడం వంటి విషయాలు లక్ష్మీదేవమ్మకే సాధ్యమని చెప్పారు. ఈ మధ్యనే మరణించిన సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ బట్టాచార్య, లక్ష్మీదేవమ్మ మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. వారు నడిచిన బాటలో నడుస్తూ ప్రజాసమస్యలపై పోరాడటమే వారికి మనమిచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శులు ఏ.రాములు, పర్వతాలు, కార్యదర్శి వర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు, బాల్ రెడ్డి, మండలరాజు, జిల్లా కమిటీ సభ్యులు కిల్లెగోపాల్, ఆర్ శ్రీనివాసులు, కందికొండ గీత, కురుమూర్తి, లక్ష్మీదేవమ్మ కూతురు అరుణ, కుమారులు ఉదయ్ కుమార్, అర్జున్, మనమరాలు మమత తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఉద్యమానికి లక్ష్మీదేవమ్మ చేసిన సహకారం మరువలేనివి



మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో లక్ష్మి దేవమ్మ, ఆమె భర్త శ్రీహరి కమ్యూనిస్టు పార్టీ పునర్నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా రంగాపూర్ గ్రామంలో భూస్వాములు జాగిర్దారులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం సందర్భంగా నాటి ప్రభుత్వం 144 సెక్షన్ విధించి కమ్యూనిస్టులను అణిచివేసే ప్రయత్నం చేసిందన్నారు. ఆ సమయంలో తాను, లక్ష్మి దేవమ్మ.. ఆ గ్రామాలకు వెళ్లి పార్టీ సానుభూతిపరులకు, ప్రజలకు భరోసా కల్పించామని తెలిపారు. భూస్వాములకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమ బలోపేతానికి ఆనాడు లక్ష్మి దేవమ్మ రూ.75000 పార్టీకి విరాళంగా ఇచ్చి తన నిబద్ధతను చాటుకున్నారన్నారు. పెబ్బేరు మండలం గుమ్మడంలో ఓ మహిళ ఆకలి చావుకు గురైతే సీపీఐ(ఎం) చేసిన ఆందోళన ఫలితంగా కరువు ప్రాంతాలను పరిశీలించి కరువు పింఛన్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 250 అంబలి కేంద్రాలు ఏర్పాటు చేసి ఆకలి చావులను నిలువరించామని, ఈ సేవలకు నాడు లక్ష్మి దేవమ్మ మహిళా సంఘం ద్వారా చేసిన సహకారం మరువలేనిదన్నారు.

– మాజీ ఎంపీ, సీనియర్ నాయకులు పి. మధు

తెలుగు సాహిత్యంలో ఇప్పుడు ప్రధానంగా మైనారిటీ సాహిత్యం పేరుతో ముస్లింవాద మైనారిటీ సాహిత్యం మాత్రమే ప్రస్ఫుటంగా వస్తున్నది. భారతీయ సమాజంలో ఇతర మైనారిటీ సమూహాలున్న ఉదాహరణకు క్రిష్టియన్లు, సింధీలు, పారసీలు, జైనులు, బుద్ధిస్టులు వీరికి సంబంధించిన సాహిత్యం తెలుగులో మాత్రం అరుదుగా కనబడుతుంది. ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం సాహిత్య సందర్భంలో 'మైనారిటీ సాహిత్యం' అనే పదప్రయోగం ఎవరు, ఏ సందర్భంలో చేశారు? దాని ఉదేశ్యం, లక్ష్యం ఏమిటి? స్థూలంగా అవలోకనం చేయడమే. అంతర్జాతీయ తెరపై వాటి విశిష్టత, లక్షణాలు, లక్ష్యాలు ఏమిటి? అని పరిశీలించడమే.

మైనారిటీ సాహిత్యం అంతర్జాతీయ తెరపై ఓ చూపు



నిజానికి ఈ 'మైనారిటీ' అనే పదాన్ని సుప్రసిద్ధ ఫ్రెంచ్ ఫిలాసఫర్, సాహితీవేత్త గిల్లెస్ డెల్యూజ్ (Gilles Deleuze; b.1925 - d.1995), సుప్రసిద్ధ ఫ్రెంచ్ మనో విజ్ఞాన శాస్త్రవేత్త, రచయిత ఫెలిక్స్ గట్టారి (Felix Guattari ; b. 1930 - d. 1992) అనే ఇద్దరు సాహితీ విమర్శకులు సూచిస్తూ 'మైనారిటీ సాహిత్యం' అనేది మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి, మెజారిటీ వర్గానికి చెందిన వారి భాషలోనే అభివ్యక్తీకరించడం (అనగా రచన మైనారిటీ వర్గానికి చెందిన భాషలో ఉండకపోవడం) జరగాలి అని అభిప్రాయపడినారు.

కాఫ్కా, జెక్ (Czech) ప్రాంతానికి చెందిన యూదు (Jew) సామాజిక వర్గానికి చెందిన వారు. కానీ, రచనలు మాత్రం జర్మనీ భాషలో చేశారు. వీరు ప్రతిపాదించిన 'మైనారిటీ సాహిత్యం' అనే నిర్వచనం వారి దృక్పథంలో పరిశీలిస్తే కొంత వరకు మాత్రమే మైనారిటీలకు న్యాయం చేస్తున్నదని, పూర్తి మైనారిటీ వర్గాలను తన పరిధిలోకి తీసుకోవడం లేదనే భావనకు వచ్చారు సాహితీ విమర్శకులు. అందుకే మైనారిటీ సాహిత్యాన్ని పునర్నిర్వచనం చేయాలన్న ఆలోచనతో ఇటలీలో నివసించే స్లొవేనియన్ల సాహిత్యాన్ని, అలాగే స్లోవేనియా, క్రొయేషియాలో నివసించే ఇటాలియన్ల సాహిత్యాన్ని ఆధారంగా చేసుకుంటూ విశ్లేషిస్తూ వచ్చారు.

పరిచయం, నేపథ్యం : ప్రపంచీకరణ నేపథ్యంలో పెరుగుతున్న భిన్న సంస్కృతుల వెల్లువ కారణంగా, ఫలితంగా భిన్న సంస్కృతుల మధ్య పొడసూపుతున్న వైరుధ్యాలు ఉత్పన్నం కావడంతో 'తిరోగమన చర్య' (Reverse progress) లను రేకెత్తించడంతో ప్రాంతీయ ప్రాధాన్యమైన (region -specificity) లక్షణాలు – అస్తిత్వ చిహ్నాలు, స్థానిక, ప్రాంతీయ చరిత్ర వాటి మూలాలు, వ్యక్తులలో, జాతులలో కొత్త ప్రాధాన్యతను, స్థాయిని సంతరించుకున్నాయి. ఈ చిహ్నాలు ప్రతి జాతికి తమ సామాజిక, సాంస్కృతిక ఆవరణలలో తమ చరిత్రను స్థిరీకరించుకోవడానికి స్వీయ కార్యాచరణగా వుండే అవకాశముంటుంది. సాహిత్య సృజన ద్వారా కూడా వీటి ప్రాముఖ్యత ఉంటుంది. 'మైనర్ కమ్యూనిటీ', 'మైనారిటీ కమ్యూనిటీస్' – ఈ పదాలు చారిత్రాత్మక ప్రాధాన్యత గల ఒక జాతి సమూహాన్ని సూచిస్తాయి. ఈ జాతి సమూహం ప్రపంచంలోని ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి పెద్ద ఎత్తున వలస వచ్చి, శతాబ్దాల తరబడి పెద్ద పెద్ద నగరాలలో స్థిరపడిపోయిన వారిని తెలుపుతుంది. అంతర్జాతీయంగా చూస్తే, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఇటలీ, పూర్వ యుగోస్లావియా మధ్య సరిహద్దు ప్రాంతాలు విడిపోయి ఈ రోజు ఇటలీ, స్లోవేనియాగా గుర్తించబడుతున్నాయి. ఈ విభజన ఫలితంగా రెండు మైనారిటీ జాతి సమూహాలు పుట్టుకొచ్చాయి. ఒకటి – ఇటలీలో స్లోవేనియన్ మైనారిటీ, రెండవది – స్లోవేనియా, క్రొయేషియాలో ఇటలీ మైనారిటీ. ఈ నేపథ్యంలో ప్రాంతీయ స్పృహతో వస్తున్నటువంటి మైనారిటీ సాహిత్యాన్ని అంచనా వేస్తే స్థానికత లేదా ప్రాంతీయత ప్రధానమైన మూలకంగా మారుతుంది. ఎందుకనగా భిన్నత్వంగా వుంటూ తమ అస్తిత్వాన్ని, ఉనికిని నిలబెట్టుకునే ప్రయత్నంగా సాగుతుంది. ఆ ప్రయత్నం దిశగా సాగుతూ దేశ సరిహద్దులను దాటి కూడా దేశాంతర (Transnational) సాంస్కృతిక, సాహిత్య మూలాలను మైనారిటీ లేదా ప్రాంతీయ సాహిత్యం తనలో ఇముడ్చుకొని వుంటుంది. ఈ నేపథ్యంలో మైనారిటీ సాహిత్యాన్ని పునర్– నిర్వచించాల్సిన అవసరాన్ని సాహిత్య విమర్శనా రంగం గుర్తించింది. వ్యక్తి

> **ప్రపంచీకరణ నేపథ్యంలో పెరుగుతున్న భిన్న సంస్కృతుల వెల్లువ కారణంగా, ఫలితంగా భిన్న సంస్కృతుల మధ్య పొడసూపుతున్న వైరుధ్యాలు ఉత్పన్నం కావడంతో 'తిరోగమన చర్య' (Reverse progress) లను రేకెత్తించడంతో ప్రాంతీయ ప్రాధాన్యమైన (region -specificity) లక్షణాలు - అస్తిత్వ చిహ్నాలు, స్థానిక, ప్రాంతీయ చరిత్ర వాటి మూలాలు, వ్యక్తులలో, జాతులలో కొత్త ప్రాధాన్యతను, స్థాయిని సంతరించుకున్నాయి. ఈ చిహ్నాలు ప్రతి జాతికి తమ సామాజిక, సాంస్కృతిక ఆవరణలలో తమ చరిత్రను స్థిరీకరించుకోవడానికి స్వీయ కార్యాచరణగా వుండే అవకాశముంటుంది.**

ప్రవర్తన, మాట, సాంప్రదాయాలు, మానవీయత, భౌతిక, మానసిక స్థితులకు సంబంధించిన అంశాలమీద దృష్టి కేంద్రీకరించి పరిశోధనలు జరగాల్సిన అవసరముందని రచయిత్రి సెర్గళ్ (Jadranka Cergol) వ్యాఖ్యానించడమేగాక ఆ దిశగా ప్రత్యేక కృషి చేసింది.

మైనారిటీ సాహిత్యం : పరిశోధకులు గిల్లెస్ డెల్యూజ్, ఫెలిక్స్ గట్టారి, కాఫ్కా రచనల మీద చేసిన మోనోగ్రాఫ్‌లో సిద్ధాంతపరంగా, విధానపరంగా మైనారిటీ సాహిత్యానికి సంబంధించిన విషయం మొదటగా వివరించబడినది. వీరు మైనారిటీ సాహిత్యాన్ని మైనారిటీ వర్గం వారు, వారి మైనారిటీ భాషలో సృష్టించలేదని, మెజారిటీ వారి భాషలోనే వారి రచనలు సాగాయని గుర్తించారు. వీరి ఉద్దేశంలో మైనారిటీ సాహిత్యంలో మొదటి ప్రధాన లక్షణం ఏమిటంటే 'ప్రాదేశికత' (Deterritorialisation) అనగా వారి మాతృభాష నుండి రచనాపరంగా దూరంగా ఉండటం. రెండవ లక్షణం మైనారిటీ సాహిత్యంలో 'రాజకీయ సమగ్రత /నిబద్ధత' (Political integration). మూడవ లక్షణం – 'సామూహిక/ సంఘటిత విలువలు' (collective values) కలిగివుండటం. మైనారిటీ సాహిత్యం సాధారణంగా రాశిలో తక్కువగా వున్నా మైనారిటీ వర్గానికి చెందిన వారి లక్ష్యం ఒకటిగానే ఉండాలి (collective destiny). ఫలితంగా 'సామూహిక అభివ్యక్తీకరణగా' (collective expression) వుండి సమస్యలను సరియైన పద్ధతిలో సమాజం ముందు ప్రస్తావించవచ్చు. "మైనారిటీ సాహిత్యం అనే పదాన్ని ఒక స్వతంత్రమైన సాహిత్య వ్యవస్థగా చూడలేం" అని ఇటలీ లోని స్లోవేనియన్ సాహిత్య సృజనను ఉద్దేశించి ప్రముఖ విమర్శకుడు బందెల్జ్ వ్యాఖ్యానిస్తాడు. 'మైనారిటీ లిటరేచర్' అనే పదాన్ని ఇటలీలో సాహిత్య సృజనలో విరివిగా వాడిన వ్యక్తి డేవిడ్ బందెల్జ్ (David Bandelj). బందెల్జ్ కూడా మైనారిటీ సాహిత్యాన్ని ఒక దేశాంతర సాహిత్యంగా వివేచిస్తాడు. తాను నిర్వచిస్తూ మూడు నిబంధనలను సూచిస్తాడు, అవి : 1. అంతర్జాతీయ పరిధిలోకి రావడం, 2. ఒకే స్థాయికి చెందిన చారిత్రిక, సామాజిక స్థితిగతులు, 3. స్వతంత్ర మూలాలు (Independence of the genesis). బందెల్జ్ ఈ మూడు నిబంధనల పరిధులను అంగీకరిస్తాడు. మైనారిటీ సాహిత్యంలో వర్తమాన సమాజం సృష్టించిన పరిస్థితుల కారణంగా వ్యవస్థలో నిబిడీకృతమైవున్న, మానవ సంబంధాల మధ్యవున్న విలువలను, వాటి సౌందర్యాన్ని, ప్రామాణికతను వ్యక్తి తన విధి (fate) గా తానే అంగీకరించే స్థితిలో ఉంటాడు. అలా కాకున్న ఫలితంగా ఈ ఆధునిక ప్రపంచం కేవలం విషాదాలను, భయాన్ని మాత్రమే సృష్టిస్తున్నదని భావిస్తాడు. చివరికి వ్యక్తి తన కర్మను తానే నమ్మలేని స్థితికి వస్తాడు. భవిష్యత్తును ఒక భయానక దృశ్యంగా చిత్రించే విషాదకర పరిస్థితుల్లోనూ మానవీయతపై నమ్మకం కోల్పోకుండా ప్రపంచాన్ని, సమాజాన్ని ఒక సరియైన పద్ధతిలో, సక్రమ మార్గంలో నడిపించగలమనే ఆత్మ విశ్వాసాన్ని ఇటాలియన్ రచయిత సురాన్ (Fulvio Suran) తన కవిత్వం ద్వారా వినిపిస్తాడు.

జాతి భావన (Ethinicity) : మైనారిటీ సాహిత్యానికి ప్రధాన ప్రేరణగా జాతి, వర్గ భావన వుంటుంది. మైనారిటీ సాహిత్యం కూడా సంస్కృతి, భాష సాంప్రదాయాలతో సంబంధం కలిగివుంటుంది. కనుక దీనిని జాతీయ సాహిత్యం (National literature) నుండి విడిగా చూడలేం. భాష, జాతి మూలం ఈ రెండిటికీ గల అవినాభావ సంబంధం మైనారిటీ సాహిత్యానికి ఒక విలక్షణతని ఆపాదిస్తుందని సెర్గిల్ (Cergil) అంటారు. ఇటాలియన్ యువ రచయితలు, కళాకారుల తరం కూడా (Marco Apollonia, M.Tremul, Roberto Dobran, Franco Juri) తమ పూర్వీకుల మాదిరి గాక ప్రపంచాన్ని మరో కొత్త కోణంలోంచి చూసే అనుభవంలోకి వచ్చింది. ఆ అనుభవం ఎలాంటిది అంటే చారిత్రాత్మక సంఘటనలు సృష్టించిన విషాదాలు, వేదనల కన్నా వారి సముదాయాల (community) అస్తిత్వాన్ని, నిజాయితీ, నిబద్ధతను నిరూపించుకోవడం అవసరమనిపించి వారి స్థానాన్ని పునర్ నిర్వచించుకోవాలి. ప్రశ్నించబడుతున్న తమ అస్తిత్వం కేవలం స్థానికం గావడం బాధించే విషయం. అందుకే ఈ రచయితల రచనలు చాలావరకు గుర్తింపు (Identity crisis) పొందకపోవడం, తరాల మధ్య సంఘర్షణ (generational conflict) ఉండటం జరుగుతుంది. తమ మూలాల పట్ల నిబద్ధత, సంప్రదాయం లేదా వీటికి విరుద్ధంగా/ ప్రతిగా ధిక్కార స్వరం వినిపించడం కూడా జరుగుతుంది. 1980 లో టిటో (Tito) మరణం, 1989లో అల్బనియన్ల తిరుగుబాటు, 1991 లో స్లొవేనియా స్వాతంత్రం సాధించడం, తరువాత క్రోషియా (Crotia), బోస్నియా(Bosnia) లో యుద్ధాలు ఒక విచిత్రమైన స్థితిని సృష్టించాయి. ఈ గడ్డు పరిస్థితులు శరణార్థులను, వలసవాదులను, దేశ బహిష్కరణకు గురైన వారిని సృష్టించాయి.

స్లోవేనియా, క్రోషియాలో ఇటాలియన్ రచయితలు తమ విశేషణమైన అభివ్యక్తిగా చిన్నకథలు ఎన్నుకోవడంతో కథా ప్రక్రియ ప్రధానమైన స్థానాన్ని పొందింది. ఈ కథల రూపంలో వారి గతానికి, వర్తమానానికి మధ్య సంభాషణగా ఇటాలియన్ మైనారిటీ రచయితలు తీర్చిదిద్దారు. గతంలో జరిగిన విషాద సంఘటనల ఫలితంగా ఏర్పడిన గాయాలను దాటాలన్న స్పష్టమైన కోరిక వారిలో గాఢంగా ఏర్పడింది. వారి పూర్వీకుల మాదిరి ప్రత్యక్ష అనుభవం ఆధునిక యువ రచయితలకు లేకున్నా ఒక విధమైన సామాజిక న్యాయం జరగాలన్న తపన ఆ రచయితల్లో ఉండేది. అలాగే వీటిని పోలిన లక్షణాలు ఇటలీలోని యువ స్లోవేనియాన్ రచయితల్లో కనబడుతుంది. ఏది ఏమైనా సాహిత్యం ప్రధాన ఉద్దేశం, మౌలిక లక్ష్యం (Fundamental task) జాతి భావన, 'జాతీయ భావన' గుర్తింపును స్థిరీకరించడం గా వుండాలని బోరిస్ పహోర్ (Boris Pahor) భావించాడు.

ముగింపు: ఇంతకు ముందు గిల్లెస్ ఇంకా ఫెలిక్స్ మైనారిటీ సాహిత్యంపై చేసిన నిర్వచనం సంపూర్ణంగా లేదన్న భావం, కేవలం ప్రేగ్ (Prague - Czech Republic) లో వుండి జర్మనీ మాట్లాడే యూదు (Jew) ఫ్రాంజ్ కాఫ్కా రచనల మీద ఆధారపడి చేసిన నిర్వచనం, రెండవ ప్రపంచ యుద్ధం ఫలితంగా తలెత్తిన పరిణామాల ద్వారా పుట్టుకొచ్చిన మైనారిటి జాతుల సముదాయాల సాహిత్యాన్ని పునర్నిర్వచించాల్సిన అవసరం వుందనే భావనకు వచ్చారు విమర్శకులు. అందుకు ఈ చారిత్రాత్మక మైనారిటీ జాతుల సామాజిక – రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం వుంది. ఇందులో వలసల ద్వారా వచ్చి చేరిన కొత్తగా ఏర్పడిన మైనారిటీ సముదాయాలను లెక్కలోకి తీసుకోకూడదు.



- డా. రూప్ కుమార్, డబ్బీకార్, 91778 57389

ఒక కల ముందే కని...

అంత్యారంభాలు అనిశ్చితిలో భాగాలే
అయినా ఒక బిందువు నుండి ఒక ధార
ఒక ప్రళయపు అవశేషాల నుండి ఒక ప్రారంభం
ఎంతో నిడివిగల ప్రకృతి నృత్యం
జరిగి జరిగి కర్రపుల్లలు ఏరి ఏరి
గడ్డిపోచలో రెమ్మలో ముక్కున కరుచుకొని
ఒక నిర్మితిని పక్షి ఆవిష్కరించినట్టు
మనలోని మనల్ని గొప్పగా హుందాగా
గంభీరంగా ఉదాత్తంగా పడవ దాటిస్తూ
ఒక సిల్హౌట్‌లో నీటి రంగుల చిత్రంలా
అమూర్తమైన అనుభూతులను
ఒక కొత్త గాజు గ్లాసులో నింపుకుని తాగుతూ
పదేపదే గుక్క గుక్కకు దాన్ని చుసుకుంటూ
ఉషోదయపు తేనీరు చప్పరిస్తున్నట్లు
ఒక కలను ముందే కని వెచ్చటి స్వెటర్ లో
దాచుకుని మన కిటికీ ముందునుంచి
వెళ్ళేవాళ్ళను చూస్తూ ఉంటాం
పలకరించాలన్న కుతూహలం ఉన్నా
సిగ్గుతో నోరు విప్పక తదేకంగా చూస్తూ...
లోపలేమో కొన్ని గోడలూ కొన్ని రాతలూ
పాత సామాన్లు నోట్ బుక్కులు
పద్యాలు వాక్యాలు అరుపులు విరుపులు
నవ్వులు చేష్టలు మిగిలే ఉంటాయ్
మసిబారిన గూట్లోని ఒక కిరసనాయిల్ కందిల్‌లో ఇంకా...

- రఘు వగ్గు

ఎందుకో వాళ్ళు అలా...

ఏ తల్లి కన్నీటి ప్రతిరూపాలో
ఏ నాన్న ఒడిలో మెసిలిన కుందేలు పిల్లలో
మిత్రుల మధ్య పేరుతో ప్రతిధ్వనించాల్సిన వాళ్ళు
ఇప్పుడు ఇలా ఫుట్‌పాత్ మీద అనామధేయులుగా
రోజొక నీళ్ల లేని మేఘంలా ఖాళీ కడుపుతో కనబడతారు
నూనె ఇంకిపోయిన చెమ్మెలాంటి కళ్ళతో,
ముత్తెమంత ఎదురుచూపు
అయిదు రూపాయల బువ్వ కోసం చాచిన ఖాళీ చేతులతో
నిజానికి ఎన్ని పుట్ల ధాన్యాన్ని చాటలతో
తూర్పారబట్టిన చేతులో అవి
ఎడ్లబండి మీద కూర్చొని మీసం మెలేసిన
వడ్లసంపద సృష్టికర్తలో
బతికి చెడిన వాళ్ళో చెడిపోక బతికిన మనుషులో
బలామూ లేదు, బలగమూ లేదు
అన్నం పెట్టే అమ్మలూ లేరు, అన్నలూ రారు
ఇల్లులేదు, ఇల్లాలు లేదు, నవ్వుతరు, నటిస్తరు
పెదవులమీది నిశ్శబ్దపు బాధ చెప్పడానికి
ఒక భాష లేనివాళ్ళు, గూడులేని గువ్వపిట్టలు
క్యాల్ తప్పిన లోకానికి రాజులు
దినం కాలం చిటికెన వేలు పట్టుకొని నడిస్తే
వీళ్ళు సమయాన్ని లోలకమై తిరిగే
మనుషులను చూస్తూ ఖర్చు చేస్తారు
మందుల చిట్టీలు లేవు, షుగర్లు, బీపీలు తెలియవు
వెలిసిపోయిన బతుకుదాటలో
వీళ్ళు మాత్రం అల్చిప్పలో ఎదుగుదల ఆగిపోయిన
ముత్యం లాంటి వర్షులు
(ఫుట్ పాత్ మీద జీవించే ఎందరో అనాధలకు...)

- వేముగంటి మురళి, 9392256475

నీ దారి..

శ్రమజీవుల నీ దారి
సీతారాం ఏచూరి
మరువలేము నీ దారి
ఎర్ర జెండా కాపరి
ప్రజాస్వామ్య నీ దారి
సీతారాం ఏచూరి
మరువలేదు నీ దారి
రాజ్యాంగపు కాపరి
సోషలిజం నీ దారి
సీతారాం ఏచూరి
కష్టమైనా నీ దారి
కామ్రేడ్లకు కాపరి
కమ్యూనిజం నీ దారి
సీతారాం ఏచూరి
ఎంతైనా నీ దారి
ఇంతేనని చెప్పను మరి
జోహారులు ఏచూరి
సీతారాం ఏచూరి
ఎరుపెక్కని నీ దారి
వేగుచుక్క నీ దారి
ప్రజాహితుడ ఏచూరి
సీతారాం ఏచూరి
పిడికిలెత్తి నీ దారి
ప్రజా పోరు సాగు మరి..

- గంధం శ్రీ, 8096382561

సాహితీ వార్తలు

గుర్రం జాషువా సాహిత్య సమాలోచన

తెలంగాణ సాహితి నాగర్ కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గుర్రం జాషువా సాహిత్య సమాలోచన ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నారు. ఈ సభలో డా. వి. భానుచందర్, డా. కోయి కోటేశ్వర్ రావు, డా. వెంకట్ పరిమళ్, వల్లభాపురం జనార్ధన, వి. భానుచందర్ పాల్గొంటారు.

- వహీద్ ఖాన్, 9441236242

'అన్నదాత'కు ఆయువు పోసిన నృత్యరూపకం

- భూపతి వెంకటేశ్వర్లు, 9490098343



ఇగ అయిపోయింది "అన్నదాత" పని అన్నోళ్ళకు...

వ్యవసాయం దండుగ అని వెర్రికేకలు వేసినోళ్ళకు..

వ్యవసాయం ఒక జీవన విధానం అని కనువిప్పు కలిగించింది. అగ్రికల్చర్ నుండి 'కల్చర్' పుట్టిందని పదునెక్కిన చూపుతో 'అన్నదాత' అనే నృత్యరూపకాన్ని ఆధునిక కాలంలో కూడా హిమాలయమంత ఎత్తులో.. ప్రపంచానికి పరిచయం చేశారు నందిని సిద్దారెడ్డి.

తన కలం నుంచి సత్యం ఖడ్గధారలాగా మెరిస్తే.. 'అన్నదాత' ఆవేదనకు పసందైన జతులతో ఆమె కూర్చిన నృత్యం, పదపదాన తన పాండిత్యానికి తార్కాణాలు, రైతు సంస్కృతి వైభవానికి ఒక నృత్య గోపురం. అంతే కాదు నా తెలంగాణ రైతుదే.. అంటూ ఎలుగెత్తి చాటింది నృత్య గురువు అయిన ఇందిరా పరాశరం. తెలుగు రాష్ట్రాలల్లో పల్లెపల్లెన ప్రదర్శించే చక్కటి నృత్యరూపకం. చక్కని సంగీతాన్ని సమకూర్చిన శాస్త్రీగారి ప్రతిభ విభిన్నభరితంగా సాగుతుంది.

అన్నదాత నృత్యరూపకం ప్రదర్శించిన చోటల్లా కంట నీరు పెట్టని కఠిన హృదయులుండరు. ప్రదర్శన చూసిన ప్రతి ఒక్కరు వేనోళ్ళా పొగిడారు. ఇది మా జీవితమే.. అని తడిమి చుసుకున్నారు. తన్మయత్వం చెందారు. సాత్విక, ఆహార్యాభినయంతో ఆరితేరిన పిల్లలే.. నటనలో కూడా నవీన మార్గంలో నడుస్తూ.. అన్నదాతల వద్దకే 'అన్నదాత' అనే నృత్యరూపకం ప్రదర్శించడంతో రైతులంతా, ఇది మా నాటకం, మా పాట, మా కథ, మా కన్నీళ్లు, మా కడగండ్లు, మా కష్టాలు, ఇది మా పై జరిగే దోపిడి అంటూ ఆట ఆటకు, పాట పాటకు, పదపదమున పరవశించిన ప్రజలు శహబాస్, అన్నదాత జయహో అన్నదాత అంటూ నినదించిన నృత్యరూపకం.

ఆగస్టు 31న ఇబ్రహింపట్నంలో 'తెలంగాణ రైతు సంఘం' రాష్ట్ర శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న సందర్భంగా ప్రదర్శించిన 'అన్నదాత' నాటికకు రైతు ప్రముఖులు, రైతు నేతలు, రైతుల సమక్షంలో ప్రశంసలు పొందినది. రైతుపై కవి నందిని సిద్దారెడ్డికి చెక్కు చెదరని విశ్వాసం ఉంది. రైతు పట్ల తనకు ధృడమైన సంకల్ప శక్తి ఉంది.

అక్షరాలు సరళంగా.. భావాలు మృదువుగా సందేశాలు మిత్ర సమ్మితంగా.. సంఘటనలు కంటి శోకంగా, ఆరని దు:ఖంగా 'నిత్యం పోరాటంగా' సాగే రైతు జీవితాన్ని ఆవిష్కరించారు.

రచయిత, అహరహం సమాజ చింతనతో స్వప్నించే భావుకుడు కావడం వల్లనే ఈ నేలను స్వప్నించాడు. నాగేటి చాల్లల నా తెలంగాణ బతుకు పాటలు రాసి జనం నాలుకలపై నర్తింపజేశాడు. సిద్దారెడ్డిని స్పృశించడమంటే తెలంగాణ సాహిత్యంతో సంభాషించడం. ఆయన వ్యక్తిత్వాన్ని తూచడం అంటే తెలంగాణ ఆర్ధ్రతను, ఆగ్రహాన్ని ఆవాహన చేసుకోవడమే.

ఆయన రక్తంలోనే తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం ఉంది. తండ్రి బాల సిద్దారెడ్డి తుఫాకి చేత బట్టి భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం దొరలపై, భూస్వాములపై, రజాకార్లపై తలపడిన సాయుధ యోధుడికి స్వయాన బిడ్డ! ఆయన తల్లి రత్నవ్వ పేదల పక్షపాతి. పొయ్యి మీద బువ్వ కుండ ఉడుకుతునే ఉంటుంది. పోరాట దళాలు ఇంటికొచ్చినప్పుడు కడుపునిండా అన్నం పెట్టే అన్నదాత ఇల్లు, అన్యాయంపై తిరుగుబాటు చేసే స్వభావం చిన్ననాడే అలవడింది. ఒక కంట్లో కత్తులు, మరో కంట్లో కన్నీళ్లు కలసి సాగినా జీవనయానం తనది.

తెలం'గానాలు' గద్యం, పద్యం, శ్లోకం, జానపదం, ఆటపాటల పల్లెసంస్కృతి తెలిసినవాడు, అసాధారణమైన కవితాధార ఉన్నవాడు. ధారణకు తోడు అమృత తుల్యమైన భాషాపటుత్వం ఉన్నవాడు. ఆయనను కేవలం కవి, రచయితగా చూస్తే తెలుగు సాహితీలోకం తనను తాను తక్కువ చేసుకున్నట్టే. అతడొక బహుముఖ ప్రజ్ఞాశాలి. అందుకే.. శాస్త్రీయ సంగీత నృత్యరూపకాలలో ప్రజా ద్వారాలు తెరిచారు. సంగీతం ఆస్తికుల ఆస్తి కాదు. ఒక సమూహం సొత్తుకాదు.





సమస్త కళలు ప్రజలవి, శ్రమశక్తి ఫలితాలు, శ్రమ నుంచి సమస్తం ఉద్భవించినది అనే ఎరుక కలిగినవారు. కనకనే 'అన్నదాత' నృత్యరూపకాన్ని శాస్త్రీయ సంగీతానికి అభినయానికణుగుణంగా రైతు జీవిత పరిణామ క్రమాన్ని పరిచయం చేశారు. రచనలోని ప్రతి అక్షరానికి గవాక్షములు తెరిచి ప్రజల బాణిని, రేపటి స్వరంలో.. ఎన్నో వసంతాల గతానుభవాల నగిషీతో చెక్కిన సమిష్టి జీవనసంస్కృతిని ప్రతిబింబించారు. ఇగ 'అన్నదాత' నృత్యరూపకంలోకి ఒక్కసారి మనం వెళితే...

"ప్రణతి–ప్రణతి ప్రకృతీ/ ప్రపంచ మాతృ స్థితిమతి ప్రణతి అంటూ ప్రకృతిని వర్ణిస్తూ.. లయ బద్ధంగా ఎనిమిది మంది నృత్య కళాకాణిలతో ప్రారంభమవుతుంది.

"సృష్టి పరిణామంలో విశిష్టజీవి నరుడు/ జీవన పోరాటాన చిరప్రయోగ తత్పరుడు"

ఆదిమ కాలం నుండే ఆకలి బాధిస్తే.. జంతు వేట, ఫల సంపదతో సమిష్టి శ్రమతో సహజీవనం సాగిస్తూ.. భూమిని గుర్తించి, గింజ వేసి గింజలు పండించి, నాగలి కనిపెట్టి, నాగలి కర్రను ఆవిష్కరించి, ప్రాణమొడ్డి పంట తీసిన వాడే కదా కర్షకుడు. ఈ వ్యవస్థ పోషకుడు, అన్నదాత వెలుగు రేక, రైతుజాతి వెన్నుముక, దేశానికి పేరెన్నిక అంటూ.. రైతుల పరిణామ క్రమానికి ప్రాణం పోశారు. చూసే ప్రతి ఒక్కరిని నాటకంలో భాగస్వామ్యం చేయడం, ఆసక్తిగా వాళ్ళను నటనలో లీనం చెయ్యడం, తెలియకుండానే అంతర్భాగం చేయడం రచన ప్రత్యేకత.

వ్యవసాయ కుటుంబం ఒక వసుధైక కుటుంబం ప్రేమలు, అనురాగాలకు, దానధర్మాలకు మనిషి తత్వానికే పుట్టిల్లు, వ్యవసాయ పండుగలు, కరువు కాటకాలలో, కప్పల పెండ్లిళ్లు, సకల వృత్తులు సబ్బండ కులాలకు రైతే జీవనాధారం, అతడే జీవగ్ర అంటూ రైతు నేపథ్యం మొత్తం వివరిస్తారు.

దొరలు, భూస్వాములు, పైగా అప్పు లోళ్లు ఎవరికైయినా భయపడడు, కోర్టులకు జడవడు, కొట్లాడి తీరుతాడు. బడుగుల సంఘం మాది, బరిగీసి పోరాడుతాం అంటూ నిలబడుతాడు. ధైర్యానికి పోరాటానికి ప్రతికగా రైతును నిటారుగాను నిలబడుతాడు. ప్రకృతి వైపరీత్యాలకు ఎదురునిల్చి ఆత్మ గౌరవ పతాకగా.. రైతును రాజుగా.. నిలబెడుతాడు.

"ఏ దేవుని మొక్కితే ఏమి ఫలము!/ ఆకాశము నమ్మితే ఏది జలము?/ ఏ మొక్కలు ఆదుకోవు– మన రెక్కలే మనకు బలము" అనే చక్కటి సందేశాన్నిస్తాడు.

శ్రమ మూలం మిదం జగత్ అంటూ తమ రెక్కల కష్టంతో బావులు తవ్వుకుందాం. బావులు తవ్వి, మోటలతో, కాలువలతో కలిసి పాడేపాటలు, మోటబాయి పాటలు, కల్లంలో పాటలు, ఏరువాక పాటలు, పాటలతో ప్రయాణం సాగుతున్నది. కొంత కాలం, మోటలు, ఏటి ఊటలు ఏతమెత్తి పోసినా ఎకరం పారదాయో చెరువుకు గూడేసినా చేటడంత పారదాయా... విచారంతో రైతు తడబడుతూ.. నడుస్తుండగా...అంతలోనే ఓ పాట "ఏటికేతం బట్టి ఏయిపుట్లు పండించి ఎన్నడు మెతుకెరుగరన్నా నేను గంజిలో మెతుకెరుగరన్నా" వెనుక నుంచి వచ్చే సాంగ్‌తో.. ప్రేక్షకుల కంటతడి పెట్టిస్తారు. రైతు ఏడ్చి ఏడ్చి కన్నీళ్లు, రెక్కలు అరిగిన ఆశలు, కాడి విరిగిన వ్యవసాయం, అలసిపోయి అప్పులతో తిప్పలు పడుతున్నప్పుడే ప్రవేశిస్తుంది.

యాంత్రీకరణ భూతం, అడుగడుగున ట్రాక్టర్లు, మిషన్లు చుట్టుముడుతాయి. ప్రపంచీకరణ పాముపడగనీడ రైతుల ఊపిరిని ఉక్కిరి బిక్కిరి చేశాయి. రైతు చావులు సహజమైనవి. పాలకులు పట్టించుకొని కాలంలో...ఆదిగో...

"అప్పులు ఇస్తాం.. బ్యాంకోళ్ళ మోతలు/ ఫైనాన్సు సంస్థల.., మైకుల మోతలు"

తనఖా పెడితే చాలు తక్కువ వడ్డీ ఇస్తాం అంటూ ప్రచారం. బ్యాంకుల చుట్టు రైతుల తిప్పలు, బోరు మీద బోరు వేసి బొక్క బోర్ల పడిరి, చుక్కలు కనిపించినా.. చుక్క నీరు లేకపాయె ఇక లాభం లేదని పత్తి పంట, వేస్తే.. తరాల దరిద్రం కోట్టుకపోతుందని ప్రచారం, దాంతో పత్తి గింజలు, ఎరువు, పురుగుమందుల దుకాణాలు, మనుష్యులతో జూదం, గిట్టుబాటు ధర లేక ఆలుపిల్లల్ని సాదలేక రైతు ఆత్మహత్యల పరంపర కొనసాగుతుంది. ఇలా రైతులు ఎంతమంది మరణించినా.. వ్యవసాయం మీద ఆశ చావట్లేదు. రైతు యుద్ధం నిరంతరం ప్రజ్వరిల్లుతూనే ఉంటుంది. త్యాగాల చిగుళ్లతో కొత్త మొక్కలై మొలుస్తున్నయి అనే సందేశంతో.. కాడి, మేడి ఎద్దులతో ఒంటరి మహిళ రైతు వారసత్వాన్ని కొనసాగిస్తూ.. ఎరువాక సాగిస్తుంది. రైతు జైత్రయాత్ర తిరిగి ఆరంభం.

అంతం కాదిది.. ఆరంభం, ఆనంత జీవన సంగ్రమం భూమి కోసం, భుక్తి కోసం సాగే.. రైతుల పోరాటం ఆత్మగౌరవ పతాకాన్ని భుజానికెత్తుకుని సాగుతుంది.నృత్యరూపకం జయహో.. 'అన్నదాత' జయ జయ ధ్వనుల మధ్య ప్రజల హర్షధ్వనుల మధ్య సాగిపోతుంది, ఆగిపోతుంది. రైతు కుటుంబమంతా కలిసి ఈ నాటకం ఆడారా? అన్నట్టుగా ఉంటుంది. కూచిపూడి నాట్యంలోనే.. కాదు.. సాంఘీక నృత్య రూపకల్పనలో కూడా ఇందిర ప్రతిభ అనన్య సామాన్యం. నేత్రాభినయం, అంగికాభినయం సన్నివేశానికి తగ్గట్టుగా ఉంటాయి. రైతు ఇల్లాలి వేషంలో నిండైన నగలతో తూలతూగే.. నవధాన్యాలు నా ఇంట్లోనే.. తొణికిసలాడే పాత్రలో కనిపించినా.. వ్యవసాయానికి ఏ సహాయం లేక రోజురోజుకు అవసాన స్థితికి చేరుకున్నట్లే.. ఒకటొకటి వంటి మీద నగలన్నీ పోయి బోసి మెడతో చితికి పోయిన స్థితి కండ్లముందు ఉంచినప్పుడు కంటిలో కన్నీళ్లు జలజల రాలుతాయి. ఏక కాలంలో ఎన్ని అవతరాలు ఎత్తిందో అభినయం అబ్బుర పరిచింది. ఇలా.. ఏ కళ అయినా సమకాలీన వాతావరణానికి, కొత్తతరం అభిరుచులకు అనుగుణంగా మలచక పోతే.. మనుగడ ఉండదన్న సత్యాన్ని గ్రహించారు. సాంప్రదాయం నుండి సామాజికతకు కొత్త మెరుగులతో.. ప్రేక్షకుల ప్రశంసలతో ప్రయాణం సాగిస్తున్న నృత్య రూపకం 'అన్నదాత' తప్పని సరిగా చూడాల్సిన దృశ్యకావ్యం.



గాజాపై మారణహోమాన్ని ఆపండి

- ఇజ్రాయిల్ ఏకపక్ష దాడులతో దిక్కుతోచని స్థితిలో ప్రజలు
- ఇండియాతో పాటు ప్రపంచం దన్నుగా నిలవాలి : ప్రొఫెసర్ బాలగోపాల్ 15 స్మారకోపాన్యాసంలో ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ అచిన్ వనాయక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న మారణహోమాన్ని వెంటనే ఆపాలి. ఏడాదికి పైగా సాగుతున్న భయంకరమైన మిలటరీ దాడుల వల్ల గాజా ప్రజలు దిక్కుతోచని స్థితిలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. గాజా జనాభాలో 8 శాతం మంది ప్రజలు యుద్ధం వల్ల నష్టపోయారు. కొందరు మరణిస్తే, మరికొందరు ఆచూకి లేకుండా పోయారు. క్షతగాత్రుల సంఖ్య లెక్కించలేకుండా ఉంది. ఇండియా, అరబ్ దేశాలతో పాటు ప్రపంచం పాలస్తీనియన్లకు అండగా నిలవాలి" అని ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్, రచయిత అచిన్ వనాయక్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "మానవ హక్కుల నేత ప్రొఫెసర్ బాలగోపాల్ 15వ స్మారక లెక్చర్"లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలోనే అత్యంత క్రూరమైన, అనాగరిక మిలటరీ వ్యవస్థను కలిగి ఉన్న ఇజ్రాయిల్ పాలస్తీనియన్ల హక్కులను కాలరాస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ దేశానికి ఒక జాతీయత ఉంటుంది. కానీ ఇజ్రాయిల్‌కు మాత్రం ఆ దేశం మిలటరీనే జాతీయత అని ఎద్దేవా చేశారు. ఆయుధ సంపదతో చైనా, భారత్, గల్ఫ్ తదితర దేశాలను తన గుప్పిట్లో పెట్టుకుని పాలస్తీనాతో పాటు పలు పశ్చిమాసియా దేశాలపై మిలటరీ దాడులకు పాల్పడుతున్నదని అన్నారు. పాలస్తీనా భూ బాగాన్ని అక్రమించుకుని ఆ దేశ ప్రజలపై చేస్తున్న దారుణాలకు అంతులేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. గాజా వీధులు నిత్యం రక్తంతో తడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనా వాసులు స్వేచ్ఛ కోసం చేస్తున్న పోరాటాలను హమాస్‌తో ముడిపెట్టి వారిపై పైశాచిక దాడులకు తెగబడుతోందని గుర్తుచేశారు. ప్రపంచం ముందు వారిని ఇస్లామిక్ తీవ్రవాదులుగా ముద్రవేసేందుకు కుట్రలు పన్నుతున్నదని ఆరోపించారు. అనంతరం ప్రజా ఉద్యమాలను గుర్తించడంలో విచిత్ర పరిస్థితి అనే అంశంపై హక్కుల కార్యకర్త తాషి చౌడుప్ ప్రసంగించారు. అంతకు ముందు మానవ హక్కుల వేదిక నాయకులు బాగవతుల రాజు బాలగోపాల్ ఉద్యమ నేపథ్యాన్ని వివరించారు. తెలుగు నేలపై మానవ హక్కుల హరణ, ఎన్‌కౌంటర్లు, దళితులపై దాడులకు వ్యతిరేకంగా ఆయన నిబద్ధతతో పోరాడారని కొనియాడారు. "అసమానతలు ఉన్నంత వరకు పోరాటం ఉంటుంది. ఆ క్రమంలో రాజ్యం అణచివేతలకు పాల్పడుతుంది. గిరిజనులు, మహిళలు, ఆదివాసీలు, దళితులు బడుగు బలహీన వర్గాలు బాధితులుగా మారుతారు" అని బలంగా నమ్మిన ఆయన చివరి వరకు వారి కోసం పోరాడారని అన్నారు. బాలగోపాల్ తన జీవిత కాలంలో రాసిన వ్యాసాలు, కోర్టు కేసులు, ఇతర లెక్చర్లతో మానవ హక్కుల వేదిక ప్రచురించిన ఎస్సీ వర్గీకరణ- ప్రజాస్వామిక దృక్పథం, స్త్రీల కోసం-బతుకు కోసం, సిటిజన్ రిపోర్ట్ సెక్యూరిటీ-అన్ సెక్యూరిటీ పుస్తకాలను సమావేశంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షులు రాఘవాచారి, సీనియర్ సంపాదకులు రామచంద్ర మూర్తి, వసంత కన్నాభిరన్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నై మెరీనా బీచ్ వద్ద తొక్కిసలాట

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం తిరుగుప్రయాణం కోసం వేలాది మంది ఒక్కసారిగా స్టేషన్‌లకు చేరుకోవడంతో.. ప్లాట్‌ఫాంలపై నిలబడేందుకూ వీల్లేని పరిస్థితి ఏర్పడింది. అన్నా స్క్వేర్‌లోని బస్‌స్టాప్‌కు సందర్శకులు పోటెత్తారు.

వైమానిక విన్యాసాలు

మెరీనా బీచ్‌లో ఆదివారం ఉత్కంఠభరితంగా, అద్భుతమైన వైమానిక ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనను సుమారు పదిహేను లక్షల మంది ప్రజలు వీక్షించారు. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో ప్రజలు హాజరైన వైమానిక కార్యక్రమంగా ఇది లిమ్కా బుక్ రికార్డులలో స్థానం సంపాదించుకుంది. ఇరవై ఒక్క సంవత్సరాల తర్వాత జరిగిన వైమానిక సాహసాలను తిలకించేందుకు ప్రజలు కోవళం నుండి ఎన్నూరు వరకూ తూర్పు తీర రహదారి పైన, ఎత్తయిన భవనాల పైన చేరారు. గరుడ్ కమాండో బృందం చేపట్టిన బందీల విడుదల ఆపరేషన్‌తో ఎయిర్ షో మొదలైంది. స్క్వాడ్రన్ నాయకులు భావనా కాంత్, అవని చతుర్వేది సుఖోయ్-30 ఎంకెఐని నడిపి మహిళా శక్తిని చాటారు. స్క్వాడ్రన్ లీడర్ మోహన సింగ్ హెచ్ఏఎల్ తేజస్ ఫైటర్ జెట్‌ను నడిపారు. శివాంగి సింగ్ రఫేల్ విమానాన్ని ఇతర మహిళా అధికారులు మిగ్-29ను నడిపారు. నెమ్మదిగా కదిలే హెలికాప్టర్ల నుండి సూపర్ సోనిక్ ఫైటర్ జెట్ల వరకూ వివిధ రకాల విమానాలు విన్యాసాలలో పాల్గొన్నాయి. రఫేల్ సూపర్ సోనిక్ జెట్ నుండి గగనతలంలో బాణసంచా పేల్చారు.



డిజిటల్ మీడియాపై మోడీ దాడి

(మొదటిపేజీ తరువాయి)

మరణం తర్వాత రాజీవ్‌గాంధీ అత్యధిక మెజారిటీతో ప్రధానిగా పనిచేశారనీ, కానీ అప్పటి మీడియా ఆయన హయాంలో బోఫోర్స్ వంటి కుంభకోణాలను వెలికితీసి, ప్రజల్ని జాగృతం చేసిందనీ, ఫలితంగా తర్వాతి ఎన్నికల్లో ఆయన అధికారాన్ని కోల్పోయారని విశ్లేషించారు. గడచిన 11 ఏండ్లుగా జాతీయ మీడియా ఈ తరహా పరిశోధనాత్మక జర్నలిజం ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు. రాజ్యాంగ పీఠికలోని అంశాలకు భిన్నంగా మోడీ ప్రభుత్వ పాలన సాగుతున్నదనీ, లోక్‌సభలో ఆయనకు పూర్తి మెజారిటీ రానందున ఈ దఫా మనుస్మృతితో కూడిన రాజ్యాంగ మార్పు జరగకున్నా ఆ ముప్పు మాత్రం పొంచేఉందని హెచ్చరించారు. 1992లో శిలాన్యాస్ పేరుతో బాబ్రీమసీదు కూల్చివేసినప్పుడు అన్ని జాతీయ పత్రికలు లౌకికత్వానికి భంగం కలిగిందంటూ ఎడిటోరియల్స్ రాసాయనీ, అవే పత్రికలు ఇప్పుడు అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగితే దాన్నో చారిత్రక ఘట్టంగా అభివర్ణిస్తూ ఎడిటోరియల్స్ రాసాయని తెలిపారు. ఈ మార్పు ఎందుకు, ఎలా వచ్చిందో ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. కార్పొరేట్ కబంధహస్తాల్లో మీడియా చిక్కుకుని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నదని విమర్శించారు. ఆర్ఎస్ఎస్‌కు రాముడికి ఎలాంటి సంబంధం లేదనీ, సానుభూతి, ప్రేమకు చిహ్నంగా రాముడిని కొలుస్తామనీ, నాథూరాం గాడ్సే మాత్రమే ఆర్ఎస్ఎస్‌కు చెందినవాడు అని చెప్పారు. మణిపూర్ అల్లర్లతో అట్టుడుకుతుంటే ప్రధాని మోడీ ఆయోధ్య రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాన పూజారిగా వ్యవహరించారని ఎద్దేవా చేశారు. భారత జాతీయ సైన్స్ కాంగ్రెస్ తీరుతెన్నులే మారిపోయాయన్నారు. అక్కడ జోతిష్యులు శాస్త్రవేత్తలుగా తర్కం బోధిస్తున్నారనీ, ఆర్ఎస్ఎస్ సభల్లో పెట్టాల్సిన సైద్ధాంతిక పత్రాలను సైన్స్ మహాసభల్లో పెడుతున్నారని ఆక్షేపించారు. అంగారకుడిపై నాసా పరిశోధనలు చేస్తే, దాన్ని భారతానికి ముడిపెట్టి ప్రచారం చేసుకుంటున్నారనీ, ఇంతకంటే మూఢత్వం ఏముందని ప్రశ్నించారు. న్యాయవ్యవస్థలో హేతుబద్ధత, తర్కం లేకుండా తీర్పులు వస్తున్నాయనీ, దీన్నెలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. న్యాయమూర్తులు రిటైర్డ్ అవగానే కేంద్రప్రభుత్వం వారికి పదవులు ఇస్తున్నదనీ, దేశం ఎటుపోతున్నదో అర్థంకావట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా ప్రశ్నించే గొంతుల్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి టీ-10 సీఈఓ శ్రీసుందర్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కే నాగేశ్వర్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్, నవతెలంగాణ సంపాదకులు ఆర్ సుధాభాస్కర్, సోషల్ యాక్టివిస్టులు దేవి, డాక్టర్ పద్మజాషా తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రజానాట్యమండలి కళాకారులు పలు ప్రదర్శనలు నిర్వహించారు.

సూది ముట్టడు.. సిరంజి పట్టడు..

ఆ డాక్టర్ 'డ్యూటీ'యే సపరేటు

- ఓపీ చూడటమంటే ఆ డాక్టర్‌కు నచ్చనే నచ్చదు..
- డిప్యుటేషన్ వేసి నెలకావస్తున్నా పాత స్థానంలోనే ఓడీ
- మంచుకొండ పీహెచ్‌సీ డీడీవో తీరుపై విమర్శలు
- మంత్రి తుమ్మల అభ్యర్థనతో కేటాయించినా నిష్ప్రయో'జనం'
- వైద్యఆరోగ్యశాఖలో కొనసాగుతున్న నిర్లక్ష్యం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ ఖమ్మం

సూది ముట్టని.. సిరంజి పట్టని ఆ డాక్టర్ 'డ్యూటీ' అంతా ఓ సపరేట్. డ్రాయింగ్ అండ్ డిస్బర్స్ ఆఫీసర్ (డీడీవో) పేరుతో ఓ సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్‌లా ల్యాప్‌టాప్ ముందు కూర్చొని తనదైన స్టైల్‌లో ఎంజాయ్ చేస్తున్న ఆ ప్రభుత్వ వైద్యునికి రోగులను చూడటమంటే అస్సలు నచ్చనే నచ్చదు. పైగా రోగులకు వైద్యం చేసే బాధ్యత తనది కాదన్నట్టుగా చెప్పుకొస్తారు. మరి మెడికల్ ఆఫీసర్‌గా డిప్యూటేషన్‌కు ఎందుకు అంగీకరించినట్టో..? డీడీవోగా హెల్త్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్, ఉద్యోగుల శాలరీలు, సెలవుల వ్యవహారాలు తప్ప.. రోగులు, పరీక్షల వంటివేవీ తనకేవీ పట్టని ఆ వైద్యాధికారిని ఓపీ అధికంగా ఉండే పీహెచ్‌సీకి కేటాయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నెలరోజులు కావస్తున్నా...

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంత నియోజకవర్గం రఘునాథపాలెం మండలం మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఔట్ పేషెంట్ల (ఓపీ) తీవ్రత అధికంగా ఉంటుంది. రోజుకు వంద మంది రోగుల వరకు ఈ కేంద్రానికి వస్తున్నారు. కానీ ఇక్కడ మెడికల్ ఆఫీసర్ శ్రీదేవి సెలవులో ఉన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి అభ్యర్థన మేరకు డీఎంహెచ్‌వో వరికూటి సుబ్బారావు గత నెల 12వ తేదీన కొణిజర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కె.రమేష్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ముదిగొండ మండలం వల్లభిలో పనిచేస్తున్న ఎం.శారదకు కొణిజర్ల పీహెచ్‌సీ బాధ్యతలు అప్పగించారు. ఇంతవరకు బాగానే ఉన్నా దాదాపు నెలరోజులు కావస్తున్నా రమేష్ మాత్రం మంచుకొండ పీహెచ్‌సీలో అడుగుపెట్ట లేదంటే అతిశయోక్తి కాదు. పైగా తన పూర్వ స్థానం కొణిజర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికే వెళ్లి అక్కడే ఆన్‌డ్యూటీ (ఓడీ)గా రిజిస్టర్‌లో నమోదు చేసుకుంటుండటం గమనార్హం.

మంత్రి నియోజకవర్గంలో పర్యటిస్తున్నారని..

ఓపీ అంటే పట్టని డాక్టర్ కె.రమేష్ డీడీవోగా రఘునాథపాలెం మండల పరిధిలో ఏమైనా హెల్త్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నారా..? అంటే అదీ లేదు. స్వయంగా మంత్రి తుమ్మల నియోజకవర్గంలో పర్యటిస్తున్నా ఆ వంక కూడా రారని స్థానికులు చెబుతున్నారు. నెలరోజుల్లో తనకు కేటాయించిన మంచుకొండ పీహెచ్‌సీకి వెళ్లలేదు. కానీ మంత్రి తుమ్మల నియోజకవర్గంలో పర్యటిస్తుండటంతో శనివారం పాండురంగాపురంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ సమావేశానికి మాత్రం అటెండ్ అయ్యారు.

మరొకరికి డిప్యూటేషన్..

మంచుకొండ డీడీవో కం మెడికల్ ఆఫీసర్‌గా ఉన్న కె.రమేష్ విధులకు హాజరుకాకపోవడంతో తిరుమలా యపాలెం మండలం సుబ్లేడు పీహెచ్‌సీ నుంచి మెడికల్ ఆఫీసర్-2 శ్రీధర్‌ను ఇక్కడికి డిప్యూటేషన్‌పై రప్పించారు. నాలుగు రోజులుగా ఆయన ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. కానీ రమేష్ మాత్రం ఇక్కడికి రాకుండా పూర్వ స్థానం కొణిజర్లకు వెళ్తుండటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

రమేష్ స్థానంలో కొణిజర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా శారదను నియమించారు. అయినా రమేష్ అక్కడికే ఎందుకు వెళ్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా పర్యవేక్షణ చేయాల్సిన డీఎంహెచ్‌వో ఏమి చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.



మంచుకొండ పీహెచ్‌సీలో ఓపీ విధులు నిర్వహిస్తున్న మరో డిప్యూటేషన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్

నిర్లక్ష్యపు విధులతోనే గత డీఎంహెచ్‌వో సరెండర్..

వైరల్ ఫీవర్స్ జిల్లాను వెంటాడుతున్న వేళ విధుల్లో నిర్లక్ష్యానికి తోడు పలు రకాల ఆరోపణలపై పూర్వ డీఎంహెచ్‌వో మాలతిని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాల మేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ డీహెచ్‌కు సరెండర్ చేసిన విషయం తెలిసిందే.

ఆమె స్థానంలో బాధ్యతలు చేపట్టిన సుబ్బారావు సైతం అదే బాటలో వెళ్తున్న అధికారులకు వత్తాసు పలుకుతుండటం ఆశ్చర్యం గొల్పుతోంది.

వాస్తవానికి ఓపీ అధికంగా ఉందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌ను మంచుకొండ పీహెచ్‌సీకి పంపారు. ఆయన్ను డిప్యూట్ చేసేందుకు వల్లభి నుంచి మరో డాక్టర్‌కు స్థానచలనం చేశారు. ఉద్యోగ రీత్యా మెడికల్ ఆఫీసర్ కమ్ డీడీవో అయిన రమేష్ అటు ఓపీ చూస్తూనే మరోవైపు ఉద్యోగుల వేతనాలనూ చేయాల్సి ఉంటుంది. కానీ నెలలో రెండు, మూడు రోజులు చేసే ఉద్యోగుల వేతనాల పని పేరుతో ఓపీని పూర్తిగా చూడకుండా వదిలివేస్తున్నా సంబంధిత డాక్టర్‌ను డీఎంహెచ్‌వో సమర్థిస్తుండటంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ఒక పీహెచ్‌సీకి ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు ఉండి.. అందులో ఒకరు డీడీవో హోదా కలిగి ఉన్నా ఇద్దరూ ఓపీలు చూడాల్సిందే. కానీ రమేష్‌కు మినహాయింపుపై సందేహాలు తలెత్తుతున్నాయి.

డాక్టర్ రమేష్‌పై పలు ఆరోపణలు..

డీఎంహెచ్‌వో ప్రత్యేకంగా డాక్టర్ రమేష్‌ను మంచుకొండకు పంపారు. కానీ ఆయన మాత్రం నెలరోజులవుతున్నా పీహెచ్‌సీకి రావడం లేదు. గతంలో కొణిజర్ల మండలం పెద్దగోపతి పీహెచ్‌సీలో పనిచేస్తున్నప్పుడు డీడీవో హోదాలో ఉద్యోగుల సముపార్జిత సెలవులు చేసేందుకు కూడా కొందరి దగ్గర రూ.20వేలకు పైగా తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఆ పీహెచ్‌సీకి కేటాయించిన ల్యాప్‌టాప్‌ను నిబంధనలకు విరుద్ధంగా తన వెంట తెచ్చుకొని పాత ల్యాప్‌టాప్‌ని అక్కడ ఉంచారని సమాచారం. ఇలాంటి ఆరోపణలు ఎన్నో డాక్టర్ రమేష్‌పై ఉన్నా డీఎంహెచ్‌వో సుబ్బారావు తనను వెనుకేసుకొస్తూ 'డీడీవో ఓపీ చూడక్కర్లేదు' అని చెబుతుండటం గమనార్హం.



డాక్టర్ రమేష్‌ను మంచుకొండ పీహెచ్‌సీ బాధ్యతలు అప్పగిస్తూ డీఎంహెచ్‌వో ఇచ్చిన ఆర్డర్ కాపీ

ఏ పీహెచ్‌సీ ఓపీతో నాకు సంబంధం లేదు

మంచుకొండ, కొణిజర్ల పీహెచ్‌సీల ఓపీతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను కొణిజర్ల, మంచుకొండ పీహెచ్‌సీల అడ్మినిస్ట్రేషన్ మాత్రమే చూస్తున్నాను. రోజువారీగా కొణిజర్లకు వెళ్తానే మంచుకొండకు సంబంధించిన ఫీల్డ్ యాక్టివిటీస్ చూస్తున్నాను. విధుల్లో ఎక్కడ కూడా నిర్లక్ష్యం చేయను. కాబట్టే మంత్రి గారు ఏరికోరి నాకు మంచుకొండ బాధ్యతలు ఇచ్చారు.

- డాక్టర్ కె.రమేష్, డీడీవో మెడికల్ ఆఫీసర్

రుణమాఫీ పై వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాం



- మీ ప్రకటన వేదనకు, ఆశ్చర్యానికి గురి చేసింది
- ఇవిగో వాస్తవాలు
- తెలంగాణ రైతుకు మద్దతివ్వండి : ప్రధాని మోడీకి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతు రుణమాఫీపై తమ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందనీ, ఆ విషయం మీరొచ్చి అడిగితే ఏ రైతు అయినా చెప్తారంటూ ప్రధాని మోడీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. మోడీ మహారాష్ట్ర ఎన్నికల ముందస్తు ప్రచారంలో భాగంగా "దేశవ్యాప్తంగా ఎక్కడైనా కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీలు ఇస్తుంది. గెలిచాక మాత్రం వాటిని విస్మరిస్తుంద"ంటూ ఆరోపించారు. అందుకు ఉదాహరణే తెలంగాణలో రైతు రుణమాఫీ అంటూ ప్రస్తావించారు. 'ఎన్నికల వేళ రుణ మాఫీ చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఏడాది గడుస్తున్నప్పటికీ ఆ పథకాన్ని అమలు చేయలేదు. ఏ రాష్ట్రంలోనైనా కాంగ్రెస్ అలానే చేస్తుంది' అంటూ మోడీ చేసిన విమర్శలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ఆదివారం ప్రధాని మోడీకి బహిరంగ లేఖ రాశారు. మీ ప్రకటన ఆవేదనను, ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ వాస్తవాలివే అని పేర్కొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి లేఖలోని అంశాలివే

ప్రియమైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీజీ.తెలంగాణలో రైతుల రుణమాఫీ గురించి మీరు ప్రస్తావించారు. మేము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రుణమాఫీని విజయవంతంగా అమలు చేశాం. పథకం అమలు గురించిన వాస్తవాలను మీతో పంచుకోవాలని అనుకుంటున్నా. వాగ్దానం చేసిన విధంగా రూ.2లక్షల రుణాన్ని పూర్తిగా మాఫీ చేశాం. మొత్తం 22,22,067 మంది రైతులకు, రూ.17,869.22 కోట్లు వారి ఖాతాల్లో వేశాం. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఇదే అతిపెద్ద వ్యవసాయ రుణమాఫీ. రూ.2లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతులకు పైమొత్తాన్ని చెల్లించిన తర్వాత రుణమాఫీ అమలు చేస్తున్నాం. కాంగ్రెస్ గ్యారెంటీ గోల్డెన్ గ్యారెంటీ అని అన్నదాతలు నమ్ముతున్నారు. వారి సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ అంకితభావాన్ని మీరు శంకించలేరు. వ్యవసాయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడంలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ సర్కారు నమూనాగా నిలుస్తున్నది. తెలంగాణలో రైతుల సంక్షేమాన్ని ప్రోత్సహించే ఈ ప్రయత్నంలో ప్రధానిగా మీ పూర్తి సహకారం, మార్గదర్శకత్వాన్ని నేను అభ్యర్థిస్తున్నా' అని పేర్కొన్నారు.

తోటి మహిళ హత్య చేసి..

- లైంగికదాడిగా చిత్రీకరించి తప్పించుకునే ప్రయత్నం
- కూకట్‌పల్లి యువతి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ - కూకట్‌పల్లి

హైదరాబాద్ కూకట్‌పల్లిలోని లోధా అపార్టుమెంట్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో గత బుధవారం (30వతేదీ) హత్యకు గురైన ప్రియాంక కేసును కూకట్‌పల్లి పోలీసులు ఛేదించారు. యువతిని హత్య చేసి పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు లైంగికదాడి, హత్య జరిగినట్టు సృష్టించిన హంతకురాలు మంజులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి డీసీపీ సురేష్ కుమార్ వివరాలు వెల్లడించారు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధి భాగ్యనగర్ కాలనీ ప్రాంతంలో నివసించే, నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన ప్రియాంకకు ఎల్లమ్మబండ, ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలో నివసించే మంజులతో స్నేహం ఏర్పడింది. ఈ క్రమంలో ప్రియాంక.. తన దగ్గర ఉన్న చెవి పోగులు, వెండి ఆభరణాలను మంజుల దగ్గర దాచి పెట్టింది. గత నెల 30వ తేదీన తన బంగారు, వెండి వస్తువులు తనకు ఇవ్వాలని మంజులను కోరగా, అందుకు ఆమె నిరాకరించింది. ప్రియాంక.. తనకు తెలిసిన వారితో మంజులను బెదిరించి తన బంగారు చెవిపోగులు, వెండి ఆభరణాలను తీసుకున్నది.

దాంతో ప్రియాంకతో తనకు ప్రాణహాని ఉందని గుర్తించిన మంజుల, ప్రియాంకను తన ఇంటికి తీసుకువెళ్లి బాగా మద్యం తాగించింది. అనంతరం ప్రియాంకను స్కూటీ పైన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లోధా అపార్టుమెంట్ ముందున్న ఉదాశీన్ మఠం ఖాళీ స్థలంలోని చెత్తకుప్పలో పడవేసి తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో గొంతు కోసి హత్య చేసింది మంజుల. నేరం తన మీదికి రాకుండా ప్రియాంకపై లైంగికదాడి చేసి హత్య చేశారని నమ్మించడానికి, ప్రియాంక బట్టలు మొత్తం చింపి.. అక్కడినుంచి పరారైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితురాలు మంజులను అదుపులోకి తీసుకొని విచారించగా, నేరం తనే చేసినట్టు అంగీకరించింది. దాంతో ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీసీపీ తెలిపారు.

ఈ కేసు వేగవంతంగా ఛేదించి నేరస్తురాలిని పట్టుకునేందుకు సహకరించిన పోలీసు సిబ్బందికి డీసీపీ సురేష్ కుమార్ అవార్డులు అందజేశారు. ఈ సమావేశంలో బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్, అదనపు డీసీపీ సత్యనారాయణ, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస రావు, ఇన్‌స్పెక్టర్ ముత్తు, సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.



జీజేఎల్ఏ రాష్ట్ర అధ్యక్షులుగా మధుసూధన్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్(జీజేఎల్ఏ) రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ పీ.మధుసూధన్ రెడ్డి ఏకగ్రీవంగా మరోసారి ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్ ఆబిడ్స్‌లోని మెథడిస్ట్ ఇంజినీరింగ్ కాలేజీలో జీజేఎల్ఏ రాష్ట్ర మూడో కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. జీజేఎల్ఏ రాష్ట్ర అధ్యక్షులుగా మధుసూధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బలరామ్ జాదవ్ (నిర్మల్), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఈ.శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా విజయశేఖర్ (సంగారెడ్డి) ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఆర్థిక కార్యదర్శిగా ఏ. శివప్రసాద్, మహిళా విభాగం కార్యదర్శిగా ఎస్.పద్మావతి, ఉపాధ్యక్షులుగా సింగం శ్రీనివాస్, సత్యపాల్ రెడ్డి, జి.వేణుగోపాల్, టి.శ్రీధర్, ఎస్.నరేష్, వీ.అశోక్, స్టేట్ సెక్రెటరీలుగా వీ.ప్రమీల, ఏపీవీ ప్రసాద్, ఎం.హరిప్రసాద్, ఫహీముద్దీన్, జి మధు, కే.శ్రీదేవి ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి తెలంగాణ విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి హాజరై ప్రసంగించారు. విద్యారంగం అభివృద్ధికి అధ్యాపకులు మరింత కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యావ్యవస్థ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, కనీసం విద్యారంగానికి బడ్జెట్ లో పదిశాతం నిధులు కూడా కేటాయించలేదని సమావేశంలో ఆవేదన వ్యక్తం చేస్తూ తీర్మానం చేశారు.

రాష్ట్రంలో 10+ 2+3 విద్యావిధానాన్ని కొనసాగించి, ఇంటర్మీడి యేట్ విద్యా అస్తిత్వాన్ని ఆవశ్యకతను గుర్తించాలని సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. సర్కారు జూనియర్ కాలేజీల్లో అమలు చేస్తున్న ఉచిత విద్యకు ప్రతి ఏటా రూ.5 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేసింది.ర్కారు జూనియర్ కాలేజీలో చదువుతున్న అబ్బాయిలకు కూడా ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరింది.

ఉల్లి మంట..టమాటా తంటా

(మొదటిపేజీ తరువాయి)

యాదాద్రి, నల్లగొండ తదితర జిల్లాల్లో స్థానికంగా కూరగాయల దిగుబడులు లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలను తెస్తున్నారు. ఫలితంగా రవాణా భారం పెరగడం, తాజాదనం తగ్గడం ప్రజలకు ఇబ్బందిగా మారాయి. దిగుబడులు ఎక్కువ వచ్చినపుడు నిల్వ చేసుకునే సౌకర్యాలు లేకపోవడం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతున్నది.

వానలకు ఆకుకూరల తోటలు ఆగం

ఈ నెల మొదటి వారంలో వర్షాలు మొదలయ్యాక కూరగాయల ధరల వేగం పుంజుకున్నది. హైదరాబాద్ నగరానికి అవసరమైన ఆకుకూరలు చుట్టుపక్కల జిల్లాల నుంచి వస్తున్నాయి. వర్షాలతో ఆకుకూరలను తెగుళ్లు, చీడపీడలు ఆశించడంతో దిగుబడి బాగా తగ్గింది. దీంతో ఆకుకూరల రేట్లు కూడా బాగా పెరిగిపోయాయి. పదిహేను రోజుల కింద పది రూపాయలకు ఐదు పాలకూర కట్టలు ఇస్తే ఇప్పుడు రెండే ఇస్తున్న పరిస్థితి నెలకొంది. అన్ని ఆకుకూరలదీ ఇదే పరిస్థితి.

వానాకాలంలో టమాట తగ్గింది

ఎల్ వెంకట్రామిరెడ్డి. మాజీ డైరెక్టర్ ఉద్యాన,సెరికల్చర్ శాఖ

ప్రస్తుతం వానాకాలంలో టమాట సాగు తగ్గింది. అధికవర్షాలతో పంట దెబ్బతింటున్నదన్న ఆందోళన రైతుల్లో ఉంది. విత్తనాల సబ్సిడీ అందకపోవడం, కోతుల బెడద, దళారుల బెడద ఎక్కువగా ఉన్నది. కేవలం చలికాలంలో రైతులు టమాట సాగు చేస్తున్నారు. దీంతో ధరలు పెరుగుతున్నాయి. మల్టీపర్పస్ గ్రీనరీ షెడ్లు ఏర్పాటు చేసి కూరగాయలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు హైదరాబాద్‌కు వస్తే అక్కడి నుంచి గ్రామాలు సరఫరా అవుతున్నాయి. ఇది ఆశ్చర్యం కలిగిస్తున్నది.

	మెహిదీపట్నం రైతు బజారులో	ఓపెన్ మార్కెట్‌లో
టమాట	రూ.70	రూ.80-90
బెండకాయ	రూ.50	రూ.60-70
కాలిఫ్లవర్	రూ.30	రూ.40-50
క్యారెట్	రూ.50	రూ.70
దొండ	రూ.55	రూ.60-70
ఆలుగడ్డ	రూ.45	రూ.50-60
దోసకాయ	రూ.30	రూ. 40-50
బీన్స్	రూ.60	రూ.70-80

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

నవతెలంగాణ - ఐనవోలు



పిడుగుపాటుకు ఇద్దరు మృతిచెందిన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన యువతి దౌత్ బాజీ శ్రావణి(17), యువరైతు కూకట్ల రాజు(25) వారి వ్యవసాయ క్షేత్రం వద్ద ఆదివారం పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో పిడుగులు పడ్డాయి. పనిచేస్తున్న ప్రదేశంలో వారిపై పిడుగుపడటంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందినట్టు గ్రామస్థులు తెలిపారు. వారి మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

దమ్ముంటే అభివృద్ధికి నిధులిప్పించండి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అర్థరహిత విమర్శలు చేయడం తగదనీ, దమ్ముంటే కేంద్రం నుంచి అభివృద్ధికి నిధులిప్పించాలని బీజేపీ ఎంపీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈటలా..మోడీ దగ్గరకెళ్లి నిధులు అడుగుదాం పదా అని అడిగారు. సబర్మతి నది ప్రక్షాళనకు లేని ఆటంకం మూసీ ప్రక్షాళనకు ఎందుకని ప్రశ్నించారు. హరీశ్‌రావు, కేటీఆర్‌లను వారం పాటు మూసీ పక్కన ఇండ్లలో ఉంచితే అక్కడి ప్రజలు పడే కష్టాలేంటో తెలుస్తాయన్నారు. మల్లన్న సాగర్‌లో 60 వేల ఎకరాలను సేకరించి బాధిత కుటుంబాలకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వనివాళ్లు కూడా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్షన్నర కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారనీ, మూసీ ప్రక్షాళన కోసం పదివేల కోట్ల రూపాయలు ఖర్చుపెడితే తప్పేంటని నిలదీశారు. బాధిత కుటుంబాలకు ఆదుకునేందుకు సలహాలివ్వాలని ప్రతిపక్షాలను కోరారు. మూసీ రివర్ ప్రక్షాళన బాధిత కుటుంబాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందనీ, ప్రత్యేక కాలనీలు కట్టిస్తుందని భరోసానిచ్చారు. అక్కడే వారికి ఇంటర్, ఐటీఐ, అవసరమైతే ఇంజినీరింగ్ కాలేజీని కూడా కట్టిస్తామని హామీనిచ్చారు. నూతనంగా నియామక పత్రాలు అందుకున్న వారికి ఇది ఉద్యోగం మాత్రమే కాదనీ భావోద్వేగం అని చెప్పారు. ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, వ్యవసాయ అధికారులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, లైబ్రేరియన్లు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ ఉద్యోగాలకు ఎంపికైన 1635 మందికి నియామక పత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క), పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, కె.కేశవరావు, రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మెన్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లా డుతూ..గత ప్రభుత్వం వివిధ శాఖలకు సంబం ధించిన నోటిఫికేషన్లు ఇచ్చి చేతులు దులుపుకున్నదనీ, ఉద్యోగాలు ఇవ్వడం బాధ్యతగా భావించలేదని విమర్శించారు. ఉద్యోగాల కోసం నిరీక్షించి..నిరీక్షించి ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయే పరిస్థితిని కేసీఆర్ తెచ్చుకున్నారన్నారు. నిరుద్యోగ జంగ్ సైరన్ మోగించిన నాడు వాళ్ల ఉద్యోగాలు ఊడితేనే నిరుద్యోగులకు ఉద్యోగాలొస్తాయని చెప్పాననీ, ఇప్పుడు అదే జరుగుతున్నదని చెప్పారు. తమ పార్టీ కార్యకర్తల కంటే ఎక్కువ కష్టపడి కాంగ్రెస్‌ను గెలిపించిన నిరుద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే 90రోజుల్లోనే ప్రమాణ స్వీకారం చేసిన చోటే 30వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించామని చెప్పారు. దసరా పండగ నాడు ఉద్యోగం పొందిన కుటుంబాల్లో ఆనందం చూడాలనే 1,635 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించామన్నారు. వందలాది మంది బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో పునర్నిర్మాణంలో భాగస్వామ్యం కాబోతున్న ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌ను వరదల నుంచి కాపాడి తాగు, సాగునీటిని అందించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి ఇంజినీర్లను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని కోరారు. ఆర్ఆర్ఆర్, ఫ్యూచర్ సిటీ, ఫార్మాసిటీ నిర్మాణంలో పాలుపంచుకుని ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేలా నిర్మించాలని యువ ఇంజినీర్లకు సూచించారు. హైదరాబాద్‌లో చార్మినార్, ఉస్మానియా ఆస్పత్రి, అసెంబ్లీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం లాంటి ఎన్నో చారిత్రాత్మక, అద్భుత కట్టడాలున్నాయని వివరించారు. వందేండ్ల తెలంగాణ ఒకవైపు.. పదేండ్ల దుర్మార్గం మరోవైపు స్పష్టంగా కనిపించిం దన్నారు. కాళేశ్వరం కట్టినవారిని ఆదర్శంగా తీసుకుం టారో..నాగార్జున సాగర్‌ను కట్టిన వారిని ఆదర్శంగా తీసుకుంటారో ఆలోచిం చుకోవాలని ఉద్యోగులకు సూచించారు. ఎంపీ ఎన్నికల్లో ఓడిపోయిన కవితకు ఎమ్మెల్సీ, మరో బంధువుకు ప్లానింగ్ కమిటీ ఉపాధ్యక్షులు పదవిని కేసీఆర్ ఇచ్చుకున్నారనీ, 2015లో నోటిఫికేషన్లు ఇచ్చిన వాళ్లకు నేటికీ ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం గొప్పతనాన్ని, విద్యార్థి నిరుద్యోగుల త్యాగాలను కేసీఆర్ కవచంగా మార్చు కున్నారని విమర్శించారు. ప్రజలు పసిగట్టి బుద్ధిచెప్పడంతో ఆ ముసుగు తొలగించుకుని ఇప్పుడు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. అక్టోబర్ తొమ్మిదో తేదీన 11,063 మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలను అందించబోతున్నామని మరోమారు ప్రకటించారు. ఇది తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి, బాధ్యతకు నిదర్శనమన్నారు.

ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా మూసీని ప్రక్షాళన చేసి తీరుతాం

ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా మూసీ మురికిని ప్రక్షాళన చేయడం ఆపబోమనీ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ జరుగుతుందని మరోమారు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు ఇంకా మూసీ కంపులోనే బతకాలా? అని బీజేపీ, బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. మూసీ నిర్వాసితులను రెచ్చగొడుతున్న కేసీఆర్ కుటుంబానికి మల్లన్నసాగర్, గందమల్ల, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులో భూములు కోల్పోయినప్పుడు కనిపించలేదా? అని ప్రశ్నించారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు సామర్థ్యం 50 టీఎంసీలనీ, దాన్ని ఏనాడూ ఏడెనిమిది టీఎంసీలకు మించి నింపలేదన్నారు. పూర్తిస్థాయిలో నింపితే ఆ ప్రాజెక్టు స్వరూపం బట్టబయలు అయి ఊర్లు మునిగి పెను విధ్వంసం జరిగే ప్రమాదం ఉందన్నారు. డీపీఆర్ లేకుండా కట్టిన కాళేశ్వరం పరిస్థితి నేడు గందరగోళంగా మారిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోకి రూ.1500 కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయని ప్రశ్నించారు. వాళ్ల బాగోతం బయట పడుతుంది కాబట్టే మూసీ ప్రక్షాళనను బీఆర్ఎస్ నేతలు అడ్డుకుం టున్నారనీ, ప్రజలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. 33 టీమ్‌లు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాతనే 10 వేల కుటుంబాలు నష్టపోతాయని తేలిందన్నారు. సబర్మతి నది ప్రక్షాళన కోసం 65 వేల కుటుంబాలను తరలించగా..ఇక్కడ పది వేల కుటుంబాలను తరలిస్తే తప్పేంటని బీజేపీ నేతలను ప్రశ్నించారు. బీజేపీ ఎంపీలకు దమ్ముంటే కేంద్రం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూడాలని కోరారు. గత ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల రూపాయలను అప్పు చేసి కూర్చున్నదనీ, మూసీ ప్రక్షాళన బాధితుల కోసం రూ.10 వేల కోట్ల అప్పు చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. ప్రతి దానికీ అడ్డుపడటం కాదు.. మూసీ బాధితులను ఎలా ఆదుకుందామో సలహాలు ఇవ్వండి అని ప్రతిపక్షాలను కోరారు. మూసీ పరివాహక ప్రజలకు ఇండ్లు కట్టించి వారికి మంచి భవిష్యత్తును తమ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈటెల అంగి మారింది కానీ.. వాసన మారలేదని చురకలు అంటించారు. పేదల వైపు నిలబడాలని సూచించారు. మంత్రి సీతక్క మాట్లా డుతూ..ఎన్నో లక్ష్యాలు, నిబద్ధత, అంకితభావంతో ఉద్యోగాలు సాధించిన వారందరూ అంతే అంకితభావంతో తమదైన ముద్ర వేస్తూ మార్పు కోసం పనిచేయాలని సూచించారు. వృత్తిబాధ్యతలను సరిగా నిర్వర్తిస్తేనే ప్రజలు గుండెల్లో చోటు దక్కుతుందనీ, వారికి చేసే సేవ శాశ్వత గుర్తింపు తీసుకొస్తుందని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..మాజీ సీఎం కేసీఆర్ చీఫ్ ఇంజినీర్‌గా మారితే మేడిగడ్డ మేడిపండైందనీ, లక్షన్నర కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారని విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ పదిసార్లయినా సచివాలయానికి వచ్చారా? అని ప్రశ్నించారు. రోజూ ప్రజలకు సమయం ఇస్తూ క్రమం తప్పకుండా సచివాలయానికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై ఎందుకు అక్కసు అని విమర్శించారు. తాము వేసిన నోటిఫి కేషన్లకు ఆర్డర్లు ఇస్తున్నారని కేటీఆర్ విమర్శిం చడం తగదన్నారు. తమరే నోటిఫికేషన్లు వేస్తే మూడేండ్లుగా కోర్టు చిక్కులను, చిన్న సమస్యలను ఎందుకు పరిష్కరిం చలేదు? ఎగ్జామ్ అయిపోయాక కూడా ఎందుకు ఆర్డర్లు ఇవ్వలేకపోయారు? అని ప్రశ్నించారు. నూతనంగా నియామక పత్రాలు అందుకున్న వారంతా దేశంలో తెలంగాణను రోల్‌మోడల్‌గా నిలిపేందుకు కృషి చేయాలని కోరారు.





మైక్రో ఫైనాన్స్ వేధింపులు అరికట్టాలి

- నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- జిల్లా కేంద్రంలో ఐద్వా 3వ మహాసభలు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

అధిక వడ్డీకి రుణాలు ఇచ్చి పేద ప్రజలను వేధింపులకు గురి చేస్తున్న బంధన్ బ్యాంక్, మైక్రో ఫైనాన్స్ లాంటి రుణ సంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఆర్ఎంపీ భవన్‌లో నిర్వహించిన అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా 3వ మహాసభకు ఆమె హాజరయ్యారు. ముందుగా సంఘం జెండా ఆవిష్కరించి, అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బంధన్ బ్యాంకు, మైక్రో ఫైనాన్స్ లాంటి తదితర రుణ సంస్థల నుంచి జిల్లాలోని నిరుపేదలు ఆర్థిక ఇబ్బందులతో రుణాలు తీసుకున్నారన్నారు. కానీ ఆ రుణ సంస్థల యాజమాన్యాలు అధిక వడ్డీ వసూలు చేస్తూ పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి రుణ సంస్థలపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. నేత కార్మికులు ప్రయివేటు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి లభించే వరకు రుణ సంస్థలు ఇబ్బందులకు గురి చేయొద్దని సూచించారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, మహిళలకు ఉపాధి కల్పనలో భాగంగా పరిశ్రమలు స్థాపించాలని అన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను రద్దుచేసి మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ మహాసభలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సూరం పద్మ ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి విమల, ఉపాధ్యక్షులు దేవలక్ష్మి, ఎండీ రెహమాన, కల్పన, పూజ, సహాయ కార్యదర్శిగా సామల కవిత, వడ్ల లక్ష్మి, బోనాల లక్ష్మి తదితరులను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

- గురుకుల జేఏసీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మొత్తం గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల్లో సుమారు 662 వరకు అద్దెభవనాల్లో నడుస్తున్నాయనీ, ఆ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని గురుకుల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం జేఏసీ అధ్యక్షులు మామిడి నారాయణ, జనరల్ సెక్రటరీ డాక్టర్ మధుసూదన్, ఎస్ డబ్ల్యూ అధ్యక్షులు నరసింహులు గౌడ్ , ఎస్టీ డబ్ల్యూ జనరల్ సెక్రెటరీ గణేష్, బీక్షం యాదవ్, వేదాంతా చారి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం వెంటనే రూ. ఐదు వేల కోట్లకు పరిపాలన ఉత్తర్వులు ఇస్తూ ఈనెల 11న 40 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేసారి చేపడుతున్నందున గురుకుల విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ చర్య వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్య దూరమవుతుందని తెలిపారు. సమయ పాలన సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.పెరిగిన ధరలకనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని కోరారు. గురుకుల జేఏసీ, టీఎస్ యుటిఎఫ్ సంయుక్తంగా సమర్పించిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

లారీ ఢీకొని భవన నిర్మాణ కార్మికుడు మృతి

- మరొకరికి గాయాలు
- కుటుంబానికి అండగా ఉంటాం : సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్

నవతెలంగాణ-రాజేంద్రనగర్

బైక్‌పై వెళ్తున్న ఇద్దరు భవన నిర్మాణ కార్మికులను వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో.. ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మండలం ధన్వాడ గ్రామానికి చెందిన కిష్టాపురం రాజు(36) బతుకుతెరువు కోసం రాజేంద్రనగర్ ప్రాంతానికి కొంతకాలం క్రితం వలస వచ్చాడు. రాజు స్థానికంగా భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తున్నాడు. అయితే ఆదివారం ఉదయం పని నిమిత్తం రాజు తన స్నేహితుడైన రమేష్‌తో కలిసి బైక్‌పై ఆరాంగర్ నుంచి దుర్గానగర్ వైపు వెళ్తున్నారు. దుర్గానగర్ దగ్గర లారీ అతివేగంగా వచ్చి నిర్లక్ష్యంగా రాజు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరూ కింద పడిపోయారు. రాజు తలకు బలమైన గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్‌కు గాయాలు కావడంతో స్థానికులు అతన్ని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ ప్రభాకర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతిచెందిన భవన నిర్మాణ కార్మికుడు రాజు.. కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చేంతవరకు వారికి అండగా ఉంటామని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్ తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు.

అనంతరం మృతుని భార్య భారతమ్మను పరామర్శించారు. కార్మికుని కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించేంత వరకూ సీఐటీయూ పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో భవన నిర్మాణ రంగం నాయకులు స్వామి, వెంకటేష్, చాంద్ పాషా, రాజు ఉన్నారు.

హైకోర్టు తీర్పు అమలు చేయకపోతే

ఓసీ పనులు అడ్డుకుంటాం

- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



నిర్వాసితుల భారీ ప్రదర్శన, విజయోత్సవ సభ

నవతెలంగాణ-టేకులపల్లి

కోయగూడెం ఓసీ 2 నిర్వాసితులకు హైకోర్టు తీర్పు ఇచ్చిన ప్రకారం భూమి నష్టపరిహారం, ఉద్యోగాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పును హర్షిస్తూ ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలో నిర్వాసితులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట రేపాకుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం ఏ ప్రాజెక్టు వల్లనైనా సాగు భూములు కోల్పోయిన గిరిజనులకు భూమికి భూమి, భూ నష్టపరిహారం ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని ఉన్నప్పటికీ నిర్వాసితులకు ఒక్క పైసా నష్టపరిహారం, పునరావాసం చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో వ్యవసాయ కార్మిక సంఘం, నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశామని, అదేవిధంగా హైకోర్టులో న్యాయపోరాటం చేశామన్నారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని కోర్టు తీర్పు ఇవ్వడాన్ని హర్షించారు. 2007లో కోయగూడెం ఓసీ 2 పిట్ 2, 3 భూసేకరణ జరిగిందని, 238 హెక్టార్ల సాగు భూమిని రైతులు కోల్పోయారని, లచ్చగూడెం, కోయగూడెం, దంతెలతండా, కొత్తతండా, జేత్యతండాలకు చెందిన 101 మంది గిరిజనులు, నలుగురు గిరిజనేతరులు, మొత్తం 105 మంది ఉన్నారన్నారు. సింగరేణి సంస్థ వారి భూమికి నష్టపరిహారం, పునరావాసం ఇవ్వకుండా పంటలను ధ్వంసం చేశారన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, భూ నిర్వాసితుల సంఘాల ఆధ్వర్యంలో సింగరేణి సంస్థకు వ్యతిరేకంగా ఉద్యమించినట్టు తెలిపారు. ఎకరానికి రూ.5వేలు పంట నష్టపరిహారం, హైకోర్టు తీర్పు ప్రకారం 2012లో పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. భూమి నష్టపరిహారం కోసం బాధితులు మళ్ళీ 2016లో హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. 8 ఏండ్ల తర్వాత హైకోర్టు తీర్పు నిర్వాసితుల పక్షాన రావడం సంతోషకరమని తెలిపారు.

బేతంపూడి పీఏసీఎస్ చైర్మెన్ లక్కినేని సురేందర్ మాట్లాడుతూ.. నిర్వాసితులకు న్యాయం చేయాలన్న హైకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యకాస జిల్లా అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దుగ్గి క్రిష్ణ మాట్లాడారు. 16 ఏండ్లుగా నిర్వాసితులు చేసిన పోరాటంలో న్యాయం ఉన్నందువల్లనే హైకోర్టు ఈ తీర్పు ఇచ్చిందని అన్నారు. ఐటీడీఏ పీవో, కలెక్టర్లు హైకోర్టు తీర్పు అమలు జరిపి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, జిల్లా కమిటీ సభ్యులు ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, పూనెం స్వామి, పూనెం చంద్రశేఖర్, దొడ్డ సంపత్ కుమార్, భూక్యా రవి, వస్రం నిర్వాసితులు పాల్గొన్నారు.

అమెరికా పర్యటనకు మంత్రి జూపల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం అమెరికాకు వెళ్లనున్నారు. ఐమ్యాక్స్ అమెరికా 2024 పేరిట లాస్ వేగాస్ లో నిర్వహించనున్న అతి పెద్ద వాణిజ్య ప్రదర్శనలో మంత్రి పాల్గొంటారు. ఆదివారం దుబాయ్ నుంచి అమెరికా వెళ్లారు.నేడు వాషింగ్టన్ డీసీ చేరుకుంటారు. మంగళవారం లాస్ ఎంజెల్స్, 9,10న లాస్ వెగాస్, 11న అట్లాంటాలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. అమెరికా పర్యటన ముగించుకుని12న భారత్ చేరుకొంటారు. తెలంగాణ పర్యాటక రంగానికి కలిసి వచ్చే అంశాలను సద్వినియోగం చేసుకుంటూ దాన్ని కొత్తపుంతలు తొక్కించడం, ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంలో పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన కొనసాగనుంది.

అన్నదాతల బలిదానాలకు రేవంత్‌రెడ్డి సర్కారే కారణం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. 'ఓవైపు సాగునీటి సంక్షోభం. మరోవైపు రుణమాఫీ ద్రోహం.ఇంకోవైపు రైతు భరోసా మోసం. కౌలు రైతులకూ అందని సాయం' అంటూ విమర్శించారు.రైతుకు రక్షణ వలయంగా ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా ఎగ్గొట్టడంతోనే వ్యవసాయంలో ఈ విలయం నెలకొందని తెలిపారు. వందలాది మంది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా ఈ ప్రభుత్వంలో చలనం లేదని విమర్శిం చారు. సీఎం రేవంత్‌రెడ్డికి సోయి లేదని, ప్రభుత్వానికి బాధ్యత లేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దసరా పండుగ వేళ వ్యవసాయాన్ని దండగలా మార్చిం దన్నారు. రైతన్నల చేతిలో దండన తప్పదని అన్నారు. 'అన్నదాతలారా ఆత్మస్థైర్యం కోల్పోకండి..! ముంచే రోజులు పోతాయ్.మళ్లీ మంచి రోజులొస్తాయ్' జై కిసాన్ అంటూ వ్యాఖ్యానించారు. కాగా రైతు రుణమాఫీ ఎగ్గొట్టి, మూసీలో మురికి రాజకీయాలు చేస్తున్న మురికి దొంగ ఎవరు? రైతు బంధు ఎగ్గొట్టి, మూసీ పేదల ఉసురు పోసుకుంటున్న దుర్మార్గుడు ఎవరు? అని పోస్టు చేశారు. మహి ళలకు వంద రోజుల్లోనే నెలకు రూ.2500, అవ్వ, తాతలకు నెలకు రూ. 4000 ఇస్తా అని చెప్పి ఎగ్గొట్టిన నయవంచకుడు ఎవరు? అని ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు.మూసీ సుందరీకరణ పేరిట రూ. లక్షన్నర కోట్లు లూటీకి తెరతీసిన ఘనుడు ఎవరు? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల వేడుకకు ఏర్పాట్లు చేసేడానికి మనసురాట్లేదా? పండుగపూట కూడా పల్లెలను పరిశుభ్రంగా ఉంచలేరా? చెత్తా చెదారం మధ్య మురికి కంపులో మన ఆడబిడ్డలు బతుకమ్మ ఆడుకోవాలా? అని నిలదీశారు. తెలంగాణ అస్తిత్వ సంబురంపై ఎందుకింత నిర్లక్ష్యం? బతుకమ్మ అంటే గిట్టదా?పట్టదా? ఈ ముఖ్యమంత్రికి? సీఎంను ప్రశ్నించారు.

నర్సింహానందను వెంటనే అరెస్టు చేయాలి

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మత విద్వేష ప్రసంగాలతో ప్రజలమధ్య చిచ్చు పెడుతున్న నర్సింహానందను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఆలయ పూజారీ నర్సింహానంద చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దేశంలో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆయనపై ఏకంగా దేశ వ్యాప్తంగా యాభైకి పైగా కేసులు నమోదయ్యాయని తెలిపారు. గతంలో మదర్సాలను కూల్చివేయాలనీ, అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీని గన్‌పౌడర్ ఉపయోగించి పేల్చివేయాలని పిలుపునిచ్చి మతాల మధ్య చిచ్చు పెడుతున్నందుకు ఆయనపై కేసు నమోదైందని గుర్తు చేశారు. బెయిల్‌పై బయటకొచ్చి తిరిగి అదే తరహాలో మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ప్రసంగాలు చేస్తున్నారని విమర్శించారు. బెయిల్‌ను రద్దు చేసి, ఆయన్ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మతోన్మాద సంస్థల, వ్యక్తుల పట్ల కేంద్ర ప్రభుత్వ సానుకూల వైఖరి వల్లనే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. మతోన్మాద రాజకీయాలను ప్రజలు తిరస్కరించటం ద్వారానే మతోన్మాదులకు చెక్ పెట్టగలమని పేర్కొన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నీట్ లీక్ కేసులో మూడో చార్జిషీట్

- ప్రత్యేక కోర్టులో సమర్పించిన సీబీఐ



న్యూఢిల్లీ : నీట్ ప్రశ్నాపత్రం లీక్ కేసులో సీబీఐ మూడో చార్జిషీట్ దాఖలు చేసింది. పాట్నాలోని సీబీఐ కేసులకు సంబంధించి ప్రత్యేక కోర్టులో శనివారం 21 మంది నిందితులకు వ్యతిరేకంగా చార్జిషీట్ సమర్పించింది. సెప్టెంబర్ 20న ఆరుగురు నిందితులకు వ్యతిరేకంగా సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తాజా పరిణామంతో ఇప్పటివరకు చార్జిషీట్ లో మొత్తం నిందితుల సంఖ్య 40 మందికి చేరింది. ఈ కేసులో 2024,ఆగస్టు 1న సీబీఐ 13 మందిపై మొదటి చార్జిషీట్ ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. జార్ఖండ్‌లోని హజరీబాగ్‌లోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సంస్థ నుంచి నీట్ ప్రశ్నాపత్రాన్ని దొంగిలించారన్న నేరంపై అదుపులోకి తీసుకున్న బొకరో నివాసి , సివిల్ ఇంజనీర్ పంకజ్ కుమార్ అలియాస్ ఆదిత్య కీలక నిందితుడిగా ఉన్నట్టు సీబీఐ వర్గాలు తెలిపాయి. ప్రశ్నాపత్రాన్ని దొంగిలించేందుకు రాజ్ సింగ్ అనే వ్యక్తి సహాయం అందించినట్టు పేర్కొన్నాయి. దీంతో జులై 16న పంకజ్ , రాజు సింగ్‌లను అరెస్ట్ చేసినపుడు కటకమ్‌డాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్ ప్రాంతంలోని రాజ్ గెస్ట్ హౌస్‌ను సీబీఐ సీల్ చేసింది.

వైవాహిక 'లైంగికదాడి' నేరం ఎందుకు కాదు?

న్యూఢిల్లీ : వివాహమంటే ఒక స్త్రీ తన హక్కులను కోల్పోవటంతో సమానమేనా? పెండ్లి తర్వాత మానసిక, శారీరక వేధింపులకు సిద్ధమై ఉండాలా? వైవాహిక లైంగికదాడి విషయంలో కేంద్రం వాదనలు వింటే మహిళల హక్కుల గురించి ఆలోచించే ప్రతి ఒక్కరికీ అలా అనిపించక మానదు. వైవాహిక లైంగికదాడిని నేరంగా పరిగణించలేమని కేంద్రం.. భారత సర్వోన్నత న్యాయస్థానానికి ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఒకవేళ దీనిని నేరంగా పరిగణిస్తే, అది దాంపత్య బంధాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని వివరించింది. వైవాహికి లైంగికదాడిని నేరంగా పరిగణించటమనేది సుప్రీంకోర్టు పరిధిలో లేదని అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు ఈనెల 3న సుప్రీంకోర్టుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 49 పేజీల అఫిడవిట్‌ను సమర్పించింది. కేంద్రం వాదనపై తీవ్ర చర్చే జరిగింది. అలాగే, ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌పై సర్వత్రా విమర్శలూ వస్తున్నాయి. ముఖ్యంగా, మహిళా లోకం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. కేంద్రం వాదనలను మహిళా న్యాయవాదులు, మహిళా సంఘాల నాయకులు, హక్కుల కార్యకర్తలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. వివాహమంటే.. స్త్రీ తన



హక్కులను కోల్పోవటంతో సమానమనే భావనను కేంద్రం తీసుకొస్తున్నదని ఢిల్లీకి చెందిన సుప్రీంకోర్టు న్యాయవాది తులసిరాజ్ ఆరోపించారు. హక్కుల విషయంలో భారత రాజ్యాంగం మహిళలకు హామీనిచ్చిందని ఆమె గుర్తు చేశారు.

18 ఏండ్ల కంటే తక్కువ వయసు లేని స్వంత భార్యపై భర్త లైంగిక సంపర్కం, చర్యలు లైంగికదాడి కిందకు రావని భారతీయ శిక్షా స్మృతిలోని సెక్షన్ 375 (మినహాయింపు 2), ప్రస్తుత భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 63 (మినహాయింపు 2) పేర్కొంటున్నాయి.

భారత్ కాకుండా.. ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాల్లో వైవాహిక లైంగికదాడి నేరంగా పరిగణించబడుతున్నది. అయితే, వైవాహిక లైంగికదాడి చట్టవిరుద్ధం కాని 36 దేశాల్లో భారత్ ఒకటిగా ఉండటం గమనార్హం. వైవాహిక లైంగికదాడిని నేరంగా పరిగణిం చాలంటూ దేశవ్యాప్తంగా పలు కోర్టుల్లో అనేక పిటిషన్లు దాఖలైనప్పటికీ.. భారత్‌లోని పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవటం గమనార్హం. ఢిల్లీ హైకోర్టు 2022, మేలో ఈ కేసుపై మిశ్రమ తీర్పును ఇచ్చింది.

ఆ తర్వాత సుప్రీంకోర్టు ఈ సవాలును స్వీకరించి, విచారణ జరపటానికి అంగీకరించింది. వైవాహిక లైంగికదాడిని నేరంగా చేర్చలేమని 2017లో కేంద్రం పేర్కొన్నది. అది వివాహ వ్యవస్థపై అస్థిర ప్రభావాన్ని చూపుతుందని వివరించింది. అయితే, 2022లో ఈ సమస్యకు విస్తృత సంప్రదింపులు అవసరమని పేర్కొనటం గమనార్హం. కేంద్రం వాదన స్త్రీ గౌరవం, శారీరక గోప్యతను ఉల్లంఘించటమేనని మహిళా న్యాయవాదులు అంటున్నారు. ఏకాభిప్రాయం లేని, హింసాత్మకమైన, బలవంతపు లైంగిక సంబంధాలకు పాల్పడే భర్తకు శిక్షార్హమైన పరిణామాల విషయంలో ఇది చట్టపరమైన కవచాన్ని సృష్టిస్తుందని ఆరోపిస్తు న్నారు. కేంద్రం అఫిడవిట్.. మహిళల శారీరక స్వయం ప్రతిపత్తి హక్కును విస్మరిస్తున్నదని న్యాయవాది రాధికా రాయ్ అన్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) ప్రకారం.. 18 నుంచి 49 ఏండ్ల మధ్య వయసు గల స్త్రీలలో దాదాపు 83 శాతం మంది తమ జీవిత భాగస్వామి ద్వారా వేధింపులకు గురైనట్టు తెలపటం గమనార్హం.

కేంద్రం అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలు భార్యల పట్ల శాపంగా మారనున్నాయనీ, దీనిని ఆసరాగా చేసుకొని అనేక మంది భర్తలు రెచ్చిపోయే ప్రమాదమున్నదని మహిళా న్యాయవాదులు అంటున్నారు. సుప్రీంకోర్టు ఈ విషయంలో తీవ్రంగా పరిగణించే సమయం ఆసన్నమైందని వారు చెప్తున్నారు. "స్త్రీ పెండ్లయ్యాక కేవలం భార్యగా తల్లిగా మాత్రమే ఉండాలనే ఆలోచనా విధానాన్ని పెంపొందిం చటాన్ని ప్రారంభించటం చాలా ముఖ్యం. మహిళ కేవలం పునరుత్పత్తి, గృహ ప్రయోజనాల కోసం ఉపయోగిం చబడే వస్తువు కాదు. ఆమె మొదట పూర్తి శారీరక స్వయంప్రతిపత్తిని కలిగి ఉన్న వ్యక్తి. తన భర్తతో ఎప్పుడు లైంగికంగా పాల్గొనకూడదో నిర్ణయించుకునే అధికారాన్ని కలిగి ఉంటుంది" అని మహిళా న్యాయ వాదులు వివరించారు.



హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని రాజప్ప నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా నవరాత్రుల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజప్ప నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దీపావళి శ్రవణ్ కుమార్, అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ - వనస్థలిపురం

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఎల్బీనగర్ -మహేశ్వరం

సోమవారం | అక్టోబర్ 07, 2024 | www.navatelangana.com

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-హయత్‌నగర్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబానికి మన్సూరాబాద్ బీ ఆర్ఎస్ సీనియర్ నేత పోచబోయిన జగదీష్ ఆదివారం అందజేశారు. మన్సూరాబాద్ డివిజన్ కాస్మోపాలిటన్ కాలనీకి చెందిన సావిత్రమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి విడుదలైన 34,500 రూపాయల చెక్కును వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రామ్ రెడ్డి, ధనమ్మ, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై విస్తృత ప్రచారం నిర్వహించాలి



- జేఏసీ తీర్మానం

నవతెలంగాణ-హయత్ నగర్

అవయవ దానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జైభారత్ సొసైటీ నిర్వాహకులు అన్నారు. ఆదివారం మన్సూరాబాద్ లో ఉన్న ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో నేత్ర, దేహ, శరీర దాతలకు సన్మానం చేశారు. నేత్ర, అవయవ, శరీర దానంపై ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించడానికి జాయింట్ యాక్షన్ కమిటీ ఫర్ ఐ, ఆర్గాన్, బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ సంస్థ తెలంగాణ వ్యాప్తంగా చేస్తున్న కృషిని జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి అభినందించారు. రంగారెడ్డి జిల్లాల్లో నేత్ర, అవయవ, శరీర దానాలపై భవిష్యత్ కార్యాచరణ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందుగా నేత్ర, దేహ, శరీరదానాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్లకార్డులతో ఎల్బీనగర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.

ఈ సమావేశానికి ప్రధాన వక్తగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ సభ్యత్వం కావాలంటే శరీర దానానికి అంగీకారం పత్రం హామీ తప్పనిసరి అని తెలిపారు. జేఏసీ తరపున హైదరాబాద్ లో విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జేఏసీ తరఫున జిల్లా సమావేశాలను నిర్వహిస్తున్నామని అన్నారు. జైభారత్ ఉద్యమం తరపున నేత్ర, దేహ, శరీర దానాలను చేసిన కుటుంబాలను సన్మానించారు. దాతల కుటుంబాలను సభ్యులందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, ఖమ్మం జిల్లా బాధ్యులు మల్లారెడ్డి, హనుమంతరావు, వాసన్ నేత్ర సేకరణ సంస్థ అరవింద్ కుమార్, గంజి ఈశ్వర్ లింగం, అడ్వకేట్ రాం చల్లా, జైభారత్ జాతీయ కార్యదర్శులు రజనీ, లోక్ నాథ్, రాష్ట్ర నాయకులు మల్లికా వల్లభ, సుధాకర్ బోయ, రాజు, గణేష్ గల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ(ఎం) పార్టీ శాఖ మహాసభలు



నవతెలంగాణ-చంపాపేట్

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ(ఎం) మలక్‌పేట్ జోన్ కార్యదర్శి బాలు నాయక్ అన్నారు. సైదాబాద్ సీపీఐ(ఎం) శాఖ మహాసభను ఆదివారం భూలక్ష్మీ నగర్‌లోని లక్ష్మీ ఇంట్లో కామ్రేడ్ కనుక చారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు మీసాల శ్రావణ్ కుమార్‌తో కలిసి బాలు నాయక్ మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏండ్లలో అనేక అమలు చేయకపోవడంతో ప్రజలు తిరగబడి కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం ఇచ్చారని గుర్తుచేశారు. కానీ ఈ మధ్యకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. మూసీ సుందరీకరణ, హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చేయడం దారుణమన్నారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కావున ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు చేసిన తప్పిదాన్ని గుర్తించి.. పేదలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం శాఖ కార్యదర్శిగా తిరిగి లక్ష్మీని సభ్యులందరూ ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాఖ సభ్యులు కనకాచారి బుచ్చమ్మ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - హస్తినాపురం

నూతన శాఖ కార్యదర్శిగా మంథని యాదయ్య

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాల పట్ల సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని సీపీఐ(ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. చంద్రమోహన్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనంలో సీపీఐ(ఎం) పార్టీ శాఖ 9వ మహాసభను కామ్రేడ్ కుంటిగొర్ల రాములు అధ్యక్షతన నిర్వహించారు. తర్వాత నూతన శాఖ కార్యదర్శిగా కామ్రేడ్ మంథని యాదయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహాసభలకు విచ్చేసిన సీపీఐ(ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. చంద్ర మోహన్ మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గుతున్నప్పటికి భారత దేశంలో మాత్రం రోజురోజుకూ ఇంధన ధరలు పెరగటం దుర్మార్గమని, మోదీ ప్రభుత్వం దేశ ప్రజలపై అధిక ధరల పేరిట పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 15 నుండి అధిక ధరలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జరిగే ప్రచార కార్యక్రమంలో పార్టీ సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేసి, హైడ్రా పనుల నేపథ్యంలో నిరాశ్రయులైన పేదవారికి వెంటనే పునరావసం కల్పించాలని కోరారు. ఈ మహాసభలలో సీపీఐ(ఎం) ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, శాఖ సభ్యులు కమర్ రవి, లక్ష్మయ్య, గణేష్ పాల్గొన్నారు.



లక్ష్మీదుర్గా కాలనీ వెల్ఫేర్

అసోసియేషన్ అధ్యక్షులుగా వి.రామమూర్తి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 30వ డివిజన్ పరిధిలో ఉన్న లక్ష్మీదుర్గా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా వి.రామమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కాలనీ వాసులు ప్రత్యేక సమావేశం నిర్వహించి.. కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షులుగా వి. రామమూర్తి, ఉపాధ్యక్షునిగా ఏ. గిరిధర్ గౌడ్, జనరల్ సెక్రటరీగా బి.రాజు, జాయింట్ సెక్రటరీగా ఏ.రమేష్ రావు, కోశాధికారిగా ఎన్. బాలన్న, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, శ్రీ వాస్తవ, ప్రశాంత్ మిశ్రా, ఎం.పి.శివ కుమార్, ఎం.ప్రతాప్, జీ.రవి కుమార్, బి.సందీప్, డి.శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. .ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రామమూర్తి మాట్లాడుతూ కాలనీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని, తనపై నమ్మకం ఉంచి అధ్యక్షులుగా ఎన్నుకున్న కాలనీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

కబడ్డీ అసోసియేషన్

ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గోపాల్ ముదిరాజ్

నవతెలంగాణ - చంపాపేట్

చంపాపేట్ డివిజన్ సీనియర్ కాం గ్రెస్ నాయకుడు గోపాల్ ముదిరాజ్ రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఎగ్జి క్యూటివ్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం గోపాల్ ముదిరాజ్‌కు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. తర్వాత ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గోపాల్ ముదిరాజ్ మాట్లాడుతూ... నాపై నమ్మకం ఉంచి నన్ను కబడ్డీ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నిక చేసినందుకు తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కే జగదీశ్వర్ యాదవ్, రంగారెడ్డి జిల్లా



కబడ్డీ చైర్మన్ మద్ది కర్ణాకర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్‌కు ఎల్లవేళలా తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్‌కు మంచి పేరు వచ్చే విధంగా పనిచేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ఎలెక్టెడ్ బాడీ ప్రెసిడెంట్ ఎం. రవి కుమార్, బి. సుధాకర్ రెడ్డి జనరల్ సెక్రెటరీ ఈ. రాజు, ట్రెజరర్‌గా ఎం. మహేందర్ రెడ్డి, సీఐ జే. చంద్రమోహన్ గౌడ్, జాయింట్ సెక్రెటరీ మరియు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా యమ్మ భాష, పల్లెల శ్రీనివాసరెడ్డి, మొదలగువారు నూతనంగా ఎన్నికైన సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యారంగ సమస్యలపై పోరాడాలి



- ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ - పెద్దఅంబర్‌పేట్

పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని రావి నారాయణరెడ్డి కాలనీలో ఆదివారం అఖిల భారత విద్యార్థి సమైక్య అబ్దుల్లాపూర్‌మెట్ మండలం నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి చింత వెంకటేష్ అధ్యక్షతన సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, సీపీఐ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీవర్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులందరూ చదువుతో పాటు విద్యారంగ సమస్యల పైన ఐక్య పోరాటాలు నిర్వహించాలని కోరారు. భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యారంగ సమస్యలను పరిష్కరించేలా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా విధానాన్ని వ్యతిరేకించాలని, నాణ్యమైన విద్య కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీ ఎన్నిక...

అబ్దుల్లాపూర్మెట్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శిగా చింత వెంకటేష్, అధ్యక్షులుగా భూక్యా వినోద్, ఉపాధ్యక్షులుగా వట్టి కార్తీక్ రెడ్డి, గర్ల్స్ కన్వీనర్‌గా కాటి శ్రావణి, కో - కన్వీనర్ గా చెంచేటి జ్యోష్న, సహాయ కార్యదర్శిగా వి. సత్యం, కోశాధికారిగా అల్లెంకి అఖిల, కార్యవర్గ సభ్యులుగా ఎన్. భాను ప్రకాష్, ఐ. భాను ప్రకాష్, చందు, అరవింద్, నరేష్, నవీన్, రాఘవతో పాటు 10 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'ప్రధాన రహదారి

రోడ్డు విస్తరణ నిర్మాణ పనులు ప్రారంభం'



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని బస్టాండ్ ప్రధాన రహదారి రోడ్డు విస్తరణ నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభమైనట్టు కార్పొరేటర్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, జీ.ఇంద్రసేన, తోట శ్రీధర్ రెడ్డిలు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బస్టాండ్‌లోని ప్రధాన రోడ్డు పనులు, కల్వర్టు పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం పది రోజుల వరకు వాహనాలను మళ్లింపబడుతుందని, గ్రామ ప్రజలు కాలనీవాసులు ఆర్టీసీ బస్సులను ఇతర వాహనాలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనుక నుండి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుండి కింద కోటగడ్డ నుండి కింది బస్తి రామాలయం నుండి ఎంవిఎస్ అర్ కళాశాల మర్రిచెట్టు వరకు మళ్లింపబడుతుందని అందుకోసం ప్రజలు వాహనదారులకు, ఆర్టీసీ బస్సులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కారిడార్ 4, కారిడార్ 9లో

మార్పులు చేయాలని వినతి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఫేస్ 2కు సంబంధించి కారిడార్ 4, కారిడార్ 9లో మార్పులు చేయాలని కోరుతూ ఆదివారం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్ రెడ్డికి మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ పార్టీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మెట్రో రైల్ ఎండి ఎన్ వి ఎస్ రెడ్డి మెట్రో రైల్ ఫేజ్ 2 కు సంబంధించిన కొత్త కారిడార్లను ప్రకటించారని, అందులో కారిడార్ 4 విమానాశ్రయ మెట్రో కారిడార్ రూట్ మ్యాప్‌ను విడుదల చేసినట్లు



తెలిపారు. ఈ రూట్ మ్యాప్ నాగోల్ నుండి ప్రారంభమై ఎల్బీనగర్ మందమల్లమ్మ చాంద్రాయణగుట్ట ఆరంగర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కిలోమీటర్లు ఉంటుందని, కారిడార్ 9 శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40 కిలోమీటర్లు అనగా 4, 9 కారిడార్లు కలిపితే 76 కిలోమీటర్లుగా ప్రకటించారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డిని మెట్రో రైలు ఎండీని కలసి వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. కారిడార్ 4, 9 రూటును మార్చాల్సిందిగా దానికి గాను నాగోల్ - ఎల్బీనగర్- మంద మల్లమ్మ - బాలాపూర్ చౌరస్తా - శివాజీ చౌక్ - ఆర్ సి ఐ మీదుగా శంషాబాద్ ఎయిర్పోర్ట్ - మహేశ్వరం గేట్ - కందుకూర్ ఫోర్త్ సిటీ వరకు కొత్త రూట్ మ్యాప్‌ను ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ కొత్త రూట్ మ్యాప్ ద్వారా 76 కిలోమీటర్లు మెట్రో లైన్ కేవలం 41 కిలోమీటర్లతో పూర్తి చేయవచ్చని వివరించారు. స్పందించిన మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీకి ఈ రూట్ మ్యాప్‌ను, వినతిపత్రం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపల్ చైర్మెన్ బరిగల హేమలత రాజు గౌడ్, తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షులు రచ్చ లక్ష్మణ్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పెండ్యాల నరసింహ, కౌన్సిలర్ కాంటెకర్ మధుమోహన్, కార్పొరేటర్లు బిక్షపతి చారి, బీజేపీ, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జెఎస్ హాస్పిటల్‌ను ప్రారంభించిన మధుయాష్కీ గౌడ్





నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం గురుద్వార్ రోడ్డులో హుడా కాలనీ ఏ క్వార్టర్స్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జెఎస్ హాస్పిటల్‌ను ఆదివారం టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మెన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కీ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్‌లు కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించడం ద్వారా వారి మన్ననలు పొందుతారని అన్నారు. వనస్థలిపురం పరిసర కాలనీలకు గత 20 సంవత్సరాల నుండి పరిచయస్తులైన ఆర్థోపెడిక్ డాక్టర్ శ్రీనివాసులు, గైనకాలజిస్ట్ డాక్టర్ జయంతిల నేతృత్వంలో ఈ హాస్పిటల్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషమని అన్నారు. వారి యొక్క సేవలు పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని తెలిపారు. అనంతరం హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ శ్రీనివాసులు, జయంతిలు మాట్లాడుతూ కార్పొరేట్ తరహా వైద్యాన్ని ప్రజలకు అందుబాటు ధరలో అందిస్తామని తెలిపారు. నెలలో నాలుగు వారాలలో ఒక వారం ఫ్రీగా ఓపీ సేవలు అందిస్తామని చెప్పారు. వీలైనంత మేరకు ఆపరేషన్లు లేకుండా నార్మల్ డెలివరీలు అయ్యే విధంగా చూస్తామని పేర్కొన్నారు. సేవే ధ్యేయంగా, అంచలంచెలుగా మమ్మల్ని ఈ స్థాయికి తీసుకొచ్చిన వనస్థలిపురం వాసులందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అడిషనల్ యస్ పి రామదాస్ తేజవత్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహా యాదవ్, సదాశివుడు, హుడా కాలనీ అధ్యక్షుడు గండ్ల ఆనంద్ రాజ్, యాదవ్, స్వర్ణ మాధవి, శ్రీనివాసు, నెహ్రూనాయక్, వెంకయ్య, సతీష్, సత్యనారాయణ, శ్రీనివాస్ చౌదరి, అమర్జీత్ సింగ్, రమేష్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి ఉత్తమ్‌ను

పరామర్శించిన రాగుల వెంకటేశ్వర్ రెడ్డి





నవతెలంగాణ- వనస్థలిపురం

పితృవియోగం పొందిన భారీ నీటిపారుదల, ఫుడ్ సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని వారి నివాసంలో ఆదివారం రాగుల వెంకటేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ్ సతీమణి ఎమ్మెల్యే పద్మావతి, సోదరులు గౌతమ్ కుమార్, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో డిండి కాంగ్రెస్ అధ్యక్షులు నల్లవెల్లి రాజేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రవణ్ రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
8
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
సోమవారం | అక్టోబర్ 07, 2024 | www.navatelangana.com

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం: మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



నవతెలంగాణ-శామీర్‌పేట

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం శామీర్ పేట మండలం అలియాబాద్ రెవెన్యూ పరిధిలోని ప్రజాయ్ హెూమ్స్‌లో ఉంటూ పోకర్ణ గ్రానైట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేసిన వెంకట్‌రావుకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు గౌస్ పాషా, మన్మథ చారీ, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తల్లి కమలమ్మ చినిపోయారు. దీంతో కాప్రా ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ శ్రీదేవిలను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కమలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. -నవతెలంగాణ,కాప్రా

దసరాకు ఊరికి వెళ్లే హడావిడిలో నిర్లక్ష్యం చేయొద్దు

- దొంగలతో జరభద్రం
- ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి
- ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు తెలియజేయండి
- జవహర్ నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు



నవతెలంగాణ - జవహర్ నగర్

దసరా పండగకు ఊరు వెళ్తున్నామన్నా హడావిడిలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని జవహర్ నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. చదువులు, ఉద్యోగాలంటూ నగరంలో నివసిస్తున్న వారంతా దసరా పండుగకు సొంతఊర్లకు చేరుకుంటారని, ఊరికి వెళ్తున్నామన్నా హడావిడిలో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా తిరిగి వచ్చేసరికి ఇల్లు గుల్ల గాక తప్పదని, దొంగలు తాళం వేసి ఉన్న ఇండ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనం చేసే ప్రమాదం ఉందని జవహర్ నగర్ పోలీసులు ప్రజలను హెచ్చరించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు పలు సూచనలు చేశారు. నగర శివారు ప్రాంత ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. జవహర్ నగర్ ప్రాంతంలో ఎక్కువగా నివసించేది రోజువారి కూలీలేనని, కొన్ని ఏరియాలలో సీసీ కెమెరాలు అందుబాటులో లేవని తెలిపారు. వీలైనంతవరకు మీ బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు డబ్బులు వెంటే తీసుకెళ్లాలని చెప్పారు.

బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలిన్నారు. లేదంటే మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలని తెలిపారు. సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్‌ను ఏర్పాటు చేసుకోవాలని, మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉన్న తాళం అమర్చుకోవడం మంచిదని చెప్పారు. మీ దగ్గరలోని పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని చెప్పారు. మీ వాహనాలకు తప్పనిసరిగా తాళాలు వేయాలని, వీలైతే చక్రాలకు చైన్స్‌తో కూడా లాక్ చేయాలని సూచించారు. నమ్మకమైన వాచ్‌మెన్‌లను మాత్రమే సెక్యూరిటీ గార్డులుగా నియమించుకోవాలన్నారు. మీ ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూసుకువాలన్నారు. మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్తా చెదారం లేకుండా, న్యూస్ పేపర్లు, పాలప్యాకెట్లు వెయ్యవద్దని చెప్పాలన్నారు. మెయిన్ డోర్‌కి తాళం వేసినప్పటికీ అవి కనిపించకుండా కర్టెన్స్‌తో కవర్ చేసి ఇంటి లోపల బయట కొన్ని లైట్లు వేసి ఉంచాలని సూచించారు. మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్లకు మీ ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పడం మంచిదని పేర్కొన్నారు. మీ ఇంటికి వచ్చే, వెళ్లే దారులు, ఇంటిలోపల సీసీ కెమెరాలు అమర్చుకొని డీవీఆర్ కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశంలో ఉంచాలన్నారు. అల్మారా, కబోర్డ్స్‌కు సంబంధించిన తాళాలు కామన్ ఏరియా అయిన చెప్పుల స్టాండ్, పరుపులు, దిండ్ల కింద, అల్మారాపైన, డ్రెస్సింగ్ టేబుల్‌లో, కబోర్డ్స్‌లో ఉంచకుండా మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో ఉంచుకోవాలని చెప్పారు. బంగారు ఆభరణాలు వేసుకొని ఫంక్షన్‌లకు వెళ్లేటప్పుడు తగు జాగ్రతలు తీసుకోవాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో మీరు బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయకూడదని చెప్పారు. కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలను నిర్వహించుకోవాలన్నారు. కాలనీల్లో, వీధుల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపించినా లేదా ఆ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులు సమాచారం అందించాలన్నారు. డయల్ 100కు ఫోన్ చేసి చెప్పిన వెంటనే పోలీసులు తగిన విధంగా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తప్పని సరిగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. ఇలా చేస్తే దొంగతనాలను నియంత్రించవచ్చని తెలిపారు.

తెలంగాణ సాంప్రదాయ పండగ బతుకమ్మ



నవతెలంగాణ-ఘట్కేసర్

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ పండుగను మహిళలు ఘనంగా జరుపుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ అర్చన తెలిపారు. శనివారం వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. అంతకుముందు బంతిపూలు, చామంతి తిరోక్క పూలతో బతుకమ్మను పేర్చారు. అధ్యాపకులు, కళాశాల విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులను ధరించి గౌరమ్మకు పూజలు నిర్వహించారు. బతుకమ్మ పాటలతో విద్యార్థులు ఆడి పాడారు. కార్యక్రమానికి అనురాగ్ యూనివర్సిటీ చైర్మెన్ డా.పల్లా రాజేశ్వరరెడ్డి, సీఈఓ పల్లా నీలిమ, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డా.అర్చన మంత్రి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డా. బాలాజీ ఉట్ల, కన్వీనర్- డా.శిరీష, కో కన్వీనర్- డా.పి.సరిత, అనురాగ్ యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బోనకుర్తి నరేందర్ ప్రథమ వర్ధంతి



నవతెలంగాణ-ఘట్కేసర్ రూరల్

కాంగ్రెస్ నాయకులు, చేనేత విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు బోనకుర్తి నరేందర్ ప్రథమ వర్ధంతిని శనివారం ఘనపురం గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వేముల రాజు గౌడ్ ఆధ్వర్యంలో ఘనపురం చౌరస్తాలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మమత గౌడ్, గోపాల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పరమేష్ గౌడ్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్ గౌడ్, నర్సింహా, మాజీ వార్డు సభ్యులు శంకర్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షులు నానావత్ సురేష్ నాయక్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పైళ్ల లతా రెడ్డి, తదితరులు నరేందర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

అనాధలకు సేవ చేస్తే ఎంతో పుణ్యం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అనాధలకు సేవ చేస్తే ఎంతో పుణ్యమని జగదీశ్వరాచారి అన్నారు. మల్కాజిగిరిలోని ఫ్యూచర్ ఫౌండేషన్ హర్ఫానేజ్, ఎస్ఆర్ వృద్ధాశ్రమంలో శనివారం రాత్రి జగదీశ్వరచారి కుమారుడు విశ్వప్రణయ్ జన్మదినోత్సవం సందర్భంగా 150 మంది పిల్లలకు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనాధలకు సేవ చేయడం ఎంతో పుణ్యమని, తన కొడుకు జన్మదినోత్సవం సందర్భంగా వృద్ధులకు, అనాధలకు అన్నదానం నిర్వహించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ అనాధలకు సేవ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న కార్పొరేటర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని యాదవ్ నగర్, సిద్ధి వినాయక దేవాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దుర్గామాత అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు రావాలని మైనంపల్లికి ఆహ్వానం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలకు రావాలని కాంగ్రెస్ నాయకులు మైనం పల్లి హనుమంతరావును నేరేడ్‌మెట్ డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆహ్వానించారు. వారు జన్‌పల్లిలోని మైనంపల్లి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని శనివారం దర్శించుకున్నారు. అనంతరం నేరేడ్‌మెట్ డివిజన్‌లో జరిగే నవరాత్రి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేరేడ్‌మెట్ డివిజన్ నాయకులు ఎస్ఆర్ ప్రసాద్, చంద్రశేఖర్, కె చెన్నారెడ్డి, యాది పాల్గొన్నారు.



నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలోని చాణక్యపురి కాలనీలో శ్రీ దుర్గమల్లేశ్వర స్వామి ఆలయంలో, బ్యాంక్ కాలనీ, భవానీ నగర్ కాలనీలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పాల్గొని అన్నదానం ప్రారంభించారు. ఆయన వెంట ఎంబీ కృష్ణ యాదవ్, దుర్గమధవి, దయాకర్ రెడ్డి, శ్రీదేవి, నిర్మల, బాబీ, రవియదవ్, మన్నెం తదితరులు ఉన్నారు. -నవతెలంగాణ-కాప్రా

క్రీడలతో ఉన్నత స్థాయికి ఎదగాలి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- తుర్కపల్లి ప్రీమియర్ లీగ్ ప్రారంభం



నవతెలంగాణ-శామీర్ పేట

సమాజంలో గుర్తింపుతో పాటు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శామీర్ పేట మండలంలోని తుర్కపల్లి గ్రామంలో ఆదివారం తుర్కపల్లి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీపీఎల్ సీజన్-2 టోర్నమెంటును ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా పోటీలు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బుద్ధి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ జీడిపల్లి రవీందర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, శామీర్ పేట మండల బిజెపి అధ్యక్షులు కైర యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ యూసుఫ్ బాబా, సీనియర్ నాయకులు డి మైసయ్య, టోర్నమెంట్ నిర్వాహకులు వెంకటేష్, బిక్షపతి, వహబ్, శ్రీకాంత్, ప్రసాద్, సాయి, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రోరైలు మార్గం పొడిగించాలి : ఎంపీ ఈటల

- కేంద్ర ప్రభుత్వం సహకారం అందేలా బాధ్యత తీసుకుంటా

నవతెలంగాణ అల్వాల్

జాతీయ రహదారిలో మెట్రో రైలు సౌకర్యాలు అందించాలని, జూబ్లీ బస్ స్టేషన్ నుండి సుచిత్ర, కొంపల్లి, మేడ్చల్, షామీర్‌పేట, ప్రాంతాల వరకు రైల్ మార్గాన్ని పొడిగించాలని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలలో అత్యధిక ప్రాంతలు అభివృద్ధి చెందుతున్నా ఔటర్ రింగ్ రోడ్డు లోని నార్త్ తెలంగాణ ప్రాంతం మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. నార్త్ తెలంగాణ కొరకు కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందేలా తాను బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ఇక్కడి ప్రజల అవసరాల కొరకు, అత్యధికంగా ఐటీ ఉద్యోగులు ఉన్న ప్రాంతం కావడంతో రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మెట్రో మార్గాన్ని పొడిగింపు కార్యక్రమాన్ని మొదలు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు సంపత్ రెడ్డి, ఎస్. మల్లారెడ్డి, గిరి వర్ధన్ రెడ్డి. మాణిక్ రెడ్డి. భరత్, సింహారెడ్డి, రాజిరెడ్డి, శేఖర్ యాదవ్, రామ్ కిరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి







- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- జైదుర్గా భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం

నవతెలంగాణ-కాప్రా

దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ పరిధిలోని ఎంఆర్ఆర్ కాలనీలో శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జై దుర్గా భవాని యూత్ అసోసియేషన్ ఆర్గనైజర్ విజయ్ కుమార్, సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండారి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ దన్ పాల్ రెడ్డి, పలు కాలనీల పెద్దలు, సభ్యులు, మహిళలు పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం భారీగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నేమూరు మహేష్ గౌడ్, నాయకులు, జై దుర్గ భవాని యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

లలిత త్రిపుర సుందరీ దేవి అలంకారంలో అమ్మవారు





నవతెలంగాణ-ఘట్కేసర్ రూరల్

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎదులాబాద్ రైలు గూడెంలో ఏర్పాటు చేసిన అమ్మవారు ఆదివారం లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమించ్చింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం కొండల విద్యాసాగర్ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బింగి రాజేందర్ గౌడ్, అరవింద్ రెడ్డి, యుగేందర్ గౌడ్, పూల మహేష్ శ్రీకాంత్ మేకల భార్గవ్ బత్తిని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

- అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు
- అంబేద్కర్ నగర్, చెన్నాపురంలో అన్నదాన కార్యక్రమం



నవతెలంగాణ-జవహర్ నగర్

దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు ఆదివారం అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారు రోజుకో రూపంలో తొమ్మిది రూపాలలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. హిందూ సోదరులు ప్రతి ఒక్కరూ దైవచింతనతో, సంస్కృతి, సాంప్రదాయమైన పద్ధతిలో పండుగలను భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకుంటారు.

ప్రజలు ఆకలితో అలమటించకుండా చల్లగా చూడు తల్లి..

-మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్

ప్రజలు ఆకలితో అలమటించకుండా చల్లగా చూడు తల్లి అని కోరుకున్నట్టు జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ తెలిపారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అంబేద్కర్ నగర్ లో అబ్బగోని రాజ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బల్లి శ్రీనివాస్ గుప్తా, ఆర్ కే బాబు, శ్రవణ్ కుమార్, భవాని శంకర్, పొలాస కిరణ్ కుమార్, అనిల్ కుమార్, ప్రసాద్, బల్లి శ్రీధర్, మెండే నరేష్, రాజేష్, నాగరాజు, నరేందర్, అంజి, రాజేష్ గోపాల్, జడల బాలకృష్ణ, అమ్మవారి మాల ధారణ చేసిన భక్తులు. కాలనీవాసులు అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

-మల్లెపూల శ్రీకాంత్ యాదవ్

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని చెన్నాపురంలో కొమ్మురాజుల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లపు రవి, నాయకులు బింగి సతీష్ గౌడ్, ఉపేందర్, హరి యాదవ్, కృష్ణ యాదవ్, యాదగిరి, రవి, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర మంత్రులకు వివాహ ఆహ్వానం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కుమార్తె శ్రేయారెడ్డి, ఆదిత్య రెడ్డిల వివాహానికి హాజరు కావాలని కోరుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, పొన్నం ప్రభాకర్‌కు, తుమ్మల నాగేశ్వర్ రావులను ఆదివారం మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డితో కలిసి 27వ తేదీన జరిగే తన కుమార్తె వివాహానికి హాజరు కావాలని మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు.

బతుకమ్మ చీరలు పంపిణీ చేయకపోవడం దారుణం

- బీజేపీ నాగారం మున్సిపాలిటీ కార్యదర్శి జూపల్లి నరేష్



నవతెలంగాణ-కీసర

దసరా పండుగ దగ్గరికి వస్తున్నా ప్రభుత్వం ఆడపడుచులకు బతుకమ్మ చీరలు అందజేయకపోవడం పై నాగారం మున్సిపాలిటీ కార్యదర్శి జూపల్లి నరేష్ ప్రభుత్వంపై మండిపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బతుకమ్మ చీరలు బతుకమ్మ పండుగ పది రోజులు ఉండగానే చీరలు పంపిణీ చేసేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చీరలు పంపిణీ చేయకపోవడంతో ఆడపడుచులు నిరాశ చెందుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను మరిచి హైడ్రా పేరుతో ప్రజలను డైవర్ట్ చేస్తుందన్నారు. గృహలక్ష్మి , పెన్షన్స్ రైతు భరోసా, రైతు బంధు, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి హామీలను మరిచి హైడ్రా పేరుతో పేదలకు ఇబ్బందులకు పెడుతున్నారని, ఆయనకు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఆడపడుచులకు బతుకమ్మ పండుగ అంటే ఎంతో గౌరవం అలాంటిది, ఈసారి చీరలు పంపిణీ చేయకపోవడం దుర్మార్గమన్నారు. రాబోయే బీజేపీ ప్రభుత్వంలో బతుకమ్మ పండుగకు ముందుగానే చీరలు పంపిణీ చేస్తామని తెలిపారు.

లక్ష్మాపూర్‌లో అన్నపూర్ణగా దర్శనమిచ్చిన అమ్మవారు



నవతెలంగాణ-శామీర్‌పేట

మూడు చింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారు ఆదివారం అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చింది. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు వ పూజారి మాధవ శర్మ మంత్రోచ్చారణల మధ్య దేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ప్రతినిధులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిష్ఠగా పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు వితరణ చేస్తున్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజలో పాల్గొని తరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు లగిశెట్టి అరుణ్, తోట ప్రవీణ్, సింగం శ్రీపాల్, సింగం సుజిత్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
సోమవారం | అక్టోబర్ 07, 2024 | www.navatelangana.com

ఆర్టీసీ బస్సుకు ఎదురెళ్లి వ్యక్తి మృతి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఆర్టీసీ బస్సుకు ఎదురెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన ఆదివారం జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... షాపూర్ నగర్‌లో, జీడిమెట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు ఎదురెళ్లి కిందపడి గుర్తు తెలియని వ్యక్తి (35) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని అతడి మృతిపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

నియో స్కిన్ సెంటర్ ప్రారంభోత్సవం

- ముఖ్య అతిథిగా గొట్టిముక్కల పాండురంగ రావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి కార్యవర్గ సభ్యుడు, పట్టభద్రుల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గొట్టిముక్కల పాండురంగ రావు, నియో స్కిన్ వారి నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవం లో భాగంగా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీ ఆర్టిస్ట్ ఈటీవీ ప్రభాకర్, రామ్ నగర్ బన్నీ మూవీ టీం, నియో స్కిన్ క్లినిక్ యాజమాన్యం పాల్గొన్నారు.

మేడ్చల్‌కు మెట్రోను విస్తరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం..



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మేడ్చల్‌కు మెట్రోను విస్తరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకనంద్ అన్నారు. మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో.. జీడిమెట్ల గ్రామంలోని గాంధీ విగ్రహం వద్ద ఆదివారం నిర్వహించిన మహాధర్నా కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బృహత్ ప్రణాళికతో మహానగరాభివృద్ధి...గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నగరానికి నలువైపులా మెట్రో విస్తరణ, ఫ్లైఓవర్లు, అండర్ పాసుల నిర్మాణం వంటి అభివృద్ధి పనులతో పెద్దలు కేసీఆర్ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేసి నగరానికి ఉత్తరం వైపున కొంపల్లి, మేడ్చల్ ప్రాంతాలతో పాటు తూముకుంట, శామీర్‌పేట్ ప్రాంతాలకు మెట్రో విస్తరణ పై సర్వే సంస్థలను ఎంపిక చేసి పనులను అప్పగిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే పక్కన పెట్టి ఫోర్త్ సిటీ పేరుతో ఊహల నగరానికి మెట్రో విస్తరణను చేపట్టాలని అనుకోవడం కుత్బుల్లాపూర్ ప్రజలను అవమానించడమే అన్నారు.

ఫోర్త్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపి ముఖ్యమంత్రి ఇన్ సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడుతున్నారు. ఫోర్త్ సిటీ పేరుతో తన ఊహల నగరంగా సృష్టించి లేని నగరానికి మెట్రో విస్తరణ పేరుతో రూ 8 వేల కోట్ల ప్రతిపాదించడం వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపార ఆలోచన తప్పా ప్రజలకు ఎటువంటి మేలు జరగదు. ఫోర్త్ సిటీ పేరుతో ముఖ్యమంత్రి ఇన్ సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా సంక్షేమం కోసం ఉండాలే తప్పా స్వార్థ రాజకీయాల కోసం కాదన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా సంక్షేమం కోసం ఉండాలే తప్పా స్వార్థ రాజకీయాల కోసం కాదు. ఫోర్త్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ భూములను పోగు చేసి వ్యాపారం చేస్తూ తమ స్వార్థ రాజకీయాల కోసం కుత్బుల్లాపూర్, మేడ్చల్ ప్రజలను విస్మరిస్తున్నారు. ముఖ్యమంత్రి తన అనుభవరాహిత్యం, అసంబద్ధ నిర్ణయాలతో కోర్టులతో నిత్యం మొట్టి కాయలే... చెరువుల పరిరక్షణ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి ఏర్పాటుచేసిన హైడ్రా, మూసి సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లు కూల్చివేత, ఫోర్త్ సిటీ పేరుతో ఊహల నగరానికి నిధుల కేటాయింపు వంటి నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నిర్ణయాల వెనుక ముఖ్యమంత్రి అనుభవ రాహిత్యం, అవగాహన లేమి స్పష్టంగా కనపడుతుంది. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రతినిత్యం కోర్టులు మొట్టికాయలు వేస్తూనే ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మేడ్చల్‌కు మెట్రోను ప్రతిపాదిస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సర్వే సంస్థలకు పనులు అప్ప చెప్పడం, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడంతో మేడ్చల్ మెట్రో పనులను విస్మరించడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం.. మాకు న్యాయబద్ధంగా రావాల్సిన మేడ్చల్ మెట్రోను సాధించి తీరుతాం.. మేడ్చల్ కు మెట్రోను విస్తరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం..

ఉత్తర తెలంగాణకు నగరానికి కనెక్టివిటీగా ఉన్న జాతీయ రహదారి 44 లో మేడ్చల్ ప్రాంతం గుండా నిత్యం నిజామాబాద్, కరీంనగర్, ప్రాంతాలకు మంత్రులు ప్రయాణిస్తూ ఉంటారు. మేడ్చల్ కు మెట్రోను విస్తరించకుంటే ఈ మార్గంలో ఏ ఒక్క మంత్రిని కూడా తిరగనివ్వం. అడ్డుకొని తీరుతామన్నారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ మెట్రో సాధన సమితి కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొంపల్లి మున్సిపల్ చైర్మెన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాకు కావాలి మెట్రో - వీ డిమాండ్ మేడ్చల్ మెట్రో : ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జీడిమెట్ల గ్రామం గాంధీ విగ్రహం వద్ద మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో.. నిర్వహించిన మహాధర్నా కార్యక్రమానికి బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి. పాల్గొన్నారు. పారడైజ్ సుచిత్ర, మేడ్చల్ వరకు మెట్రో కావాలని.. మాకు కావాలి మెట్రో వీ డిమాండ్ మేడ్చల్ మెట్రో అనే నినాదంతో కార్యక్రమాన్ని హోరెత్తించారు. మెట్రో సాధనకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.ఎస్ మల్లారెడ్డి, మెట్రో సాధన సమితి సభ్యులు సంపత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, మైపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాణిక్ రెడ్డి, రాజి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పెయిడ్ పార్కింగ్ షురూ..



- నాగోల్, మియాపూర్ మెట్రో పార్కింగ్‌ల వద్ద

నామమాత్రపు చార్జీలు

నవతెలంగాణ -సిటీబ్యూరో

కొన్నేండ్లుగా ఉచిత పార్కింగ్ కొనసాగిన నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్ల వద్ద గల పార్కింగ్‌లో ఆదివారం నుంచి పెయిడ్ పార్కింగ్ షురూ అయ్యింది. ఈ రెండు స్టేషన్లలో పెయిడ్ పార్కింగ్ అమలు చేస్తామని ఆగస్టులో ప్రకటించిన ఎల్‌అండ్‌టీ యాజమాన్యం గతంలో రెండు సార్లు వాయిదా వేసింది. బ్లూ కారిడార్‌లోని నాగోల్, రెడ్ కారిడార్‌లోని మియాపూర్ మెట్రో స్టేషన్లలో నామమాత్రపు పార్కింగ్ ఛార్జీలు ఈ నెల 6వ తేదీ నుంచి వసూలు చేస్తున్నట్టు ఎల్‌అండ్‌టీ మెట్రో అధికారులు గత నెల 30వ తేదీన ప్రకటించిన విషయం తెలిసిందే.

పలుమార్లు వాయిదా.. ఆదివారం నుంచి అమలు..

అయితే గత ఆగస్టు 14వ తేదీ నుంచి ఛార్జీలు వసూలు చేస్తామని ప్రకటించగానే ప్రయాణికులు, సీపీఐ(ఎం) పార్టీ, డీవైఎఫ్, పీవైఎల్, ఏఐఎస్ఎఫ్ తదితర యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. దీంతో ఎల్‌అండ్‌టీ మెట్రో యాజమాన్యం ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకుంది. అనంతరం కొన్ని రోజుల తర్వాత సెప్టెంబర్ 16వ తేదీ నుంచి ఛార్జీలు వసూలు చేయనున్నట్టు బోర్డులను ఏర్పాటు చేశారు. కానీ ఆ నిర్ణయాన్ని అమలు చేయలేదు. అప్పటి నుంచి నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్ల వద్ద గల పార్కింగ్‌లో ఎల్‌అండ్‌టీ పలు అభివృద్ధి పనులను చేపట్టింది. కాగా ఆదివారం ఎల్‌అండ్‌టీ అధికారులు పెయిడ్ పార్కింగ్‌ను అమలు చేశారు. దీంతో ప్రయాణికులు ఆ సంస్థ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. నామమాత్రపు ఛార్జీల పేరిట ప్రారంభించి హైదరాబాద్ మెట్రో రైల్ కంటే ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తారని పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీంతో తమకు అదనపు భారమని విమర్శిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఎల్‌అండ్‌టీ అధికారులు ఈ పెయిడ్ పార్కింగ్‌ను అమలు చేశారని ఆరోపిస్తున్నారు. అయితే ఈ రెండు మెట్రో స్టేషన్ల వద్ద ప్రతిరోజూ ప్రయాణికులు వెయ్యికి పైగా వాహనాలను పార్కింగ్ చేసి హైటెక్ సిటీ, రాయదుర్గం, తదితర ప్రాంతాలకు మెట్రో ద్వారా ప్రయాణిస్తున్నారు.

పార్కింగ్ స్థలాల్లో ప్రయాణికులకు వసతులు

బైకులు, కార్లకు ప్రత్యేక పార్కింగ్, 24 గంటలూ సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేశామని ఎల్‌అండ్‌టీ అధికారులు చెబుతున్నారు. ప్రయాణికుల కోసం బయో టాయిలెట్లు, మహిళలు, సీనియర్ సిటిజన్లు, వికలాంగుల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశామనీ, అందుకే మియాపూర్, నాగోల్‌లో నామమాత్రపు చార్జీలను అమలు చేస్తున్నట్టు చెబుతున్నారు. అయితే ఎల్‌అండ్‌టీ మెట్రో పార్కింగ్ ఫీజు రెండు గంటలకు రూ.10, కారుకు రూ.30 ఉండగా.. 4-12 గంటలకు బైక్‌కు రూ.25, కారుకు రూ.75 చొప్పున వసూలు చేస్తున్నారు.



కుత్బుల్లాపూర్ మండలం మహాసభ జయప్రదం





- సీపీఐ(ఎం)నూతన కార్యదర్శిగా కీలుకాని లక్ష్మణ్ ఎన్నిక..

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ మండల మహాసభలు కమలాకర్ రెడ్డి ప్రాంగణం షాపూర్ నగర్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గం॥ పార్టీ జెండాను సీనియర్ నాయకులు వరప్రసాద్ ఆవిష్కరించి, మహాసభను ప్రారంభించారు. జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో ఉన్న బీజేపీ నరేంద్ర మోడీ సంకీర్ణ ప్రభుత్వం రోజురోజుకు నిత్యవసర సరుకుల ధరలు పెంచుతూ.. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలపై నియంత్రణ లేకుండా పేదలపై భారాలను మోపుతుందన్నారు. వరద సహాయక చర్యల్లో ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను చిన్నచూపు చూపుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలకు అధిక మొత్తంలో నిధులు మంజూరు చేస్తూ.. అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు.

ఉదాహరణకు తెలంగాణ కేరళ వరద సహాయక నిధుల విడుదలలో తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ పేరుతోటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా, పేదల ఇండ్లు కూల్చడం అమానుషమని పేర్కొన్నారు. హైడ్రా పేరు తోటి పేదలను అన్యాయం చేస్తే సీపీఐ(ఎం) చూస్తూ ఊరుకోదని, పేదల పక్షాన నిలబడి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని హెచ్చరించారు. గతంలో వేల ఎకరాల ప్రభుత్వ భూముల్ని ఆక్రమించిన వాళ్ల దగ్గర నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, పేదలకు పంచాలని అన్నారు. అనంతరం పార్టీ మండల మహాసభకు 40 మంది ప్రతినిధులు హాజరయ్యారు. చర్చలలో పాల్గొని పార్టీని, కుత్బుల్లాపూర్ ప్రాంతంలో విస్తరించాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. అనంతరం పార్టీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల కార్యదర్శిగా కీలుకాని లక్ష్మణ్, మండల కమిటీ సభ్యులుగా పసుల. అంజయ్య, బి.సత్యం, రావుల స్వాతి, ఈ దేవదానం, డి.కరుణాకర్, ఎండి జాకీర్ హుస్సేన్ ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.అశోక్, కే.హరిప్రసాద్, జి.వెంకన్న, కే.బీరప్ప, ఆంజనేయులు, కె .మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ప్రత్యేక పూజలలో మేయర్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 14వ డివిజన్ పరిధిలోని ఆచారికుంట చెరువు వద్ద సాయి బృందావనం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన.. దేవీ నవరాత్రులు ఉత్సవ వేడుకలలో భాగంగా ఆదివారం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె కార్పొరేటర్ రాజేశ్వరి చౌదరి, మహిళా నాయకురాలు సబిత జలంధర్ రెడ్డిలతో కలిసి దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మేయర్ ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షుడు బొబ్బ శ్రీనివాస్, సాయి బృందావనం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు, ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ దేవీ శరన్నవరాత్రోత్సవాలు





నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

శ్రీ దేవీ శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని బాలాజీనగర్, మూసాపేట్ డివిజన్ల పరిధిలోని పలు అమ్మవార్ల ఆలయాలను, మండపాలను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సందర్శించి శ్రీ దుర్గా భవాని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, తూము శ్రావణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు సిహెచ్ ప్రభాకర్ గౌడ్, అంబటి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూసాపేట్ లోని కేపీయం గ్రౌండ్ వద్ద, అంబేద్కర్ నగర్, జనతా నగర్, ఆంజనేయ నగర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన దుర్గా మాత అమ్మవార్లను, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు , మాజీ కార్పోరేటర్లు తూము శ్రావణ్ కుమార్, పగడాల బాబు రావులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ , డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్,బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, కర్క రవీందర్,తుకారాం, తూము మనోజ్, రవి సింగ్, ఈశ్వర్,పి.శివ, కృష్ణ ముదిరాజ్, మంగమ్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

వివాహ ఆహ్వాన పత్రిక



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మల్కాజిగిరి ఎమ్మెల్యే ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి కూతురు పెళ్లి సందర్భంగా.. వివాహ ఆహ్వాన పత్రికను, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకి, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అందజేశారు. తన కుమార్తె వివాహానికి హాజరుకావాలని ఎమ్మెల్యేని, మర్రి రాజశేఖర రెడ్డి కోరారు.

సేవలు అందించడంలో రాందేవ్ రావు హాస్పిటల్ ముందంజం..

- కూకట్ పల్లి ఏసీపీ శ్రీనివాసరావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సమాజంలోని అన్ని వర్గాలకు తమ సేవలను అందించడంలో రాందేవ్ రావు హాస్పిటల్ ముందుండడం అభినందనీయమని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లిలోని రాందేవ్ రావు ఆస్పత్రిలో బాలనగర్ డివిజన్‌లోని పన్నెండు పోలీసు స్టేషన్‌లో పోలీసు సిబ్బందికి యాన్యువల్ హెల్త్ చెకప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో అల్లాపూర్, సనత్ నగర్, బాలానగర్, కూకట్‌పల్లి, కె.పి.హెచ్.బి, జీడిమెట్ల, బాచుపల్లి, జగద్గిరిగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కూకట్‌పల్లి, జీడిమెట్ల, కేపీహెచ్‌బీ, బాలానగర్ స్టేషన్లలోని ఏసీపీ క్యాడర్ మొదలుకొని కానిస్టేబుల్స్ వరకు ఉన్న అన్ని విభాగాల వారికి సిబిపి, సీయూఈ, ఎఫ్‌బిఎస్, పిఎల్‌బిఎస్, హెచ్‌బిఏ 1సి, టి3, టీ4, టీ ఎస్ హెచ్, ఎల్ఆఫ్‌టీ, లిపిడ్ ప్రొఫైల్, ఆర్ఎఫ్‌టీ, యుఎస్‌జి అబ్డొమెన్, పాప్ స్మియర్ ఫర్ ఫీమేల్, పాప్ సమీర్ ఫర్ మేల్స్, డయాబెటిక్ న్యూరోపతి, బిఎంఐ, ఈసిజీ, చెస్ట్ ఎక్రే, 2డి ఎకో, ఫైబ్రో స్కాన్, బయో తీసియో మీటర్, కంటి పరీక్షలు, బోన్ మినరల్ డెన్సిటీ, బిఎంఐ, న్యూట్రిషనల్ అసెస్మెంట్ వంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక్కొక్కరికి రూ.17,000 ల విలువ చేసే పరీక్షలు ఉచితంగా 550 మంది పోలీసు సిబ్బందికి నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినందుకు రాందేవ్ రావ్ హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ ని శాలువా, పుష్పగుచ్చాలతో సన్మానించారు. హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ మాట్లాడుతూ సమాజం యొక్క భద్రతకై పోలీసు శాఖ వారు అహర్నిశలు శ్రమిస్తారని, అటువంటి పోలీసు శాఖ వారి ఆరోగ్య భద్రత కోసమై ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలకు తమ సేవలను అందించడంలో రాందేవ్ రావు హాస్పిటల్ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. హాస్పిటల్ సీఈవో డాక్టర్ యోబు మాట్లాడుతూ కరోనా సమయంలో పోలీసు శాఖ వారు ఈ సమాజానికి చేసిన సేవ చిరస్మరణీయమనీ, సమాజంలోని ఏ పౌరునికి ఎటువంటి కష్టం వచ్చినా మొదటిగా సంప్రదించేది పోలీస్ శాఖ వారినే అని, సమస్యను పరిష్కరించడంలో ఎన్ని అవాంతరాలు కష్టనష్టాలు ఎదురైనా కూడా సమస్యను పరిష్కరించడమే తమ అంతి మధ్యయంగా పోరాడే అంత గొప్ప పోలీసు శాఖ వారికి ఈ రోజున ఈ మెగా వైద్య శిబిరం నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేయడం అనేది ఎంతో ఆనందాన్ని కలుగజేసే విషయం అని పేర్కొన్నారు. ఇటువంటి గొప్ప అవకాశాన్ని రాందేవ్ రావ్ హాస్పటల్ కు ఇచ్చినందుకు కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావుకీ, బాలానగర్ ఏసీపీ హనుమంతరావుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఏసీబీ హనుమంతరావు ఈ మెగా వైద్య శిబిరం పర్యవేక్షించి సమాజానికి ఇంత మంచి ఆరోగ్య సేవలను అందిస్తున్న రాందేవ్ రావు హాస్పిటల్‌ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కె.ముత్తు, కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ రావు, అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ కే. క్రాంతి కుమార్, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ జి.మల్లేష్, బాలానగర్‌ఇన్‌స్పెక్టర్ పి. నవీన్ కుమార్, సనత్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఉదయం 6 గంటలకు రాందేవ్ హాస్పిటల్లో ప్రారంభమైన ఈ వైద్య శిబిరంలో రాందేవ్ రావ్ హాస్పటల్ కన్సల్టెంట్ డాక్టర్స్ డ్యూటీ డాక్టర్స్ నర్సులు, అడ్మిన్ మేనేజర్స్ అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం ఉదయం 6 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు నిరంతరాయంగా జరిగింది. సాయంత్రం 6గంటలకు డీసీపీ సురేష్, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ చేతుల మీదగా ఈ వైద్య శిబిరాన్ని ముగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి ఎంతగానో ఉపయోగపడే ఇటువంటి వైద్య శిబిరాన్ని రాందేవ్ రావు హాస్పిటల్ యాజమాన్యం నిర్వహించడం ఎంతగానో స్ఫూర్తిదాయకమని వారు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ మెగా వైద్య శిబిరం రాందేవ్ రావ్ హాస్పిటల్లో నిర్వహించడం ఎంతో ఆనందాన్ని కలుగజేసే విషయమని హాస్పిటల్ యాజమాన్యమైన విక్రమ్ దేవ్ రావ్, మీరా రావు, అపర్ణ రావు, ప్రశాంత్ రెడ్డి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, సీఈవో డాక్టర్ యోబు, డ్యూటీ డాక్టర్స్ డాక్టర్ జుబైర్, డాక్టర్ అలీ, డాక్టర్ అనూష, డాక్టర్ మణి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ రేవతి, ద్వారక, సునీత, జ్యోతి అనుష, శోభ పాల్గొన్నారు.

దేవాదాయ శాఖలో పదోన్నతులపై హర్షం..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

దేవాదాయ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న 32 మంది జూనియర్ అసిస్టెంట్లకు కార్యనిర్వాహక అధికారులు (ఈవో)లుగా పదోన్నతులు కల్పించడంపై దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగ సంఘాల జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతున్నాయని జేఏసీ చైర్మెన్ గంగు ఉపేంద్రశర్మ, కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచారి, అర్చకుల సంఘం అధ్యక్షుడు చింతపట్ల బద్రీనాథ్ ఆచార్యులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు అగ్నిహోత్ర చంద్రశేఖరశర్మ, బి. రామ్మోహన్ రావులు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు, కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నపూర్ణ దేవి అలంకరణలో కనకాల కట్ట మైసమ్మ



నవతెలంగాణ-ముషీరాబాద్

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం శ్రీ కనకాల కట్ట మైసమ్మ అన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మెన్ గౌతమ్ కుమార్, కార్యనిర్వహక అధికారి సాంబశివరావు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

కామ్రేడ్ సీతారాం ఏచూరి అందరికీ మార్గదర్శి..

- సౌత్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎల్.కోటయ్య
- సీపీఐ(ఎం) కిషన్ గంజ్-ఫిల్ ఖాన శాఖ మహాసభలో ఏచూరికి నివాళులర్పించిన నేతలు
- శాఖ నూతన కార్యదర్శిగా ఎన్.శ్రీ రాములు ఎన్నిక





నవతెలంగాణ-ధూల్ పేట్

కామ్రేడ్ సీతారాం ఏచూరి అందరికీ మార్గదర్శి అని సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎల్.కోటయ్య అన్నారు. సీపీఐ(ఎం) కిషన్ గంజ్ - ఫిల్ ఖాన శాఖ 4వ మహాసభ స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన పార్టీ నాయకులతో కలిసి ఈ మహాసభల ప్రారంభ సూచికంగా జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం ఇటీవల మరణించిన కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండి ప్రజా సమస్యలపై ఉద్యమ మార్గమమే జీవిత ఆశయంగా నడుచుకున్న మహోన్నత నేత పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి అని ఆయనను స్మరించుకున్నారు. పార్టీ జాతీయ రాజకీయాలలో సమాఖ్య స్ఫూర్తిని కాపాడడం లో లౌకిక రాజ్యాంగ విలువలు కాపాడడంలో కార్మికుల హక్కుల పరిరక్షణకు ఏచూరి కృషి మరువలేనిదని పేర్కొన్నారు. అనంతరం హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ పలు తీర్మానాన్ని ఆమోదించారు. గత కార్యకలపాలను సమీక్షించి స్థానికంగా సీపీఐ(ఎం) పార్టీ విస్తరణకు భవిష్యత్ ప్రణాళికను చర్చించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) గోషామహల్ జోన్ నాయ కులు కే.జంగయ్య, శాఖ సభ్యులు జి. సవప్పా, ఎన్.శ్రీ రాములు సి.హన్మంతు, భూగ్గప్ప, రాజు తిమ్మయ్య, భీమయ్య, పి.మోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన శాఖ కార్యదర్శిగా నెమ్మాది శ్రీ రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'నెల గడిచినా కులగణన ఎందుకు ప్రారంభించలేదు'

- కులగణన విషయంలో కాంగ్రెస్ పార్టీ మాటలు తప్ప చేతలేవి
- కులగణన విషయంలో కాంగ్రెస్ మాట తప్పితే తగిన గుణపాఠం చెపుతాం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నాన్చివేత ధోరణి అవలంభిస్తుందని, అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి నుండి మొదలు కొంటే మంత్రుల వరకు అదిగో కులగణన ఇదిగో కులగణన చేస్తామంటూ మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప అమలుకు నోచు కోవడం లేదని, ఇదే వైఖరి కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తే రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ పాలన చివరి పాలన కాబో తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మెన్ కుందారం గణేష్ చారి, కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో జాజు ల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. డిసెంబర్ 7న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అక్టోబర్ 7వ తేదీ నాటికి పది నెలల పాలన కొనసాగిం చిందన్నారు. గత పది నెలలుగా ప్రతిరోజు త్వరలోనే కులగణన చేపడతామని, బీసీలను మభ్యపెట్టి బీసీలలో వస్తున్న చైతన్యం, ఉద్యమాలను నీరుగార్చడానికి ప్రయత్ని స్తుందని ఆరోపించారు. గత నెల సెప్టెంబర్ 6న రాష్ట్ర బీసీ కమిషన్ ఏర్పాటు చేసిందని, బీసీ కమిషన్ ఏర్పాటు చేసి నేటికి నెల రోజులు పూర్తయిందని, గత నెల రోజులుగా బీసీ కమిషన్ సమగ్ర కులగణనను చేపట్టడాని కి రాష్ట్ర ప్రభుత్వం నుండి టీటీఓఆర్ అరుణ్ సాఫ్ట్ రిఫ రెన్స్ పర్మిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గత నెల రోజులు గా బీసీ కమిషన్ ఖాళీగా ఉన్న సమయాన్ని ఎందుకు వృథా చేస్తుందని ఆయన ప్రశ్నించారు. సమగ్ర కులగణ న చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఏడు సార్లు ప్రకటించారని, సీఎం ఎ.రేవంత్ రెడ్డి గాంధీ భవన్ లో ప్రకటించారని, బీసీ కమిషన్ పదవి బాధ్యతలు తీసుకున్న రోజున మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి త్వరలోనే కులగణన చేస్తామని ప్రకటించారని, చివరిగా పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నాలుగైదు రోజుల్లోనే కులగణనకు మార్గదర్శకాలు విడుదలవుతున్నా యని ప్రకటించినప్పటికి కులగణనకు నేటి వరకు ఒక్క అడుగు ముందుకు పడకపోవడం అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కులగణన చేస్తామని ఒక వైపు రాహుల్ గాంధీ దేశమంతా ప్రకటిస్తూ తెలంగాణలో కులగణన జరగకపోతే ఎందుకు పార్టీని, ప్రభుత్వాన్ని ఆదేశించడం లేదని ఆయన ప్రశ్నించారు.రాహుల్ గాంధీ మాటలకు తప్ప అమలు లేదని ఆయన ఎద్దేవా చేశారు. రెండు, మూడు రోజుల్లో అన్ని కుల సంఘాలు, బీసీ సంఘాల మేధావులతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్య త్ కార్యాచరణ ఏమిటనేది చర్చించి ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సం చార జాతుల సంఘం అధ్యక్షులు కోలా శ్రీనివాస్, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలకృష్ణ నాయి, బీసీ ఏ కులాల అధ్యక్షులు ఎం.ఎస్.నరహరి, కల్లుగీత సంఘా ల సమన్వయ కమిటీ అధ్యక్షులు ఐయిలీ వెంకన్న గౌడ్, జాజుల లింగం గౌడ్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు కంటే రామచందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతి, సాంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

- చైతన్య హబ్ జూనియర్ కళాశాల చైర్మెన్ వి.వి.హనుమంతరావు
- కళాశాలలో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలపై విద్యార్థులు, యువతకు అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని చైతన్య హబ్ జూనియర్ కళాశాల చైర్మెన్ వి.వి.హనుమంతరావు అన్నారు. ఆదివారం హిమాయత్ నగర్ లోని కళాశాల బ్రాంచీలో బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాలు ధరించి రంగు రంగుల తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడి, పాడి ఆటపాటలతో దాండియా నృత్యాలతో కనువిందు చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ హనుమంతరావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేక వేడుకన్నారు. తెలంగాణ ప్రాంత సంస్కృతికి ప్రతిబింబంగా బతుకమ్మ పండుగ అని చెప్పారు. బతుకమ్మ వేడుకల సందర్భంగా బతుకమ్మ విశిష్టతను కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు వివరిస్తూ తెలంగాణలో పకృతిని, పువ్వులను దేవతలుగా భావిస్తూ బతుకమ్మ సంబరాలు నిర్వహించుకోవడం, తెలంగాణ సంస్కృతిలో ఒక భాగమని, ఈ వేడుకలు ప్రపంచంలో మరెక్కడ జరుపుకోరని, ఇది కేవలం తెలంగాణ ఆడపడుచులకు దక్కిన విశిష్ట గౌరవమని సందర్భంగా కళాశాల యజమాన్యం మహిళా అధ్యాపకులను, విద్యార్థులను అభినందించి, బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌ఘడ్ మారణకాండను ఖండించండి

సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ

నవతెలంగాణ-ముషీరాబాద్

చత్తీస్‌ఘడ్ దంతెవాడ తులతులి అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ పేరుతో 31మంది సీపీఐ మావోయిస్టు పార్టీ వారిని చంపడాన్ని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తీవ్రంగా ఖండిస్తుందిని రాష్ట్ర కార్యదర్శి పి. సూర్యం అన్నారు. ఈ మేరకు విద్యానగర్‌లోని మార్ఫు భవన్ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా పి.సూర్యం మాట్లాడుతూ ఘటన జరిగి 24 గంటలకు గడుస్తున్నా మృతుల ఫోటోలను, వివరాలను పోలీసులు ప్రకటించకపోవడం చట్ట విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో భాగంగా పక్క సమాచారంతో ఈ చర్యకు పాల్పడినట్టు స్పష్టమవుతుంది. ఇప్పటికే 180 మందిని ఇలానే కేంద్ర, రాష్ట్రలు హత్య చేశాయి. కేంద్ర ప్రభుత్వం గత 11 ఏండ్ల పాలనలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు కట్ట బెడుతుంది. ఛత్తీస్‌గడ్ అడవుల్లో ఉన్న అపరమైన సహజ ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర దీనిలో దాగి ఉందన్నారు. అందులో భాగంగానే ఎంతటి మారణ కాండకైనా తెగబడుతుంది. ఈ వరుస ఎన్‌కౌంటర్‌లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచేత న్యాయ విచరణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ దారుణమైన మారణకాండను దేశ సహజ సంపదను కాపాడే నిజమైన దేశభక్తులు, ప్రజలు ప్రజా స్వామ్యవాదులు అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని కోరారు.

దసరా సమ్మేళనానికి రావాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఆహ్వానం



నవతెలంగాణ-అంబర్‌పేట:

దేవి శరన్నవరాత్రులు నవరాత్రులు ఉత్సవాలలో భాగంగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని అంబర్‌పేట దేవస్థానం సేవా సమితి సభ్యులు ప్రతినిధులు కలిసి దసరా సమ్మేళనానికి రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట దేవస్థానం సేవా సమితి చైర్మెన్ పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, గడ్డం లక్ష్మణ్ గౌడ్, కె దుర్గాప్రసాద్ రెడ్డి,అధ్యక్షులు వై శంకర్ గౌడ్, సభ్యులు రంగంపల్లి రాజు, పంజాల గిరిధర్ గౌడ్, బింది మల్లికార్జున్ గౌడ్, దోమకొండ కిషోర్, కంచె చంద్రశేఖర్ చింతల శ్రీనివాస్ ముదిరాజ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'రివ్యూ పిటిషన్లను డిస్మిస్ చేయడం వెనుక మోడీ హస్తం'



- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వల్లమూరి కృష్ణ స్వరూప్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్‌లపై వేసిన రివ్యూ పిటిషన్లను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ డిస్మిస్‌చేయడం వెనుక ప్రధాని నరేంద్రమోడీ, మాజీ చీఫ్ జస్టిస్ ఎన్.వి.రమణల హస్తం ఉందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మెన్ వల్లమూరి కృష్ణ స్వరూప్ ఆరోపించారు. ఆదివారం హిమాయత్ నగర్ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనువాద పాలకుల విధానాన్ని సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా ప్రకటిస్తున్నారన్నారు. రాజ్యాంగ వ్యతిరేకంగా సుప్రీం కోర్టు తీర్పులు ఇవ్వడం జాతీయ జ్యూడిషియల్, స్వతంత్ర వ్యవస్థలను కలుషితం చేయడమేనన్నారు. ఈ తీర్పుతో మెజార్టీ దళిత సమాజం ప్రధానంగా మాల, బేగరి, నేతకానీ, దాసరి, మహార్ వంటి తదితర కులాలు ఆందోళన చెందవద్దని, రాజ్యాంగ పరమైన వెసులుబాటు కురేటివ్ పిటిషన్ దాఖలు వంటి అవకాశం ఉందన్నారు. ప్రధాని మోడీ, సీఎంలు ఎ.రేవంత్ రెడ్డి, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రభుత్వాలపై ప్రజా ఉద్యమం చేయవలసిన అవసరం ఉందన్నారు. తిరుగు బాటుకు సిద్ధం కాకపోతే బడుగు బలహీన వర్గాలకు భవిష్యత్ లేదన్నారు. డిసెంబర్ రెండో వారంలో దళితుల తిరుగుబాటు పేరుతో 'వర్గీకరణ వద్దు.. రాజ్యాధికారం ముద్దు' అనే నినాదంతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, జిల్లా స్థాయిల్లో నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ వి.ఎల్.రాజు, రాష్ట్రశాఖ అధ్యక్షులు జె.ఎస్.రావు, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు సిహెచ్.రోజా లీలా, పార్టీ గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు, ఆర్పిఐ రాష్ట్ర అధ్యక్షులు ఎ.అశోక్, వంచిత్ బహుజన్ అఘాడి రాష్ట్ర కార్యదర్శి తీగల శేఖర్, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ, తెలంగాణ బేగరి సంక్షేమ సంఘం అధ్యక్షులు వి.సుచంద్ర, దర్జీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పెండ్యాల సునీల్ చంద్రరావు, ఆదివాసీ హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ కొర్రా హరీష్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కార్డులు అందించాలి

- టీజీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ. కోటయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ఆసరా పెన్షన్‌తో పాటు ఆరోగ్య భద్రత కార్డులు అందించాలని టీజీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ.కోటయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనందం అధ్యక్షతన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ కోటయ్య హాజరై మాట్లాడుతూ విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులకు ఎటువంటి సదుపాయాలు లేవన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పెన్షన్ సదుపాయం లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్‌తో పాటు ఆహార భద్రత కార్డులను అందించాలని కోరారు. మా సంఘానికి సమావేశాలు నిర్వహించుకునేందుకు 1000 గజాల స్థలం కేటాయించి సూపర్ లగ్జరీ బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం ఈ సమావేశంలో నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కే బుచ్చిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పిఎల్ ఎన్ రావు, అయ్యన్న గౌడ్, యాదగిరి, నాయకులు రాజయ్య ,సిద్దిక్ ,హుస్సేన్, రామచందర్ నరసింహ సత్య నారాయణ చారి, ఇతర రాష్ట్రాల నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతిరూపం దసరా ఉత్సవాలు



నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ సంప్రదాయాలకు ప్రతిరూపం దసరా ఉత్సవాలు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ప్రముఖ హైకోర్టు న్యాయవాది రాంపల్లి ప్రభు లింగం అన్నారు. దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం బాగ్ అంబర్‌పేట బతుకమ్మ కుంట మైసమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ప్రముఖ హైకోర్టు న్యాయవాది రాంపల్లి ప్రభులింగం, ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రేమ్ కుమార్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ కోట్ల శివకుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు అశోక్ రావు, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ నాథ్ యాదవ్



నవతెలంగాణ-నాగోల్

పేదల ఆరోగ్యాల కోసం స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సక్రమంగా వినియోగించుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. ఆదివారం నాగోల్ డివిజన్ లోని సౌంత్ అండ్ పార్క్ కమ్యూనిటీ హాల్‌లో టి.రవికుమార్ (జనరల్ సెక్రటరీ) ఆధ్వర్యంలో నిర్వహించిన లేనస్ డయాగ్నొస్టిక్స్ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, ఉచిత మందుల పంపిణీ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని తమ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కోసం ఉచిత వైద్య శిబిరాల నిర్వహించి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందిలను పంపిణీ చేయడం పట్ల ఆయన నిర్వాహకులను అభినందించారు. ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరు శిబిరంలో వైద్యులు ఇచ్చిన సూచనలను సలహాలను తీసుకొని తమ వైద్య పరీక్షలు నిర్వహించుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలని కోరారు. ఉచిత వైద్య శిబిరంలో డెంటల్ చెకింగ్, ఐ చెకింగ్, జనరల్ ఫిజీషియన్, ఈసీజీలతో పాటు ఉచిత మందుల పంపిణీ చేయడం జరిగింది. కాలనీ వాసులు అందరూ ఈ మెడికల్ క్యాంప్ నీ ఉపయోగించుకోవాలి అని, మీకు ఎలాంటి సమస్యలు ఉన్న చెక్ చేపించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ అండ్ పార్క్ ప్రెసిడెంట్ రమేష్, వైస్ ప్రెసిడెంట్ ఎంవీఎస్ మూర్తి, జాయింట్ సెక్రటరీ రాజేష్ రావు, ట్రెజరర్ రామకృష్ణ, మరియు హెల్త్ క్యాంప్ డైరెక్టర్ డాక్టర్ అబ్దుల్ గఫూర్, స్నేహ,మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్, నర్సు రేణుకా, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులు, అనాథలకు ప్రథమ చికిత్స, ఔషధాలు పంపిణీ



నవతెలంగాణ-ముషీరాబాద్

హైదరాబాద్ నగరంలో ఫుట్ పాత్ మీద జీవనం సాగిస్తున్న అనాధలు నిరాశ్రయులు సంచార జాతుల వారికి వివిధ రుగ్మతలతో ఇబ్బంది పడుతుండడం గమనించి స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స చేసి ఔషధాలను అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి మొబైల్ వైద్యశాలను ఏర్పాటు చేసి నిరాశ్రయులకు అనాథల కు ఆరోగ్య సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పావని, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

రాతి నిర్మాణాల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మెన్ ప్రొఫెసర్ వేద కుమార్



నవతెలంగాణ-అంబర్‌పేట

ఆదివారం డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ జియో డైవర్సిటీ డే సందర్భంగా 'జియో హెరిటేజ్ ట్రయల్', 'టాక్ ఆన్ జియో డైవర్సిటీ' ని గచ్చిబౌలి సమీపంలోని ఫక్రుద్దీన్ గుట్ట (ఖాజాహిల్స్), ఖాజాగూడను ప్రముఖ పర్యావరణ వేత్తలు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మెన్ ప్రొఫెసర్ వేద కుమార్ మణికొండ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమా నికి ప్రముఖ పర్యావరణ వేతలు రిటైర్డ్ డైరెక్టర్ కమతం మహేందర్ రెడ్డి, రామోజు హరగోపాల్, కొత్త తెలంగాణ చరిత్ర బృందా, చక్కిలం వేణుగోపాల్ రావు, సోమా రామ్ మూర్తి, రామ్ రాజ్, సకీనా, సేవ్ రాక్స్. జనాబ్ జాజిర్ హుస్సేన్, వేముగంటి మురళీకృష్ణ, శోభా సింగ్ తదితరులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భం గా మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి 2022 నుంచి అంతర్జాతీయ జియో డైవర్సిటీ డేను నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా తెలంగాణ లోని జియో హెరిటేజ్ సైట్లపై అవగాహన కల్పించేం దుకు ఈ సంవత్సరం ఫక్రుద్దీన్ గుట్టను సందర్శించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దక్కన్ ప్రాంతం ముఖ్యంగా తెలంగాణ గొప్ప భౌగోళిక ప్రాముఖ్యతను కలిగి ఉందని, లక్షల సంవత్సరాల నాటి దక్కనీ రాతి నిర్మాణా ల పూర్తి శ్రేణిని కలిగి, అద్భుతమైన భౌగోళిక వైవిధ్యం కలిగి ఉందని, ఇవి ప్రపంచంలోని అతిపెద్ద రాతి నిర్మాణాలలో ఒకటిగా పరిగణించబడుతున్నాయని ఆయన అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో పాండవుల కొండ (పాండవుల గుట్ట)ను మాత్రమే జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, భారత ప్రభుత్వం అధికారికంగా గుర్తించాయి. ఇప్పటికీ తెలంగాణలో మరెన్నో ప్రదేశాలు ఇలాంటి గుర్తింపునకు అర్హమైనవి. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ప్రత్యేకమైన శిలలు, నేలలు, భౌగోళిక ప్రదేశాలు మొదలైన జీవావరణ, భౌగోళిక ప్రదేశాలను పరిరక్షించు కోవాల్సిన ఆవశ్యకతపై వివరించారు. జిఎస్ఐ డైరెక్టర్ జనరల్ చక్కిలం వేణుగోపాల్ రావు మాట్లాడుతూ ఈ కొండలు భౌగోళిక అద్భుతాలు అని వీటిని హైదరాబాద్ గ్రానైట్ కాంప్లెక్స్ అని పిలువబడుతున్నాయన్నారు. రామోజు హరగోపాల్ మాట్లాడుతూ ఖాజాగూడ కొండలు అరుదైన సహజ శిలా నిర్మాణాలు అని, ఈ శిలలకు ఫకృద్దీన్ అనే పేరు ఎలా వచ్చిందో వివరించి, దర్గా హజ్రత్ ఫక్రుద్దీన్ చరిత్ర ను వివరించారు. తెలంగాణలో మరెన్నో భౌగోళిక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని గుర్తించి వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధికి బదులుగా మిలియన్ సంవత్సరాల నాటి సహజ రాతి నిర్మాణం అంతరించిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి యొక్క భౌగోళిక, భౌతిక అంశాలైన వివిధ రాతి నిర్మాణాల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరం కృషి చేయాలని ప్రభుత్వం కూడా దృష్టి సారించి పకృతి కొండలను అక్రమాలకు తావు లేకుండా కాపాడాలని సూచించారు.

భవిష్యత్తులో అందరికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డులు



నవతెలంగాణ, బడంగ్ పేట్

రానున్న కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అందించే ఏ సంక్షేమ పథకమైనా.. వన్ స్టేట్ - వన్ కార్డ్ ద్వారానే అందిస్తామని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. రేపటితో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలట్ ప్రాజెక్టు ముగింపు ఉండటంతో అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ. 119 నియోజకవర్గాల్లో 238 గ్రామాలను ఎంచుకుని డిజిటల్ సర్వే నిర్వహించామన్నారు. పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన మహేశ్వరం మండలం పెద్దమ్మతండాలో డిజిటల్ సర్వే రేపటితో ముగియనుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన రేషన్, ఆరోగ్య సేవలు, రైతుబంధు, ఫింఛన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ డిజిటల్ కార్డు ద్వారా అందిస్తామన్నారు. ప్రజలందరు సహకరించాలని కోరారు. ఆధార్ సహా ఏదైనా గుర్తింపు కార్డులను అధికారులకు చూపితే డిజిటల్ ఫోటో తీసుకుంటారని, పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలుకు ఈ డిజిటల్ కార్డులు దోహదపడతాయని కేఎల్ఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.



నవతెలంగాణ-ముషీరాబాద్

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గం లోని అమ్మవారి మండపాలను ఆలయాలను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్ సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కియా 2.0 పరివర్తనా వ్యూహం..

నవతెలంగాణ-సిటీబ్యూరో

కార్ల తయారీ సంస్థ కియా భారతీయ ఆటో మొబైల్ రంగం తీరుతెన్నులను తన 2.0 పరివర్తనా వ్యూహంతో పునర్నిర్వచించటానికి మరోసారి భవిష్యత్ విధానాన్ని అవలంభించింది. వాహనంలో డిజైన్, సాంకేతికతను పెంపొందించడంపై కియా 2.0 దృష్టి కేంద్రీకరించింది. ఈ పరివర్తనను ప్రారంభించేందుకు కంపెనీ భారతదేశంలో ఈవీ-9, కార్నివాల్ లిమోసిన్‌లను ప్రారంభించింది. ఈ సందర్భంగా కియా ఇండియా ఎండీ, సీఈఓ శ్రీ గ్వాంగు లీ మాట్లాడుతూ "కియాలో మేం ఎల్లప్పుడూ అవకాశాల కోసం అన్వేషిస్తాం. ఇది కంపెనీపై మాత్రమే కాకుండా మొత్తం వాహన పర్యావరణ వ్యవస్థపై కూడా శాశ్వతమైన సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. 2019లో సంచలనం సృష్టించాం. కియా 2.0 పరివర్తన వ్యూహంతో ఐదేండ్ల తర్వాత మరోసారి సంచలనం సష్టిస్తున్నాం" అని తెలిపారు.

నేటి నుంచి యువ కళా వేడుకలు

నవతెలంగాణ- కల్చరర్

రాష్ట్ర సంగీత నాటక అకాడమీ నిర్వహణలో బతుకమ్మ సంబరాలు లో భాగంగా నేటి నుంచి రెండు రోజులు యువ కళ వేడుకలు నిర్వహిస్తున్నామని అకాడెమీ ఛైర్పర్సన్ డాక్టర్ అలేఖ్య పుంజల తెలిపారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై జరిగే కార్యక్రమంలో తొలి రోజు శేషాచారి, రాఘవా చారి, హరిప్రియ లలిత సోదరీమణులు , శేషు లత, రమా ప్రభ శిష్య బృందం కర్ణాటక సంగీతం, స్వేత, దయా సాగర్, భగత్ నేనే శిష్య బృందంచే హిందూస్తానీ సంగీతం రామా చారి శిష్య బృందంచే భక్తి గీతాల గానం ఉంటాయని తెలిపారు. మంగళవారం భరత నాట్యం కూచిపూడి, కథక్,పేరిణి, మోహినీ అట్టం సంప్రదాయ నృత్య ప్రదర్శన ప్రముఖ కళాకారులుచే ఉంటాయని పేర్కొన్నారు. బుధవారం అజయ్ మంకెన పల్లి బృందం గొల్ల రామప్పకథ, జయచంద్ర వర్మ ఆర్.హారిక బృందం భక్త ప్రహ్లాద నాటకాలు ఉంటాయని డాక్టర్ అలేఖ్య ప్రకటించారు.

18 మంది సైబర్ నేరస్థుల అరెస్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో

సైబర్ నేరాలకు పాల్పడుతున్న కీలక నిందితులను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసినట్టు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టగ 18 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. వీరిపై రాష్ట్రంలో 45కుపైగా కేసులు ఉండగా, దేశవ్యాప్తం గా 319 కేసులు ఉన్నట్టు తెలిపారు. నిందితుల నుంచి రూ.5 లక్షల నగదు, 26 సెల్ 16 ఏటీఎం కార్డులు, 11 బ్యాంక్ చెక్ రెండు ల్యాప్ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా సెక్స్ టార్షన్, కొరియర్, పెట్టుబడి పేరుతో వీరు మోసాలకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. నిందితుల బ్యాంకు ఖాతాల్లోని రూ.1.61 కోట్ల నగదును సీజ్ చేశారు. తెలంగాణలో నమోదైన కేసుల్లో బాధితుల నుంచి ఈ కేటుగాళ్లు రూ.6.94 కోట్లు కాజేసినట్లు కమిషనర్ తెలిపారు. అరెస్టు అయిన వారిలో ముంబాయికి చెందిన నికేష్ భట్టి, సంజయ్ బిమ్యాస్ దాస్, అమీర్ కాశీనాథ్ జాదవ్, ఆరీఫ్ భర్కత్ అలీ షేక్, అజయ్ గోపీనాథ్ మిశ్రా, కపిల్ బౌసాహెబ్ నగరే, రాజస్థాన్ చెందిన యోగేష్ దేవ్ చంద్రవత్, సమీన్ ఖాన్, షేక్ ఖాన్, సన్నీ, నాగ్ చెందిన సకేత్ సతీష్, అన్న గోకుల్ దాగే, బెంగుళూరుకు చెందిన రిద్ బెది, ఉదయ్ వరుణ్ కౌశిక్, శ్రీధర్ ఉన్నారని తెలిపారు. సైబరత్ నేరగాళ్లను పట్టుకోవడంతో నిర్వహించిన పోలీసు ఆపరేషన్ సైబర్ క్రైమ్ డిసిపి ధారా కవిత పర్యవేక్షణలో ఎసిపిలు శివ మారుతి నేతృత్వంలో ఇన్ మట్టం రాజు, పి.ప్రమోద్ ఎం.సీతారాములు, కె.ప్రసాద్ ఎస్.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

1930 టోల్ ఫ్రీ నంబర్

సైబర్ మోసాల బారిన పడిన బాధితులు వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు సమాచారం అందించాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సరైన ధృవీకరణ లేకుండా ఎవరికి డబ్బు పంపవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపిలు అడిగితే స్థానిక పోలీసు స్టేషన్ సమాచారం అందించాలన్నారు.

ఈ నెల 8న జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

- ఉద్యోగులు ,కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి
- సర్కిల్‌కు 10 మందిని పంపించాలి
- జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలి కాట

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ ఉద్యోగుల కార్మికుల కోసం ఈ నెల 8 వ తేదీన ఉదయం 9 గంటల నుండి సాయత్రం 5 గంటల వరకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించుచున్నామని కమిషనర్ ఆమ్రపాలి కాట తెలిపారు. ఈ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు కిమ్స్, సన్ షైన్ హాస్పిటల్ సహకారంతో టీమ్ విమలకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్. విమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అల్ట్రాసౌండ్, ఉదరం, యూజీఐ ఎండో స్కాప్ సిగ్మో డోస్కోప్ ప్రోక్టోస్కోపీ , ఈసీజీ, 2డీ - ఎకో ఎక్స్ రే, సీబీపీ లివర్ ఫంక్షన్ టెస్ట్ కిడ్నీ ఫంక్షన్ టెస్ట్ ,సిరం, క్రియాటీనిన్ ఆర్‌బీసీ, లిపిడ్ ప్రొఫైల్ హెచ్‌బీఎస్‌ఏజీ, హెచ్‌సీవీ మొదలైన పరీక్షలు చేయబడును. ప్రతి సర్కిల్,జోనల్ అధికారుల తో పాటు ఆయా విభాగాల హెచ్ ఓ డి అధికారులు సిబ్బంది, కార్మికులు తో సహా 10 మంది అనారోగ్యంతో బాధ పడుతున్న, అనుమానస్పద ఉన్నవారు ప్రధాన కార్యాలయానికి పంపించాలని కమిషనర్ ఆదేశించారు.ఈ ఉచిత శిబిరానికి ఖాళీ కడుపు తో పంపించాలని కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు హెడ్ ఆఫీస్‌లో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కావాల్సిన గదులని సిద్ధం చేయాలని బిల్డింగ్ ఈఈను కమిషనర్‌ను ఆదేశించారు.

'కాంటినెంటల్'కు ది బెస్ట్ హాస్పిటల్ ఎక్సలెన్స్ అవార్డు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరానికి చెందిన కాంటినెంటల్ హాస్పిటల్స్‌కు హైదరాబాద్ శిల్పకళా వేదికలో జరిగిన ప్రతిష్టాత్మక జీ-స్పార్క్ 2024 వేడుకలో బెస్ట్ హాస్పిటల్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్, యాంటీమైక్రోబయల్ స్టీవార్డ్‌షిప్‌లో అత్యుత్తమంగా గుర్తించినందుకు, ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ ప్రమాణాలను అమలు చేస్తున్నందుకు ఈ విజయాన్ని సాధించింది. ఈ అవార్డును కాంటినెంటల్ హాస్పిటల్స్ వ్యవస్థాపక ఛైర్మెన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ రఘు ఎన్ రెడ్డికి జీ-స్పార్క్ ఛైర్మెన్ డాక్టర్ రంగారెడ్డి, వైస్ ఛైర్మెన్ ప్రొఫెసర్ బీజే రావు అందజేశారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఛాన్సలర్ కో ఛైర్, జీ-స్పార్క్ డాక్టర్ బీఆర్ షామన్న, కో ఛైర్ ఆర్ గోవింద్ హరి, ఇతర జీ-స్పార్క్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ గురు ఎన్ రెడ్డి మాట్లాడుతూ ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌తోపాటు దేశవ్యాప్తంగా ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ కంట్రోల్, యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్‌లో బెస్ట్ హాస్పిటల్ అవార్డును అందుకోవడం గర్వంగా భావిస్తున్నామని తెలిపారు. తాము హాస్పిటల్‌ను స్థాపించినప్పటి నుంచి, 11 ఏండ్లుగా ఇన్ఫెక్షన్‌ల ను నియంత్రించడానికి నివారనా చర్యలు తీసుకుంటున్నామనీ, దీని ఫలితంగా ఆరేండ్లుగా తాము వివిధ అక్రిడిటేషన్‌లను పొందామని తెలిపారు. ఇప్పుడు 0.02శాతం ఇన్ఫెక్షన్ రేటును కొనసాగించినందుకు ఈ అవార్డుతో గుర్తింపు పొందినట్టు తెలిపారు.

'సరైన వైద్య సలహాతో నరాల వ్యాధి నొప్పి నివారణ'

నవతెలంగాణ-సిటీబ్యూరో

నాడీ వ్యవస్థకు దీర్ఘకాలిక నష్టం నుంచి నరాల వ్యాధి నొప్పి పుడుతుంది. తీవ్రమైన గాయాలు, స్ట్రోకులు లేదా వెన్నుపాము దెబ్బతినడం వంటి సమస్యలు నరాల వ్యాధి నొప్పికి దారి తీయవచ్చు. న్యూరోపతిక్ నొప్పి రోగ నిర్ధారణ, చికిత్సను అర్థం చేసుకోవడం చాలా అవసరం. నరాల వ్యాధి నొప్పికి చికిత్స చేయడం సవాలుతో కూడుకున్నది. నరాలు దెబ్బతిన్నాయి లేదా సరిగా పని చేయకపోవడం వల్ల వ్యక్తి జీవన నాణ్యతను బాగా తగ్గించవచ్చు. నరాల వ్యాధి నొప్పికి చికిత్స చేయడానికి, నొప్పి ఎక్కడ సంభవిస్తుందో, దాని స్వభావాన్ని వైద్యులు మొదట గుర్తిస్తారు. వారు "త్రీ ఎల్ అప్రోచ్" అనే పద్ధతిని ఉపయోగిస్తారు, ఇందులో రోగి నొప్పి వర్ణనను "వినడం", భౌతిక సంకేతాలను "చూడటం", నొప్పి ప్రాంతాన్ని "గుర్తించడం" వంటివి ఉంటాయి. ఈ నేపథ్యంలో బోహ్రా న్యూరో క్లినిక్ జనరల్, న్యూరాలజిస్ట్ కోమల్ బోహరా మాట్లాడుతూ సరైన వైద్య సలహాతో నరాల వ్యాధి నొప్పిని నిర్వహిం చవచ్చు అన్నారు. మసాజ్ థెరపీ, ఫిజియోథెరపీ వంటి చికిత్సలు న్యూరో పతిక్ నొప్పికి చికిత్స చేయడంలో సహాయపడతాయని తెలిపారు. న్యూరోపతిక్ నొప్పితో ఎక్కువగా బాధపడుతుంటే, రోగ నిర్ధారణ, చికిత్స కోసం వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా పోస్ట్ ప్రారంభ వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

అధునాతన డెర్మటాలజీ, సౌందర్యం, వెల్‌నెస్ చికిత్సలకు ప్రధాన గమ్యస్థానమైన ఫెమినా ఫ్లాంట్ స్టూడియో సెలూన్, సికారా క్లినిక్‌లు సంయుక్తంగా అదివారం బంజారాహిల్స్‌లోని తమ ఫ్లాగ్‌షిప్ స్టోర్‌లో సిటీ సోషలైట్‌లతో పోస్ట్ ప్రారంభ వేడుకలను నిర్వహించారు. సికారా క్లినిక్స్ వ్యవస్థాపకులు, డైరెక్టర్, ఫెమినా ఫ్లాంట్ సౌత్ ఇండియా మాస్టర్ ఫ్రాంఛైజర్ శిరీష ఆలపాటి, సికారా క్లినిక్‌ల సహ వ్యవస్థాపకుడు, సీఈఓ రాఘవేందర్ రెడ్డి కల్లెంతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష ఆలపాటి మాట్లాడుతూ "సికారా క్లినిక్స్ డెర్మటాలజీ, సౌందర్య సేవలను అందిస్తోంది. హైదరాబాద్‌లో ఇప్పటికే 8 ఫ్రాంఛైజీలను ఇచ్చాం. రాబోయే కొద్ది నెలల్లో మరిన్ని వస్తాయి. ప్రతి రాష్ట్ర రాజధానిలో ఇలాంటి ఫ్లాగ్‌షిప్ స్టోర్‌లను ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నాం. దీన్ని పాన్-ఇండియాగా మార్చాం. దేశవ్యాప్తంగా 300 స్టోర్లే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం" అని తెలిపారు. ఎస్కై ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు, సికారా క్లినిక్స్, ఫెమినా ఫ్లాంట్ స్టూడియో కొండాపూర్ ఫ్రాంఛైజీ యజమానురాలు సుచితా జోషి విజయ్ కుమార్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక అతిథులుగా కాటలిస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ ఉష, సంగీత వర్మ, అనిత గాలి, ఆర్ట్ క్యూరేటర్ అమన్ ప్రీత్ కౌర్, తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులు సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమం





నవతెలంగాణ-కల్చరర్

ఈ నెల 9 వ తేదీన శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం బ్రహ్మ కుమారీస్ నిర్వహణలో సాంస్కృతిక అధ్యాత్మిక కార్యక్రమాలు జరుగనున్నాయనిం సోదరి బ్రహ్మకుమారి జయశ్రీ తెలిపారు. చిక్కడపల్లిలోని బ్రహ్మకుమారీస్ కేంద్రంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు ప్రకటించారు. 9వ తేదీన ముగ్గురు దేవతలు లక్ష్మి, సరస్వతి, దుర్గా దేవిల చైతన్య ప్రతిష్ఠా పనచేసి తరువాత నృత్య సంగీత ప్రదర్శనలు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. బ్రహ్మ కుమారి సభ్యులు శక్తి స్వరూపం వివరాలు తెలుపుతారని ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయని జయశ్రీ తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ ఈటల బహిరంగ లేఖ

- హైడ్రా సంస్థకు, మూసీ ప్రక్షాళనకు తాను వ్యతిరేకం కాదని వెల్లడి
- పేద ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తూ హైడ్రా అడ్డగోలు కూల్చివేతలకు వ్యతిరేకం

నవతెలంగాణ-మేడ్చల్

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సీఎం రేవంత్ రెడ్డికి హైడ్రా చేపడుతున్న కూల్చివేతలు, మూసీ నది ప్రక్షాళన పై ఆదివారం బహిరంగ లేఖ రాశారు. హైడ్రా సంస్థకు, హైదరాబాద్ ముంపు గురికాకుండా చూసేందుకు, మూసీ ప్రక్షాళనకు తను వ్యతిరేకం కాదని అన్నారు. హైదరాబాద్ లో ఉన్న చెరువులన్నీ ఇప్పుడు భూగర్భంలో విషాన్ని నింపుకొని దుర్వాసనను వెదజల్లుతూ ప్రజల రోగాలకు నిలయాలుగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముందు చెరువుల్లో ఉన్న దుర్గంధాన్ని తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అది చేయకుండా 40 ఏళ్లక్రితం ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూముల్లో, ప్రభుత్వం అనుమతించిన లే అవుట్ లలో ఇండ్లు కట్టుకున్న నిరుపేదప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తూ హైడ్రా అడ్డగోలు కూల్చివేతలను వ్యతిరేకిస్తున్నాని తెలిపారు.

పేదల పక్షాన కొట్లడడం నా కర్తవ్యం

పదేళ్ళున్న కేసీఆర్ మూసీ ప్రక్షాళన చేస్తానని చేయలేదని మీరు ఇప్పుడు మూసీ ప్రక్షాళన చేస్తానంటే అడ్డుకోమని అన్నారు.పట్టాభూములను కొనుక్కొని ఇల్లు కట్టుకొని ఉంటున్న వారిని బఫర్ జోన్ పేరుతో అక్రమంగా కట్టుకొని ఉంటున్నారని చిత్రీకరించడం దుర్మార్గమైన చర్య విమర్శించారు.పిడికెడు అక్రమ ఇళ్లను బూచిగా చూపి కోట్ల విలువ చేసే ఇళ్లను కూలగొడుతున్నారని మండిపడ్డారు.ఆర్ బీ-ఎక్స్ అని రాస్తున్నారు.పనిగిరి కాలనీ, మారుతినగర్, చైతన్య పురి, ప్రజయ్ ఇంజనీరింగ్ సిండికేట్ లాంటి అపార్ట్మెంట్స్ పరిశీలించినట్లు తెలిపారు. ప్రజల ఆక్రందనాలను తెలిపే ప్రయత్నం చేస్తే తనను కాలకేయులుగా పోలుస్తున్నారు. ఇదేనా మీ భాష మీ సంస్కారంని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బ్యూటిఫికేషన్ పేరిట మాల్స్ కట్టి పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వ యాక్షన్ ప్లాన్ ఏంటి?

డీపీఆర్ ఉందా? ఇళ్ళు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏంటి ? కోట్లవిలువ చేసే ఇండ్లు తీసుకొని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తా అంటే ఎలాని ప్రశ్నించారు.సబర్మతి నది ప్రక్షాళనకి రూ.2వేల కోట్లు, నమోగంగ ప్రాజెక్ట్ కి రూ.12 ఏళ్లలో 22వేల కోట్లు ఖర్చు పెడితే మూసీ ప్రక్షాళనకు లక్షా50వేల కోట్లు ఎందుకు ఖర్చు అవుతున్నాయి? ఈ ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు ? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. చెరువుల ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్ లు నిర్ధారించకుండ కూల్చివేతలు ఎలా చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టా భూముల్లో ఇళ్ళు కట్టుకున్నవారికి ప్రత్యామ్నాయం ఏం చూపిస్తారు ప్రకటించండని కోరారు.ప్రభుత్వం చేస్తున్న పనులు పనులు హైదరాబాద్ భవిష్యత్తుని,అభివృద్ధిని ప్రశ్నార్థకంలో పడవేస్తున్నాయని అన్నారు. స్టేజీలమీద ప్రకటనలు చేయడం కాకుండ సీఎం రేవంత్ రెడ్డి అఖిలపక్షం ఏర్పాటు చేయాలని కోరారు.

ఘట్కేసర్ ప్రాంతాల్లో వర్షం



నవతెలంగాణ-ఘట్కేసర్ రూరల్

నగర శివారులోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఘట్కేసర్ అంకుషాపూర్, అవుషాపూర్, కాచివాని సింగారం, ప్రతాప్ సింగారం, ఎదులాబాద్, మరిపల్లిగూడెం పరిసర ప్రాంతంలో వాన దంచి కొట్టింది. దీంతో రోడ్డెక్కిన వానదారులు, పాదాచారులు ఇక్కట్లు పడ్డారు.



శ్రీదేవి నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా విజయపురి కాలనీ కమ్యూనిటీ హాల్‌లోని ఉప్పలమ్మ సహిత విజయ దుర్గ మాత ఆదివారం నాలుగవ రోజు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. వంశీ పంతులు ఆధ్వర్యంలో విశేషా అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లింగారెడ్డి, రాములు, మోహన్, నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్, ప్రభాకర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మాధవ్ శ్రీకాంత్ రజనీకాంత్ సుబ్బారావు, బిక్షపతి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

-నవతెలంగాణ- సిటీ బ్యూరో

సామాన్యుడికి దడా పుట్టిస్తున్న కూరగాయల ధరలు



నవతెలంగాణ-కాప్రా

అకాల వర్షాల వలన మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలపై పెను భారం పడుతోంది. వారి స్థోమతతో కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు సైతం విపరీతంగా పెరగడంతో పూట గడవని స్థితిలో ఉన్నారు. ఇప్పుడు కూరగాయాల ధరలు పెరగడంతో జనాలు ఒక్కసారిగా అవాక్కవుతున్నారు. కొందరైతే కూరగాయాల కొనేందుకు ధైర్యం రాక ఉట్టిచేతులతో ఇంటి దారి పడుతున్నారు. ధరలు ఎప్పుడు తగ్గుతాయా? అని ఆశగా ఎదురుచూస్తున్నారు. వర్షాల వలన దిగుబడి తగ్గడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ క్రమంలో కూరగాయాల ధరలు ఏకంగా రూ.100కు చేరువలో ఉన్నాయి. ఇప్పటికే టమోటా రూ.100 పలుకుతోంది. ఏపీ, తెలంగాణలో గత వారం ఉల్లి కేజీ రూ.60 ఉండగా.. ఇప్పుడు రూ.80 చేరింది. టమోటా గతవారం కేజీ రూ.50 నుంచి60 మధ్యలో ఉండగా, కొన్ని ప్రాంతాల్లో రూ.100 పలుకుతుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో రూ.80 నుంచి 90 మధ్య పలుకుతోంది. దసరా పండుగ నాటికి అన్ని కూరగాయాలు రూ.100 చేరువ కావొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



నవతెలంగాణ-బంజారాహిల్స్

నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన దుర్గ దేవి విగ్రహాలకు, ప్రత్యేక పూజలు, నిర్వహించిన కార్పొరేటర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులతో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ ఆడిపాడుతూ తెలంగాణ అస్తిత్వానికి బతుకమ్మ నిలువుటద్దమన్నారు. అనంతరం అన్నదానంలో భాగస్వాములు అయ్యారు.

నవతెలంగాణ బేగంపేట

బన్సీలాల్ పేట్ డివిజన్ న్యూ బోలక్ పూర్ హనుమాన్ దేవాలయం వద్ద బీజేపీ డివిజన్ సీనియర్ నాయకులు గుంటి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ యువ నాయకులు మర్రి పురురవ రెడ్డి పాల్గొని పలువురి స్థానికులకు సభ్యత్వాన్ని చేయించారు.



సమాచారం ఇచ్చి ఊరేళ్లండి.. జాగ్రత్తలు తీసుకుంటాం..

● ఓయూ ఏసీపీ గ్యార జగన్, ఇన్‌స్పెక్టర్ రాజేందర్

నవతెలంగాణ,ఓయూ

దసరా పండగకు స్వగ్రామాలకు వెళుతున్న స్థానికులు ఊరెళ్తున్నారా అయితే జాగ్రత్తలు పాటించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏసీపీ గ్యార జగన్, ఓయూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ నవతెలంగాణతో పేర్కొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రజలు దసరా పండుగకు, ఇండ్లకు తాళాలు వేసి ఎక్కువ రోజులు ఊర్లకు వెళ్తుతుంటారు. అలాంట వారు దొంగలకు అవకాశం ఇవ్వకుండా, దొంగతనాలు జరగకుండా మీ ఇండ్లలోని వస్తువులు దోపిడీకి గురికాకుండా కొన్ని ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌లు ప్రజలకు సూచించా రు. వారు మాట్లాడుతూ ఇంట్లో ఎవరూ లేకుండా తాళాలు వేసి ఊర్లకు వెళ్లేవారు, బంగారు ఆభరణాలు, లేదా ఇతర విలువైన ఆభరణాలు, డబ్బు ఇంట్లో పెట్టి వెళ్ళవద్దని సూచించారు.

బ్యాంకు లాకర్లలో పెట్టుకోవా లని హెచ్చ రించారు. మీ ఇరుగు, పొరుగు వారికి తెలియపరచి, ఎవరైనా మీ ఇంటి పరిసరాలలో సంచ రించిన యెడల గమనిస్తూ ఉండాలని తెలియపరచి వెళ్లాలన్నారు. ఊరు నుంచి తిరిగి వచ్చేవరకు న్యూస్ పేపర్లు కానీ, పాల ప్యాకెట్లు గాని వేయవద్దని చెప్పి వెళ్లాలని, ఒకవేళ న్యూస్ పేపర్లు, పాల ప్యాకెట్లు ఇంటిముందు ఉన్న యెడల ఇంట్లో ఎవరూ లేరని దొంగలు గమనించి రాత్రిపూట దొంగతనాలు చేయు టకు వీలు కల్పించిన వారు అవుతారని ముందస్తుగా సూచించారు. ఓయూ పిఎస్ పరిసర ప్రాంతాలలో కొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అన్నిచోట్ల లేనందున దొంగతనాలు చేసే వారు భయం లేకుండా ఇండ్లలో చోరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి చోట్లా నివసించేవారు మీ ఇంటి నెంబరు, ల్యాండ్ మార్క్, ఓయూ పిఎస్ పోలీస్ స్టేషన్‌లో తెలియపరచాలన్నారు. అలా తెలియపరచినందున రాత్రిపూట గస్తీ తిరిగే పోలీసులు తాళాలు వేసుకున్న మీ ఇంటిని గమనించి, పరిసరాలలో ఎవరైనా అనుమానాస్పదంగా ఉన్న యెడల వారిని వెంటనే స్టేషన్‌కు తీసుకొని వచ్చి విచారించుటకు అవకాశం కలుగుతుందన్నారు. సీసీ కెమెరాలు ఉన్న వారు మీ సెల్ ఫోన్లకు లింకు చేసుకొని ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్లను గమనిస్తూ ఉండాలని హెచ్చరించారు. ఇంటి లోపల బయట లైట్లు వేసి ఉంచుకొని వెళ్లాలని, లైట్లు వెలుగుతున్నప్పుడు దొంగలు ప్రవేశించే అవకాశం ఉండదని అన్నారు. దొంగలు బయట ప్రాంతం నుండి కూడా వస్తారని అలాంటి గుర్తు తెలియని వ్యక్తులు మీ కాలనీలో కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేయాలని, ప్రతి విషయంలో జాగ్రత్తలు పాటించాలని కాలనీల వారికి సూచించారు. ఇలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అప్పుడే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు.

కార్మికుల అభ్యున్నతికి పాటుపడేందుకు కృషి

నవతెలంగాణ-బంజారాహిల్స్

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలంటే సంఘాలు ఎంతో అవసరమని సమాజంలో అనేక రుగ్మతల్లో కూరుకుపోయినప్పటికీ పరిష్కార మార్గాలు వెతుక్కుంటూ ముందుకు వెళ్లాలని ఆలోచన ధోరణి చాలా గొప్పదని బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఆదివారం నెక్లెస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన నూతన గౌడ అఫీషియల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ 'గోపా, గోపా రాష్ట్ర కమిటీకి ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ సభ గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, ఆధ్వర్యంలో అతిథిలుగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, బుర్ర ప్రిన్సిపల్ సెక్రటరీ విద్యా, బీసీ సంక్షేమ శాఖల వెంకటేశం గౌడ్‌లతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వచ్చిన దాదాపు 400లకు పైగా గోప సభ్యులు ఈ ఉత్సవానికి హాజరైనా వారిని ఉద్దేశి ంచి మంత్రి మాట్లాడుతూ.. గోపాను జిల్లాలలో కూడా బలోపేతం చేసి గౌడ పేద విద్యార్థుల కోసం, గౌడ యువజనుల కోసము, గీత కార్మికుల వారి అభ్యున్నతికి పాటుపడేందుకు కృషి చేయాల్సిందిగా సూచించినారు. అందుకు తగ్గట్టుగా నా సహాయము, సహకారము నేను చేస్తాను అని మంత్రి తెలిపారు. బుర్ర వెంకటేశంతో పాటు మాజీ మంత్రులు, ఎంపీలు దేవేందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజేశం గౌడ్, మాజీ శాసనమండలి చైర్మెన్ శ్రీ కె స్వామి గౌడ్, మధు యాస్కి గౌడ్, బూర నర్సయ్య గౌడ్, వుమన్ కమిషన్ చైర్‌పర్సన్, నేరెళ్ల శారద గౌడ్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌లతో కలిసి నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి జివి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి మొగిలి రఘునాథ్ గౌడ్లతో పాటు ఉపాధ్యక్షులను, ఆర్గనైజింగ్ సెక్రటరీలను, జాయింట్ సెక్రటరీలను, కార్యవర్గ సభ్యులు అందరూ కలిపి 50 మందితో ఒకేసారి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాజలింగం, గంగాధర్, లక్ష్మీ నారాయణ, మాజీ ఎమ్మెల్యేలు కే.సత్యనారాయణ, కూన శ్రీశైలం, బిక్షమయ్య, టి.నందీశ్వర్, చైర్మెన్ ఖదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డ్, నాయుడు సత్యనారాయణ, బాలా లక్ష్మీ, మోతే చక్రవర్తి గౌడ్‌లు తదితరులు పాల్గొన్నారు.



లంబాడీలకు వెంటనే మంత్రివర్గంలో చోటు కల్పించాలి

● టీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు విజయ్ నాయక్

నవతెలంగాణ, ఓయూ

లంబడలకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని తెలంగాణ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫోరం (టీడీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు విజయ్ నాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 9 మాసాలు గడిచిన గాని ఇంతవరకు మా లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకపోవడం సిగ్గుచేటు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో మా లంబాడీలు కీలక పాత్ర పోషించారన్నారు. తెలం గాణ రాష్ట్ర మొత్తంలో 12% మంది గిరిజనులు ఉన్నా గాని ఇంతవరకు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించకపో వడం బాధాకరం. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం విస్తరించే క్యాబినెట్‌లో తప్పకుండా మా లంబాడీలకు వెంటనే మంత్రి పదవి ప్రకటించాలి, ప్రకటించని ఎడల మా లంబాడీలంతా కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తాం, రానున్న స్థాని క సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్తాం, మా హక్కుల కొరకు రాష్ట్ర వ్యాప్తంగా తప్పకుండా పోరా టం చేస్తామని టీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు విజయ్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేందర్ నాయక్ నరహరి, వెంకన్న, యాకు, రమేష్, తిరుమల్, బలరాం , పాల్గొన్నారు.

నవతెలంగాణ కథనానికి స్పందన..

నవతెలంగాణ-బంజారా హిల్స్

నవతెలంగాణ వార్త కథనానికి ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవ కమిటీలు స్పందించాయి. మహాగణపతి అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవడమే కాకుండా ప్రతిభక్తునికి తోచినంత సహకారం చేసే భాగ్యాన్ని సైతం అందించిందని భక్తులకూ సంబంధించిన కానుకల వివరాలు వెల్లడించాలని కోరడంతో ఆ కథనాన్ని నవతెలంగాణ గత నెలలో ప్రచురించింది. భక్తుల కోరిక మేరకు అడాక్ కమిటీగా ఏర్పడిన రెండు కమిటీల సభ్యులు బ్యాంకు అకౌంటు నేరుగా హుండీలో వేసినవి అడ్వర్టైజ్మెంట్ ఆధారంగా వచ్చిన ఇతర మార్గాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఉత్సవ కమిటీ చైర్మెన్ రాజ్ కమార్, అధ్యక్షులు స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మహేందర్ బాబులు ఈనెల 14న అన్ని రకాల వివరాలు వెల్లడిస్తా మని ప్రకటన లేఖను ఆదివారం విడుదల చేశారు. భక్తుల అభీష్టం మేరకే గతంలో ఎన్నడూ లేని విధంగా సీసీ కెమెరా నిఘాలో కానుకలు లెక్కించడం జరిగిందని వాటి వివరాలు సైతం త్వరలోనే వెల్లడిస్తామని ఇటీవలే ఓ సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు వెల్లడించినట్లు సమాచారం.

ఫోటో స్టూడియో ప్రారంభించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ, ఓయూ

గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ఉప్పల్‌లోని తన్వి బేబీ కిడ్స్ ఫోటో స్టూడియో ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ "పిల్లల ఫోటో గ్రఫీకి ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. ప్రతి చిన్నారి వృద్ధి, నవ్వులు, భావాలు ఈ ఫోటో స్టూడియో ద్వారా అద్భుతంగా సజీవంగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు. తన్వి బేబీ కిడ్స్ ఫోటో స్టూడియోలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ప్రాంగణాలు, సాంకేతిక పరిజ్ఞానం, క్రియేటివ్ థీమ్‌లు అందుబాటులో ఉంటాయని స్టూడియో నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, స్థానిక ప్రజలు హాజరై, కొత్తగా ప్రారంభమైన స్టూడియోని సందర్శించారు.

మంత్రి కొండాకు బీసీ సమాజమంతా అండగా ఉంటుంది

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్

నవతెలంగాణ, ఓయూ

మంత్రి కొండా సురేఖ తాను అన్న మాటలను, జరిగిన పొరపాటును తెలుసుకొని ఆ మాటలను ఉపసంహరించుకొని, విచారం వ్యక్తం చేసిన తర్వాత కూడా చర్చ కొనసాగించడం అనవసరమని, అయినా కొంత మంది సినిమా పరిశ్రమకు చెందిన వారు ఇదే విశయాన్ని రాద్ధాంతం చేస్తు అమెపై ఎదురు దాడికి దిగడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ కొండా సురేఖ వ్యాఖ్యలను వెనక్కి తీసకోవాలని అక్కినేని నాగార్జున ఫ్యామిలీ కోరిన వెంటనే మంత్రి స్పందించి తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంరించుకుంటున్నట్లు పత్రికా, మీడియా ఎదురుగానే చెప్పారని గుర్తు చేశారు. బీసీల బిడ్డ మహిళా మంత్రి కొండా సురేఖను ఏదో ఒక ప్రభుత్వ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ సభ్యుడు నూలు పోగుతో చేసిన కండువా కప్పితే సోషల్ మీడియాలో అత్యంత హీనంగా ట్రోల్ చేసినప్పుడు ఒక్కడు స్పందించని, మాట్లాడని సినీ లోకం అగ్రకుల హీరోకు మద్దతుగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక బహుజన మంత్రి కొండా సురేఖ ఏడుపు సినీ పరిశ్రమకు వినిపించలేదా అని ప్రశ్నిస్తున్నారు.



ఊరెళ్తున్నారా? జాగ్రత్తలు పాటించండి

● మధురానగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



మధుర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నివాసులు దసరా పండుగకు అందరూ తాళాలు వేసి ఊర్లకు వెళ్తు తుంటారు. అలాంటి వారికి మధురానగర్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ దొంగతనాలు జరగకుండా పోలీసుల సహకారం తీసుకొని, కొన్ని జాగ్రత్తలు పాటించాలని స్థానికులను కోరారు. తాళాలు వేసి ఊర్లకు వెళ్లేవారు విలువైన ఆభరణాలను, బంగారం, డబ్బును ఇంట్లో పెట్టుకుని వెళ్ళవద్దని, బ్యాంకు లాకర్లలో పెట్టుకోవాలని హెచ్చరించారు. అదేవిధంగా మీ చుట్టూ ప్రక్కల వారికి ఊరికి వెళ్తున్నట్లు తెలియపరచి ఎప్పుడు వచ్చేది చెప్పా లని, నమ్మకమైన వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసుకోవాలని, మీరు ఇంట్లో లేని సమయంలో న్యూస్ పేపర్లు, పాల ప్యాకెట్లు వేయవద్దని విధిగా చెప్పాలని హెచ్చరించారు. టు వీలర్ వాహనాలను గేటు లోపల పెట్టుకొని వెళ్లాలని, అవసరం అయితే చక్రాలకు కూడా చైన్‌తో తాళాలు వేసి వెళ్లాలని, లోపల బయట లైట్లు వేసి ఉంచుకోవాలన్నారు. అదే విధంగా ప్రతి బస్తీలో కొత్తవారు కనపడినచో మొ దట నలుగురు కలిసి వెళ్లి విచారించాలని, అనుమానం వస్తే వెంటనే 100 నంబర్‌కు కాల్ చేయాలని, పెట్రో లింగ్ పోలీసులు వెంటనే వచ్చి అనుమానంగా తిరుగు తున్న వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తామన్నారు. తాళాలు వేసి ఊర్లకు వెళు న్నామని మీ ఇంటి నంబరు, లొకేషన్ పోలీస్ స్టేషన్‌లో తప్పనిసరిగా తెలియపరచి వెళ్లాలని అప్పుడు గస్తీ తిరిగే పోలీసులు రాత్రి సమయంలో మీ ఇంటి సమీపంలో ఎవరైనా ఉన్నా చర్యలు తీసుకుంటారన్నారు. పోలీసులకు సహకారం ఇవ్వాలని, పోలీసులు కూడా గట్టి చర్యలు తీసుకుంటారని ,ఇన్‌స్పెక్టర్ జి .శ్రీనివాస్ మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నివాసులను హెచ్చరించారు.

హైదరాబాద్ సంస్కృత అకాడమీ డెరైక్టర్‌గా ప్రో.మధుసూదన్

నవతెలంగాణ, ఓయూ



హైదరాబాద్ సంస్కృత అకాడమీ డెరైక్టర్‌గా ప్రొపెసర్ మధుసూదన్ బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో జన్మించిన అయిన ఉస్మానియా యునివర్సిటీ లో సంస్కృతంలో ఎంఏ, పీఎచ్‌డీ పూర్తి చేసిన మధుసూదన్ యోగ, భారతీయ దర్శనం మొదలైన విషయాలలో విశేష పరిశ్రమ చేసి జాతీయ అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. ఇప్పటి వరకు మూడు మహా కావ్యాలు, పది లఘుకావ్యాలు, 15 అనువాదాలు చేశారు. వీరు రచించిన కావ్యానికి కేంద్రీయ సాహిత్య అకాడమీ అవార్డును, గౌరవ డీలిట్ ను అందుకున్నారు. వాచస్పతి, శాస్త్రి, శాస్త్ర రత్నాకర, యజ్ఞాసురభి, మొదలైన 20 పురస్కారాలు పొందారు. మరాఠీ భాషలోని జ్ఞానేశ్వరిని 9000 శ్లోకాలలో అనువదించారు. మహారాష్ట్రలోని కాళిదాసు సంస్కృతి యునివర్సిటీలో ప్రొఫెసర్‌గా, వైస్ ఛాన్సలర్‌గా సేవలం దించారు. నెదర్లాండ్స్, కెనడా, నేపాల్ మొదలైన దేశాలలో పర్యటించారు. ప్రస్తుతం హైదరాబాద్ సంస్కృతీ అకాడమీ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. సంస్కృతీ అకాడమీ అభ్యున్నతికి,

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన

నవతెలంగాణ, ఓయూ

తార్నాక డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి హరి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం గురించి డివిజన్ ప్రజలకు అవగాహన కల్పించారు. దానికి సంబంధించిన పీఎం విశ్వకర్మ పథకం స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్ పథకం గురించి వివరించారు. దీనిలో కళాకారులు, హస్త కళాకారులకు ప్రయోజనాలకు అందించడం కోసం కొన్ని సాంప్రదాయ కులవృత్తులు ఇందులో చేర్చబడ్డాయన్నారు. ఇందుకు చేతులు, పనిముట్లతో పని చేసే చేతి వృత్తిదారులు లేదా హస్త కళాకారులు విశ్వకర్మ పథకం కింద నమోదు చేసుకోవడానికి అర్హులు. రిజిస్ట్రేషన్ తేదీ నాటికి లబ్ధిదారుని కనీస వయసు 18 సంవత్స రాలు ఉండాలి. ఈ కార్యక్రమానికి కంటి విజయ్, రాజనర్సింహ, ప్రశాంత్, యాదగిరి, కిషన్ గౌడ్, నాగరాజుగౌడ్, శివ, గణేష్, వీరేష్, ఆలకుంట కుమార్, అబ్రహం పటేల్ పాల్గొన్నారు.



మానవ హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం

● లోకాసమస్త హ్యూమన్ రైట్స్

నవతెలంగాణ-బంజారాహిల్స్

లోకాసమస్త హ్యూమన్ రైట్స్ హైదరాబాద్ పట్టణ మహిళా విభాగ చైర్‌పర్సన్ కె.సుశీల కుమారి ఆధ్వర్యంలో మానవ హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంస్థ వ్యవస్థాపకులు నేషనల్ చైర్మెన్ జి.పి.నరసింహులు మాట్లాడుతూ... భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల గురించి వివరిస్తూ సమాజంలో ప్రతి పౌరుడు ప్రాథమిక హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం సంస్థ విధి విధానాలను సభ్యులకు వారు ప్రజలకు చేయాల్సిన సేవలు వాటి వలన కలిగే ప్రయోజనాలు తెలియజేస్తూ సమాజం మేలు కోసం పాటుపడే ప్రతి ఒక్క సభ్యుడికి గుర్తింపు కార్డులు మంజూరు చేసి ఇవ్వడం జరిగిందన్నారు. సమాజంలో ఎక్కడైనా మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే అండగా మేమున్నామని భరోసా కనిపిస్తూ సంస్థ తరపున వారికి తోడ్పాటు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. సామాజిక సేవకులు సమాజంలో జరుగుతున్నటువంటి మానవ హక్కుల ఉల్లంఘనపై చర్చించి వారి అభిప్రాయాలను వ్యక్తపరిచారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంస్థలో సభ్యులు నియమించి, వారికి నియామక పత్రాలు అందించారు. చివరగా పల్లె ప్రవీణ్ ఆధ్వర్యంలో గంగరాజు, వరలక్ష్మి ఆలపించిన జానపద గేయాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో వావ్ అవార్డ్స్ ఫౌండర్ యల్.సందీప్ గౌడ్,సంస్థ ఏపీ స్టేట్ కోఆర్డినేటర్ యు.రఘురాములు, ఏపీ,టిఎస్ చైర్మెన్ సి.మోహన్ రావు,సామాజిక సేవకురాలు చంద్రప్రభ, సభ్యులు రెడ్డి ప్రసాద్,వంశీ కుమార్ రెడ్డి,జాహ్నవి, కే.లక్ష్మీ సాయి నిహారిక, వీరభద్ర, నాగజ్యోతి, సిద్దయ్య, అవినాష్ యాదవ్, సీరియల్ ఆర్టిస్టులు రాధా,మంజుల తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌డబ్ల్యూఎఫ్ - సీఐటీయు ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులకు నివాళి

నవతెలంగాణ-సిటీబ్యూరో



టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ డబ్ల్యూఎఫ్- సీఐటీయు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం ముషీరాబాద్ డిపో ఆధ్వర్యంలో 55 రోజుల సమ్మెలో అమరులైన 32 మంది కార్మికులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముషి డిపో సెక్రటరీ లింగం మాట్లాడుతూ విద్యుత్ బస్సులో ఆర్టీసీలే కొని నిర్వహించుకోవాలని, అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. మహాలక్ష్మి పథకం అమలు వల్ల వస్తున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆర్పిఎస్ 2017 ఆరియర్స్ తో ముడి పెట్టకుండా 173 నెలల డిఏ ఆరియర్స్ చెల్లించాలన్నారు. యూనియన్ల పై ఆంక్షలు ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని లింగం కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఆంజనేయులు, సహాయక కార్యదర్శి పి. నరసయ్య, హైదరాబాద్ జోనల్ కార్యదర్శి జిఆర్ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన గాయత్రి అంత్యక్రియలు



నవతెలంగాణ-బంజారా హిల్స్

అశ్రుమయనాల మధ్య అందర్నీ నవ్వించే పాత్రలు చేస్తూన్న నటకిరీటి రాజేంద్రప్రసాద్ కూతురు గాయత్రి అంత్యక్రియల్లో స్వయంగా ఆయనే పాడేమోసిన ఆయనను ప్రత్యక్షంగా చూసిన అభిమానులకూ కంటతడి పెట్టించేశారు. కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలోని 7వ ఫేజ్ కైలాస వాసంలో గాయత్రి అంత్యక్రియలు ముగిసాయి. కొన్నాళ్లుగా తన కామెడీతో అలరిస్తూ వస్తున్న రాజేంద్రప్రసాద్ ఇప్పటికీ వైవిధ్యమైన పాత్రలలో నటిస్తూ మెప్పిస్తున్నాడు. అయితే ఆయన కూతురు గాయత్రి (38) గుండెపోటుతో శుక్రవారం రాత్రి కన్ను మూసింది. గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు గాయత్రిని హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజేంద్రప్రసాద్ కూతురు గాయత్రి తుదిశ్వాస విడిచింది. గాయత్రి మరణంతో రాజేంద్రప్రసాద్ కుటుంబం దుఃఖంలో మునిగిపోయింది. గాయత్రి కూతురు సాయితేజస్విని మహానటి సినిమాలో చిన్ననాటి కీర్తిసురేష్ పాత్రలో కనిపించింది. రాజేంద్రప్రసాద్‌కు ఓ కొడుకు బాలాజీ ప్రసాద్‌తో పాటు కూతురు గాయత్రి ఉన్నారు. గాయత్రి ప్రేమ వివాహం చేసుకుంది. పెళ్లి తర్వాత కూతురితో తనకు చాలా రోజుల పాటు మాటలు లేవని ఓ సినిమా వేడుకలో రాజేంద్రప్రసాద్ అన్నాడు. రాజేంద్ర ప్రసాద్ జీవితంలోనే ఎందుకిలా జరిగింది..కన్నీరు మున్నీరుగా.. ! ఈ పాట గురించి చెప్తూ రాజేంద్ర ప్రసాద్ ఎమోషనల్ అయ్యాడు. ఈ పాటను.. తన కూతురు గాయత్రిని ఇంటికి పిలిపించి నాలుగు సార్లు వినిపించాడట. ఈ పాట విని ఇద్దరు కంటతడి పెట్టారట. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య మాటలు అయ్యాయని అలా ఆ పాట తనను మార్చిందని పాట గొప్పతనాన్ని తెలిపాడు. అలా తన కూతురిపై బంధాన్ని వెల్లడించాడు. ఏ అమ్మవారిని అయితే అమ్మగా రాజేంద్రప్రసాద్ భావించారో.. ఆ అమ్మవారికి ఇష్టమైన దసరా రోజులలోనే తన కుమార్తెను కోల్పోవడం ప్రతి ఒక్కరిని బాధిస్తుంది.

ముక్రమ్ జాహ్ స్కూలు వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



● హాజరైన 8వ నిజామ్ ముక్రమ్ జాహ్ సతీమణి ప్రిన్సెస్ అస్రా..

నవతెలంగాణ-ధూల్‌పేట్

8వ నిజామ్ నవాబ్ మీర్ బర్కత్ అలీ ఖాన్ ముక్రమ్ జాహ్ బహదూర్ జయంతి వేడుకలు, ముక్రమ్ జాహ్ స్కూల్ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పురానీ హవేలీలోని ముక్రమ్ జాహ్ స్కూలు క్యాంపస్‌లో జరిగిన ఈ వేడుకలు ముక్రమ్ జాహ్ సతీమణి ప్రిన్సెస్ అస్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుల్తాన్ గాలిబ్ బిన్ అవద్ అల్ ఖాయితీ ఆంగ్ల పుస్తకం 'ది నిజామ్స్ సికందర్ జా నాసిరుద్దౌలా అఫ్జలుద్దౌలా' పుస్తకావిష్కరణ చేశారు. ఈ పుస్తకం ముక్రమ్ జాహ్ ట్రస్టు ఫర్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్ వారు ప్రచురించారు. టర్కియే కౌన్సిల్ జనరల్ ఓర్ హాన్ యల్మాన్ ఓకాన్ ముఖ్య అతిథిగా పాల్గొని, హానరరీ కౌన్సిల్ జర్మనీ అమితా దేశాయిలతో కలిసి 8వ నిజామ్ ముక్రమ్ జాహ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముక్రమ్ దాతృత్వాన్ని, ఆయన విద్యా రంగానికి చేసిన సేవలను కొనియాడారు. 8 ప్యాలెసులతో కూడిన మసరత్ మహల్‌ను పేద, మధ్యతరగతి పిల్లల విద్యాభ్యున్నతికోసం కేటాయించడం ఆయన దాతృత్వానికి నిదర్శనమన్నారు. పురానీ హవేలీ లోని ముక్రమ్ జాహ్ స్కూలు భారతదేశంలోనే బడ్జెట్ స్కూళ్లలో మొదటి స్థానంలో ఉందన్నారు. విద్యార్థులకు చదువులతో పాటు నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని స్కూలు ప్రిన్సిపల్ చెప్పారు. ట్రస్టీ నవాబ్ అబుల్ ఫైజ్ ఖాన్ మాట్లాడు తూ.. విద్యార్థులు మొబైల్ ఫోన్లను సద్వినియోగం చేసు కోవాలన్నారు. విద్యార్థులు ఎన్సీసీ క్యాడెట్ల ప్రదర్శించిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సీనియర్ టీచర్ల సేవలకు గాను మెమొంటోలను అందించారు. నవాబ్ ఫైజ్ బిన్ జంగ్, ప్రిన్సిపాల్ స్కూలు రేఖా వాదే, అకడమిక్ అడ్వయిజర్ తదితరులు పాల్గొన్నారు.

సరిగ్గా నిద్రపోవడం లేదా.?

కొన్నేళ్ల క్రితం నిద్రలేమి అనే ఒక ఆరోగ్య సమస్య ఉంటుందని కూడా బహుశా ఎవరూ ఊహించకపోయి ఉండొచ్చు. కానీ ప్రస్తుతం చాలా మంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారు. కేవలం పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు కూడా ఈ సమస్య బారినపడుతున్నారు. కంటి నిండా నిద్ర లేకుండా ఇబ్బంది పడే వారు ఎంతో మంది ఉన్నారు. ఇక మనిషికి ఆహారం ఎంత ముఖ్యమో, నిద్ర కూడా అంతే ముఖ్యమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సరైన నిద్రలేకపోతే ఎన్నో అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది.

మారిన జీవన విధానం, ఉరుకుల పరుగులతో నిండిన జీవితం, పని ఒత్తిడి, ఆందోళ ఇలా ఎన్నో రకాల కారణంగా నిద్ర నాణ్యత దెబ్బ



తింటుంది. నిద్రలేమి మానసికంగా ఎన్నో సమస్యలకు కారణమవుతుందని తెలిసిందే. అయితే నిద్రలేమి కేవలం మానసిక సమస్యలే కాకుండా పలు శారీరక సమస్యలకు కూడా దారి తీస్తుందని నిపుణులు చెబుతున్నారు. నిద్రలేమి కారణంగా చర్మ సంబంధిత సమస్యలు కూడా వస్తాయని చెబుతున్నారు. ఇంతకీ నిద్రలేమితో తలెత్తే ఆ చర్మ సంబంధిత సమస్యలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

నిద్రలేమి సమస్య కారణంగా ముఖంపై మొటిమలు పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. శారీరక వ్యవస్థల పనితీరు దెబ్బతింటుంది. ఈ కారణంగానే శరీరంలో ఇన్సులిన్ తగ్గుతుంది. అలాగే ఒత్తిడి, కార్టిసాల్ లెవల్స్ పెంచే హార్మోన్స్ ఎక్కువవుతాయి. ఇది చర్మంపై మొటిమలు, ముడతలకు కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ కారణంగా చర్మం సహజత్వం కోల్పోవడంతో పాటు, త్వరగా వృద్ధాప్య ఛాయలు ఏర్పడుతాయి.

నిద్రలేమి కారణంగా కళ్లపై తీవ్ర ప్రభావం పడుతుంది. కళ్లలో మంట, లేదా కళ్ల ఉబ్బడం వంటి సమస్యలు వస్తాయి. సరైన నిద్రలేక పోతే కళ్లకు రక్తప్రసరణ సరిగా జరగదు. దీంతో కళ్ల పొడిబారడం, చిరాకు, దురద వంటివి రావచ్చు. దీర్ఘకాలంలో కళ్ల ఇన్‌ఫెక్షన్స్ బారిన పడి కంటి చూపు తగ్గిపోవచ్చు. అలాగే కళ్ల చుట్టు ఉన్న చర్మం ఉబ్బి వికారంగా మారే అవకాశం ఉంటుంది.

నిద్రలేమి కారణంగా తలెత్తే మరో ప్రధాన సమస్య చర్మంలో తేమ శాతం తగ్గడం. దీంతో చర్మంలో రక్త ప్రసరణ జరగదు. ఈ కారణంగా శరీర భాగాలకు ఆక్సిజన్ సరిగా అందదు. దీంతో కారణంగా చర్మంపై మచ్చలు, రంగు మారడం, చర్మం పెలుసులుగా మారడం వంటి సమస్యలు తప్పవు.


చర్మంపై పగుళ్ల రావడానికి కూడా నిద్రలేమి ఒక కారణంగా చెప్పొచ్చు. నిద్రలేమి కారణంగా తలెత్తే ఒత్తిడి కారణంగా శరీరంలో కార్టిసాల్ హార్మోన్ లెవల్స్ పెరుగుతాయి. ఫలితంగా సెబమ్ ఉత్పత్తి, ఇన్‌ఫ్లమేషన్ పెరిగి చర్మంపై పగుళ్ల ఏర్పడటం, రంధ్రాలు మూసుకుపోవడం వంటి సమస్యలు రావచ్చు. దీనివల్ల మొటిమలతో పాటు, పగుళ్ల కూడా వచ్చే అవకాశాలుంటాయి. ■

భావోద్వేగాలను సానుకూలంగా పెంపొందించుకోవడం అనేది మన జీవితంలో ఎంతో ముఖ్యమైన అంశం. మహిళకు మరీ అవరమైనది. అప్పడే కుటుంబాన్ని, ఉద్యోగాన్ని, సమాజాన్ని సమన్వయం చేసుకోగలుతారు. మన భావోద్వేగాలను గమనించడం, అవి మనపై, ఇతరులపై చూపించే ప్రభావాన్ని అర్థం చేసుకోవడం ద్వారా, మనం ఎమోషనల్ ఇంటెలిజెన్స్ (Emotional Intelligence - EI) లో మెరుగుపడతాం. EI అంటే కేవలం మన భావోద్వేగాలను మాత్రమే కాదు, ఇతరుల భావోద్వేగాలను కూడా గుర్తించి వాటిని సానుకూలం గా నియంత్రించడం లేదా నిర్వహించడం. దీని ప్రాముఖ్యతను మనం ఎంతగానో అర్థం చేసుకోవాలి.

ఎమోషనల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన



EQ (Emotional Quotient) అని కూడా పిలువబడే ఈ భావోద్వేగానుభావం (EI)పై ప్రముఖ సైకాలజిస్ట్ డేనియల్ గోల్మన్ ఎంతో ఆసక్తికరమైన వివరాలు అందించారు. ఆయన రాసిన "Emotional Intelligence" అనే పుస్తకం ప్రపంచవ్యాప్తంగా విరివిగా పాఠకులకు చేరువైంది. ఈ పుస్తకంలో ఆయన భావోద్వేగాలను ఎలా గమనించాలో, వాటిని సానుకూలంగా ఎలా మార్చుకోవాలో, ప్రొఫెషనల్‌తో పాటు వ్యక్తిగత రంగాలలో ఎలా విజయవంతంగా ఉపయోగించుకోవాలో వివరిస్తారు.



సానుకూల ఫలితాలను ఇస్తుంది

EI మన జీవితంలో కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఇది మనం ప్రతి రోజు తీసుకునే నిర్ణయాలను, మన పరస్పర సంబంధాలను, ముఖ్యంగా అనుకోని పరిస్థితులలో మనం ఎలా స్పందించాలో తీర్మానిస్తుంది. ఎక్కువగా EI కలిగిన వ్యక్తులు తమ భావోద్వేగాలను సమర్థవంతంగా నిర్వహించుకోగలుగుతారు. వారిలో స్థిరమైన ఆలోచన, సమాధానపూర్వక నిర్ణయాలు ఉండటం వల్ల impulsive decisions, unnecessary arguments కి తావివ్వరు. ఇది వ్యక్తిగత, ప్రొఫెషనల్ సంబంధాలలో సానుకూల ఫలితాలను ఇస్తుంది. తెలుగు సామెత 'నొప్పించక తానొప్పక" అనే పాత మాట EI ప్రధాన భావాన్ని అక్షరాల పాటిస్తుంది. మన భావోద్వేగాలను అదుపులో పెట్టడం, అనవసరంగా ఇతరులను బాధపెట్టకుండా, సానుకూలంగా స్పందించడం అనేది ఈ సామెతతో సరిపోతుంది. ఎవరికీ హానిచేయకుండా, దారుణమైన నిర్ణయాలను తీసుకోకుండా, మన భావోద్వేగాలను అదుపులో పెట్టడం ఎంత ముఖ్యమో ఇది తెలియజేస్తుంది.

ఇతరులు మనల్ని నొప్పించకుండా...


మనం ఇతరులను నొప్పించడం ఎలా నివారించాలో మాత్రమే కాకుండా, ఇతరులు మనల్ని నొప్పించకుండా ఎలా చూసుకోవాలో కూడా చాలా ముఖ్యం. ఆరోగ్యకరమైన సరిహద్దులను కచ్చితంగా నిర్ణయించడం, ఇతరులు మనలను అర్థం చేసుకోవడానికి క్రమంగా పనితీరు చేయడం ఎంతో అవసరం. ఇతరుల నొప్పులను నివారించేందుకు మన భావోద్వేగాలను ఎలా నిర్వహించాలో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యమైంది. ఈ ప్రక్రియలో మనం స్పష్టమైన సరిహద్దులను రూపొందించడం, వాటిని సమర్థవంతంగా వ్యవహరించడం ద్వారా మనకు మేలు చేస్తూ, మన బాధ్యతలను గౌరవించేలా ఇతరులకు సూచనలు చేయడం కీలకం.

సానుకూలంగా మార్చుకోవడంలో...

ప్రజలు సాధారణంగా IQ గురించి ఎక్కువగా మాట్లాడతారు. కానీ EQ కూడా మన జీవితంలో ప్రాధాన్యత కలిగిన అంశం. IQ మన మేధో సామర్థ్యాన్ని సూచిస్తే EQ మన భావోద్వేగాల్ని సక్రమంగా నిర్వహించడాన్ని సూచిస్తుంది. ఒక విజయం సాధించడానికి ఈ రెండు అంశాలు ఒకటిగా పనిచేయాలి. EQ కలిగిన వ్యక్తులు తమ భావోద్వేగాలను అర్థం చేసుకోవడం మాత్రమే కాదు, వాటిని సానుకూలంగా మార్చుకోవడంలో నైపుణ్యం కలిగి ఉంటారు. ఈ కారణంగా వారు తమ వ్యక్తిగత, ప్రొఫెషనల్ జీవితాల్లో మెరుగైన సంబంధాలను ఏర్పరచుకోవడానికి, తమ సామర్థ్యాలను మరింత మెరుగుపరచడానికి సహాయపడతారు.

స్విచ్ లాంటివి

(Emotional Intelligence-EI) కి ముఖ్యంగా ఐదు పిల్లర్స్ ఉన్నాయి. అందులో మొదటిది self-awareness. ఈ పిల్లర్ అత్యంత ముఖ్యమైనది. ఇది మన భావోద్వేగాలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం. ఈ పరిజ్ఞానం మనకు మన సొంత భావోద్వేగాలు ఏవీ, అవి ఎప్పుడూ, ఎట్లా మెలగుతున్నాయో అర్థం చేసుకోవడానికి సహాయం చేస్తుంది. ఈ పిల్లర్‌లో మరీ ముఖ్యమైన అంశం triggers గురించి అవగాహన కలిగి ఉండటం. triggers అనేవి మన భావోద్వేగాలను సడలించే స్విచ్ లాంటివి. కొన్ని సందర్భాలలో ఏదైనా మాట, సంఘటన, లేదా ప్రవర్తన triggersగా మారవచ్చు. అవి "ON" అయితే మన భావోద్వేగాలు ఎక్కువ అవుతాయి. అవి మన నిర్ణయాలను, ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు, మనం కొన్ని అసహనపూర్వక మాటల వలన ఆవేశపడిపోవచ్చు. అది మన దగ్గర ఉన్న వ్యక్తులపై మన మాటలు తీవ్ర ప్రభావం చూపిస్తాయి. ఇలాంటి సందర్భాలలో triggers ని గమనించడం, వాటిని నియంత్రించడం చాలా ముఖ్యం.



నిర్ణయాలపై ప్రభావం

Triggers ఏవైనా అనవసరమైన గొడవలకు, మన సంబంధాలపై దీర్ఘకాలిక ప్రభావాలకు దారి తీస్తాయి. అందువల్ల triggers ని అర్థం చేసుకొని వాటిని నియంత్రించడం ద్వారా, మనం భావోద్వేగాలను సానుకూలంగా మలుచుకోవచ్చు. కనుక ఈరోజే మీరు మీ triggers ఏవీ అన్నిటిని గుర్తించండి. కొన్ని సందర్భాలలో triggers మన చుట్టూ ఉన్న వ్యక్తులను బాధపెట్టవచ్చు, కొన్నిసార్లు మన నిర్ణయాలపై ప్రభావం చూపవచ్చు. మీరు మీ triggers ని గమనించటం ప్రారంభిస్తే వాటి ప్రభావాన్ని తగ్గించడానికి, వాటిని నియంత్రించడానికి సరైన మార్గాలు కనుగొనవచ్చు. వచ్చే వారం మనం overwhelming emotions ని ఎలా సమన్వయం చెయ్యాలో, వాటిని సానుకూలంగా ఎలా వినియోగించుకోవాలో తెలుసుకుందాం. ఆ వరకు సెలవు. ఈ వ్యాసం మీకు నచ్చేవుంటుంది అనుకుంటున్నాను. ■

Dr.Prathusha. Nerella
MD(General Medicine) CCEBDM; CCGDM; NLP; FID
Senior General Physician
Positive Psychologist certified Nutritionist
Diabetes And Lifestyle Expert
Pranic Healer Chiief Holistic Health Consultant And Medical Director @ Praveha General, Diabetes And Lifestyle Clinic - A Holistic Centre With Integrated Approach.
Ph: 8897684912/040-49950314



వాంగ్‌చుక్ నిరవధిక దీక్ష

న్యూఢిల్లీ : వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌ఛుక్, ఆయన మద్దతుదారులు ఆదివారం దేశ రాజధానిలో నిరవధిక దీక్షను చేపట్టారు. దీక్షకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుచెప్పినప్పటికీ వారంతా అందుకు సిద్ధపడ్డారు. గత నాలుగు రోజులుగా తమను నిర్బంధించిన లడఖ్ భవన్‌లోనే దీక్ష ప్రారంభించామని వాంగ్‌ఛుక్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపారు. తామంతా 70 ఏండ్ల పైబడిన వారమేనని, మహిళలతో సహా అనేక మంది 32 రోజుల పాటు వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర చేసి లెహ్ నుంచి ఢిల్లీ చేరుకున్నామని ఆయన వివరించారు. గాంధీజీ చూపిన మార్గాన్ని అనుసరించేందుకు ఆయన దేశంలోనే ఎందుకు ఇబ్బందులు వస్తున్నాయని ప్రశ్నించారు. లడఖ్‌లో ఆరో షెడ్యూల్ అమలు సహా వివిధ అంశాలపై ప్రధాని, రాష్ట్రపతి లేదా హోం మంత్రితో చర్చించేందుకు తేదీలను నిర్ణయించాల్సిందిగా వాంగ్‌ఛుక్, ఇతర కార్యకర్తలు ప్రభుత్వానికి సమాచారం పంపారు. అయితే ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో నిరవధిక దీక్ష చేపట్టాలని నిర్ణయించారు. కనీసం ఒక నాయకుడితో అయినా సమావేశం అవుతామని హోం మంత్రిత్వ శాఖ హామీ ఇవ్వడంతో వాంగ్‌ఛుక్ బృందం ఈ నెల 2వ తేదీన రాజ్‌ఘాట్‌లో 48 గంటల దీక్షను విరమించింది. అయితే ఆ తర్వాత ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో దీక్షను తిరిగి ప్రారంభించాలని వాతావరణ కార్యకర్తలు నిర్ణయించారు. దీక్షకు అనుమతి నిరాకరిస్తూ ఆదివారం ఉదయమే వాంగ్‌ఛుక్‌కు లేఖ అందింది. 'జంతర్ మంతర్‌లో దీక్షకు అనుమతించకపోతే వేరే ప్రదేశాన్ని చూపాలని కోరాం. అన్ని చట్టాలకు కట్టుబడి ఉంటామని చెప్పాం. శాంతియుతంగా తమ సమస్యలు చెప్పుకుంటామని అన్నాం. అలాంటప్పుడు గాంధీ మార్గాన్ని అనుసరించడానికి ఆయన దేశంలోనే ఎందుకు ఇబ్బంది వస్తుంది?' అని వాంగ్‌ఛుక్ ప్రశ్నించారు.

మసీదుపై ఇజ్రాయిల్ బాంబుల వర్షం

గాజా స్ట్రిప్ : సెంట్రల్ గాజాలో ఓ మసీదుపై ఆదివారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ దళాలు విరుచుకుపడ్డాయి. ఈ దాడిలో 26 మంది మరణించగా, పలువురికి గాయాలయ్యాయని గాజా పౌర రక్షణ సంస్థ తెలిపింది. డెయిర్ అల్ -బలాహ్ పట్టణంలోని అల్-అక్సా అమరవీరుల ఆస్పత్రికి సమీపంలో ఉన్న ఈ మసీదు ఇటీవల శరణార్థి శిబిరంగా మారిందని, వందలాది మంది ఆశ్రయం పొందుతున్నారని గాజా పౌర రక్షణ సంస్థ ప్రతినిధి మహముద్ బస్సాల్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ దళాలు బాంబులతో మసీదుపై దాడి చేశాయని అన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ప్రత్యక్ష సాక్ష్యులు పేర్కొన్నారు.

ఈ దాడిపై ఇజ్రాయిల్ సైన్యం ఓ ప్రకటన విడుదల చేసింది. డెయిర్ అల్ -బలాహ్ ప్రాంతంలో గతంలో షుహాద్ అల్-అక్సా మసీదుగా ఉన్న నిర్మాణంలో హమాస్ ఉగ్రవాదులు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహిస్తున్నారని, వారి లక్ష్యంగా దాడి జరిపినట్టు ఆ ప్రకటనలో పేర్కొంది.పాలస్తీనాపై ఇజ్రాయిల్ నరమేధం.. ఏడాది మార్క్‌కు చేరుకోనుంది. ఇజ్రాయిల్ దాడులకు ప్రతిదాడిగా అక్టోబర్ ఏడున హమాస్ ఇజ్రాయిల్‌పై దాడి జరిపింది. అప్పటి నుండి ఇజ్రాయిల్ గాజా, వెస్ట్‌బ్యాంక్‌పై విరుచుకుపడుతోంది. ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడిలో 42వేల మంది పాలస్తీనియన్లు మరణించినట్టు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది.

జిల్లా గ్రంథాలయ సంస్థలకు చైర్మెన్లు

(మొదటిపేజి తరువాయి)

జారీ చేసింది.

నిర్మల్- సయ్యద్ అర్జుమంద్ అలీ
సిరిసిల్ల- నాగుల సత్యనారాయణ గౌడ్
కరీంనగర్- సత్తు మల్లయ్య
రంగారెడ్డి- ఎలుగంటి మధుసూధన్ రెడ్డి
వనపర్తి - జి. గోవర్ధన్
సంగారెడ్డి- గొల్ల అంజయ్య
కామారెడ్డి- మద్ది చంద్రకాంత్ రెడ్డి
మెదక్- సుహాసిని రెడ్డి
నారాయణ్‌పేట్ - వరాల విజయ్ కుమార్
నాగర్ కర్నూల్ - జి. రాజేందర్
వికారాబాద్- శేరి రాజేశ్ రెడ్డి
మహబూబ్‌నగర్- మల్లు నరసింహారెడ్డి
జోగులాంబ గద్వాల- నీలి శ్రీనివాసులు

దేశానికే రోల్ మోడల్‌గా కొత్త రెవెన్యూ చట్టం

(మొదటిపేజి తరువాయి)

తీసుకుని కొత్త చట్టాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. ధరణి పోర్టల్, ఆర్వోఆర్ చట్టం-2020 వల్ల సామాన్య ప్రజలు, రైతులు ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. ఒక్క తిరుమలగిరి మండలంలో 4,380 ఎకరాల్లో సర్వే నిర్వహిస్తే 1,300 ఎకరాల్లో మోఖా మీద లేని వారికి పాసు బుక్కులు ఉన్నాయనే విషయం బహిర్గతమయిందని వివరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఏ మాత్రం రాజీ పడొద్దని వారికి సూచించారు. వాటి పరిరక్షణ కోసం రికార్డుల డిజిటలైజేషన్ చేపట్టనున్నట్టు వెల్లడించారు. రెవెన్యూ ఉద్యోగులకు సంబంధించి జాబ్ చార్ట్ రూపొందించాలనీ, ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఉద్యోగుల సమస్యలకు సంబంధించి ఆర్థికేతర అంశాలను తక్షణమే పరిష్కరించనున్నట్టు తెలిపారు. 33 జిల్లాల్లోని సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను సృష్టిస్తామని పేర్కొన్నారు. అలాగే 17 మంది రెవెన్యూ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లను పూర్వ స్థానాలకు బదిలీ చేయడానికి దసరాలోపే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలను పెంచిన గత ప్రభుత్వం మౌలిక సదుపాయాలను విస్మరించిందన్నారు. రెవెన్యూ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ గత తొమ్మిది నెలల్లో దాదాపు 3.50 లక్షల ధరణి దరఖాస్తులను పరిష్కరించామన్నారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిప్యూటీ కలెక్టర్లు, అసోసియేషన్ అధ్యక్షులు వి. లచ్చిరెడ్డి, కే. చంద్రమోహన్, ట్రెసా అధ్యక్షులు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముంబయిలో ఏడుగురు సజీవ సమాధి

ముంబయి: ముంబయిలోని రెండంతస్తుల షాప్ కమ్ రెసిడెన్షియల్ స్ట్రక్చర్‌లో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడేండ్ల బాలికతో సహా ఏడుగురు మృతి చెందినట్టు అగ్నిమాపక అధికారి తెలిపారు. చెంబూర్ ప్రాంతంలోని సిద్ధార్థ్ కాలనీలో తెల్లవారుజామున 5.20 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుందని తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక దుకాణాన్ని కలిగి ఉండగా, పైఅంతస్తును నివాసంగా ఉపయోగించినట్టు అధికారి తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని షాపులోని ఎలక్ట్రిక్ వైరింగ్, ఇన్‌స్టాలేషన్‌లకు మంటలు చెలరేగాయి. ఇవి పై అంతస్తుకు వ్యాపించాయని అధికారులు తెలిపారు. బాధితులను ప్రభుత్వ నిర్వహణలోని రాజవాడి ఆస్పత్రికి తరలించారు.

ఘటనాస్థలికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులు వివరించారు. క్షతగాత్రులకు వైద్యసేవలందించాలని ఆదేశించారు. బంధువుల్ని కోల్పోయిన కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య

(మొదటిపేజి తరువాయి)



స్కూళ్ల కాంప్లెక్స్‌ల అంశంపై ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి, పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం భట్టి మాట్లాడుతూ రూ. ఐదు వేల కోట్లతో ఈ ఏడాది ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. దసరా పండుగకు ముందు రోజు (శుక్రవారం) రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల నిర్మాణ పనులకు భూమి పూజ చేయనున్నట్టు ప్రకటించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం ఒక చారిత్రాత్మకమైందని చెప్పారు. ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా ప్రపంచంతో పోటీపడేలా కావల్సిన నిధులు కేటాయించి విద్యపై దృష్టి పెడతామని చెప్పామని గుర్తు చేస్తూ.. ఆ మేరకు పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. 20 నుంచి 25 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటర్ వరకు విద్యనందించనున్నట్టు చెప్పారు.

కళ్యాణ మండపాలు.. అద్దెభవనాల్లో విద్యార్థుల ఇబ్బందులు..

రాష్ట్రంలో చాలా రెసిడెన్షియల్ కళాశాలలకు పక్కాభవనాలు లేవన్నారు. దీంతో కళ్యాణ మండపాలు, అద్దె భవనాల్లో ఉంటూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 1023 రెసిడెన్షియల్ పాఠశాలలుండగా ఇందులో 662 పాఠశాలలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. బీసీ వెల్ఫేర్‌లో 327 రెసిడెన్షియల్ పాఠశాలలుంటే.. అందులో 306 అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయని చెప్పారు. సోషల్ వెల్ఫేర్‌లో 268కిగాను 135, ఎస్టీ రెసిడెన్షియల్‌లో 188కి 42, మైనార్టీలో 205కి 135 అద్దె భవనాలేనని తెలిపారు. బలహీన వర్గాలకు ప్రాథమిక స్థాయి నుంచే నాణ్యమైన విద్య అందించాలని ఇందిరమ్మ ప్రభుత్వ నిర్ణయించిందని చెప్పారు. ఈ ఒక్క ఏడాదిలోనే తమ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలపై రూ. ఐదు వేల కోట్లు ఖర్చు చేయబోతుందనీ, గత ప్రభుత్వం ఒక ఏడాదిలో కేవలం రూ. 73 కోట్లు మాత్రమే కేటాయించిందని గుర్తు చేశారు.

దసరాకు ముందు రోజే భూమి పూజ..

ఇప్పటివరకు 25 నియోజకవర్గాల నుంచి ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి కావాల్సిన భూమి ఇతర వివరాలు సేకరించామని డిప్యూటీ సీఎం చెప్పారు. వాటిని పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించి దసరాకు ముందు రోజే భూమి పూజ చేయనున్నట్టు ప్రకటించారు. మిగిలిన నియోజకవర్గాల నుంచి వచ్చే సమాచారం ఆధారంగా నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. కొన్నేండ్లుగా ఆయా నియోజకవర్గాల్లో ఉండే ఉష్ణోగ్రతలు, గాలి వాటం, వాతావరణ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని ఆధునిక రెసిడెన్షియల్ భవనాల నిర్మాణం జరుగుతుందని చెప్పారు. గ్రీన్ ఎనర్జీని వినియోగించుకోవటంతో పాటు అన్ని వర్గాల వారు కలిసి ఒక చోట ఓ కుటుంబంలా చదువుకునే విధంగా భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. కేవలం చదువుల పేరిట ఒత్తిడి సృష్టించే వాతావరణం కాకుండా క్రీడలు, వినోదం వంటివి విద్యార్థులకు అందిస్తామన్నారు. విద్యార్థులకు ఏ కొరత లేకుండా చూసే కార్యక్రమంలో భాగంగా థియేటర్ నిర్మించి శాటిలైట్ ద్వారా సినిమాలు సైతం ప్రదర్శించే ఆలోచనలో ఉన్నామన్నారు. పేద వర్గాల వారు వారి బిడ్డలను ఈ పాఠశాలల్లో చేర్పించి విరివిగా ప్రచారం నిర్వహించాలని కోరారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇదో విప్లవాత్మక నిర్ణయమన్నారు. వచ్చే ఏడాది దసరా నాటికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు అమల్లోకి తీసుకురావాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందని ఆయన తెలిపారు. ఇప్పటికే ఉన్న పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు.

మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఆరు లక్షల మంది విద్యార్థులకే కాదు.. రాష్ట్ర ప్రజలందరికీ దసరా కానుక అని చెప్పారు. ఇప్పుడున్న రెసిడెన్షియల్లో ఒక రూములో 20 మంది ఉంటున్నారనీ, వారికి సరిపడా టాయిలెట్స్, ఇతర సౌకర్యాలు లేవని ఫిర్యాదులొస్తున్నాయని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు కనీసం ఈ అంశంలోనైనా సానుకూలంగా స్పందించాలని సూచించారు.

భోపాల్‌లో రూ.1800 కోట్ల డ్రగ్స్ సీజ్

భోపాల్ : బీజేపీ పాలిత రాష్ట్రాల్లో డ్రగ్స్ దందా జోరుగా సాగుతోంది. యూపీ,గుజరాత్‌తో పాటు ఇపుడు మధ్యప్రదేశ్‌లో కోట్లు విలువ చేసే మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఓ ఫ్యాక్టరీ నుంచి పట్టుకున్న ఎండి డ్రగ్స్, ముడిసరుకు విలువ రూ. 1,814 కోట్ల వరకు ఉంటుందని గుజరాత్ హెూంశాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘ్వీ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారని అన్నారు. ఎండి మందులు ల్యాబ్‌లో తయారు చేయబడిన మందులు, ఇవి డ్రగ్స్ లాంటి ప్రభావాన్ని కలిగి ఉంటాయి. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ సమీపంలో ఆదివారం ఈ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) , నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ), ఢిల్లీ సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను నిర్వహించాయని ఆయన పేర్కొన్నారు.డ్రగ్స్‌పై పోరాటంలో భారీ విజయాన్ని సాధించిన గుజరాత్ ఏటీఎస్ ,ఎన్‌సీబీ(ఓపీఎస్) అధికారులకు ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు. బీజేపీయేతర రాష్ట్రాల్లో డ్రగ్స్‌పై కేంద్రహెూంశాఖ గట్టిగా నిలదీస్తోంది. కానీ డబుల్ ఇంజిన్ సర్కార్లు ఉన్న బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మత్తు పదార్థాలు యథేచ్ఛగా పారుతున్నా గమ్మున ఉండటం గమనార్హం.



కేసీఆర్ ఎక్కడ..వెతికి పెట్టండి!

(మొదటిపేజి తరువాయి)

తదితరులు ఫిర్యాదు చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ సైదాకు వారు ఆదివారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సమీపంలో వారు మీడియాతో మాట్లాడుతూ.. గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుంచి మూడుసార్లు గెలిపించి అసెంబ్లీకి పంపించామని, అయినా ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. కనీసం ప్రజల కన్నా కనిపిస్తే బాగుంటుందని తెలిపారు. శాసనసభ పక్ష నేతగా కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాల్సింది పోయి వ్యవసాయక్షేత్రంలో తలదాచుకుంటున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో అనేక సమస్యలతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారని వాటిని పరిష్కరించడానికి ఎమ్మెల్యే బయటకు రావాలని కోరారు.

ఎక్కడి పనులు అక్కడే

గజ్వేల్ నియోజకవర్గంలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని తెలిపారు. పేదలకు సంబంధించిన షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులు 900 వరకు పెండింగ్‌లో ఉన్నాయని, ఎమ్మెల్యే రాకపోవడంతో పంపిణీ కాకుండా సంబంధిత శాఖ అధికారులు తమ దగ్గర పెట్టుకున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్థానిక ఎమ్మెల్యే ద్వారానే వీటిని ప్రజలకు అందించాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ విడిచి బయటకు రావడంలేదని, కేసీఆర్ అసలు ఎక్కడున్నారని ప్రశ్నిస్తున్నారు. స్థానిక పోలీసులు వెతికి గజ్వేల్ ప్రజలకు సమాచారం ఇవ్వాలని, ఒకవేళ పోలీసులకు చిక్కకపోతే తామే వెతికి ప్రజలకు అప్పగిస్తామన్నారు.

పట్టణంలో 23 కిలోమీటర్ల రింగ్ రోడ్డు ఇంకా పూర్తి కాలేదని చెప్పారు. స్థానిక కోట మైసమ్మ రోడ్డు అర్ధాంతంగా నిలిచిపోయిందని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇంకా పంపిణీ కాలేదని అన్నారు. ఇటు ప్రజల్లోగాని, అటు పత్రికల్లో గాని కేసీఆర్ కనిపించకపోవడంతో నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మూడోసారి గెలిచిన కేసీఆర్.. గజ్వేల్ ప్రజలకు ముఖం చూపించడం లేదని, 28 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని అందమైన భవనం నిర్మించుకున్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంకు కూడా ఆయన రాకపోవడం విచారకరమన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని అధికారుల వద్దకు వెళ్తే ఎమ్మెల్యే ద్వారా ప్రతిపాదనలు రావాలని అధికారులు చెబుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల అధ్యక్షులు మల్లారెడ్డి, నాయకులు గోపాల్ రావు, వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కోచ్‌గా పీఆర్ శ్రీజేష్

న్యూఢిల్లీ : భారత హాకీ దిగ్గజం పీఆర్ శ్రీజేష్ కొత్త అవతారం ఎత్తనున్నాడు. సుల్తాన్ జోహర్ కప్‌లో పోటీపడే భారత అండర్-21 జట్టుకు పీఆర్ శ్రీజేష్ చీఫ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఈ మేరకు హాకీ ఇండియా ఓ ప్రకటనలో తెలిపింది. అక్టోబర్ 19 నుంచి మలేషియాలో ఈ టోర్నీ జరుగనుంది.తొలి రోజు జపాన్‌తో తలపడనున్న భారత్.. ఆ తర్వాత వరుసగా గ్రేట్ బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, మలేషియాలతో ఢీకొట్టనుంది. భారత జట్టుకు ఆమిర్ అలీ కెప్టెన్, రోహిత్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. పీఆర్ శ్రీజేష్ ఇటీవల పారిస్ ఒలింపిక్స్ తర్వాత ఆటకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే.



ఎంపికలో మనాలో మార్క్!

న్యూఢిల్లీ : భారత ఫుట్‌బాల్ చీఫ్ కోచ్ మనాలో మార్క్వెజ్ టీమ్ సెలక్షన్‌లో తన మార్క్ చూపిస్తున్నారు. ఈ నెల 12న వియత్నాంతో జరుగనున్న ఫ్రెండ్లీ మ్యాచ్‌ను భారత జట్టును ఆదివారం ప్రకటించారు. మిడ్‌ఫీల్డర్లు అనిరుధ్ తాప, సహల్ అబ్దుల్ సమద్, నందకుమార్ శేఖర్‌లకు జట్టులో చోటు దక్కలేదు. యువ ఆటగాళ్లకు చోటు కల్పించిన మార్క్వెజ్.. ఉత్తమ ఆటగాళ్లే జట్టులో ఉన్నారని తెలిపారు. ముక్కోణపు సిరీస్ నుంచి లెబనాన్ తప్పుకోవటంతో.. వియత్నాం, భారత్‌లు ఓ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడనున్నాయి.



హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ అరుంధతి రెడ్డి అదరగొట్టింది. దుబాయ్ స్లో వికెట్‌పై పాకిస్థాన్ బ్యాటర్ల భరతం పట్టింది. మూడు వికెట్లతో నిప్పులు చెరిగిన అరుంధతి రెడ్డి..ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియాకు తొలి విజయాన్ని అందించింది. భారత పేసర్లు, స్పిన్నర్ల మెరుపులతో పాకిస్థాన్ 105 పరుగులే చేయగా.. కఠిన పరిస్థితుల్లో స్వల్ప లక్ష్యాన్ని భారత్ 18.5 ఓవర్లలోనే ఛేదించింది.

అరుంధతి అదరహో

- మూడు వికెట్లతో మెరిసిన హైదరాబాదీ
- పాకిస్థాన్‌పై భారత్ అలవోక విజయం

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్

దుబాయ్ (యుఎఈ)

చావోరేవో తేల్చుకోవాల్సిన సమరంలో టీమ్ ఇండియా అమ్మాయిలు అలవోక విజయం నమోదు చేశారు. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 6 వికెట్ల తేడాతో సాధికారిక విజయం సాధించింది. ఛేదనలో ఓపెనర్ షెఫాలీ వర్మ (32, 35 బంతుల్లో 3 ఫోర్లు) బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో కదం తొక్కగా.. జెమీమా రొడ్రిగస్ (23, 28 బంతుల్లో), హర్మన్‌ప్రీత్ కౌర్ (29, 24 బంతుల్లో 1 ఫోర్) సమయోచిత ఇన్నింగ్స్‌లతో రాణించారు. 18.5 ఓవర్లలో 108 పరుగులు చేసిన భారత్ గ్రూప్ దశలో తొలి విజయం నమోదు చేసింది. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ మహిళలు 20 ఓవర్లలో 8 వికెట్లకు 105 పరుగులు చేశారు. నిదా దార్ (28, 34 బంతుల్లో 1 ఫోర్), మునీబా అలీ (17, 26 బంతుల్లో 2 ఫోర్లు), ఫాతిమా సనా (13, 8 బంతుల్లో 2 ఫోర్లు), సయిదా (14 నాటౌట్) రాణించారు. హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డి (3/19), స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ (2/12) పాకిస్థాన్ బ్యాటర్లను కట్టడి చేశారు. అరుంధతి రెడ్డి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. గ్రూప్-ఏలో భారత్ బుధవారం శ్రీలంకతో తలపడనుంది. రెండు మ్యాచుల్లో ఓ విజయం సాధించిన టీమ్ ఇండియా.. పాయింట్ల పట్టికలో నాల్గో స్థానంలో ఉంది.



కష్టమైనా.. ఛేదించారు

106 పరుగుల లక్ష్య ఛేదన టీమ్ ఇండియాకు కఠిన సవాల్ విసిరింది. పవర్‌ప్లేలో భారత్ దూకుడు మంత్ర నుంచి బయటికొచ్చి ఆడింది. స్మృతీ మంధాన (7) ఆరంభంలోనే అవుటవగా.. భారత్‌పై ఒత్తిడి పడింది. యువ ఓపెనర్ షెఫాలీ వర్మ (32) సహజశైలికి భిన్నంగా ఆడింది. స్లో అవుట్‌ఫీల్డ్‌పై బౌండరీలు రావటం గగనమైంది. జెమీమా రొడ్రిగస్ (23), షెఫాలీ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేశారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (29)తో కలిసి జెమీమా మరో కీలక భాగస్వామ్యంలో భాగమైంది. ఈ ఇద్దరు క్రీజులో నిలువగా భారత్ గెలుపు లాంఛనం చేసుకుంది. ఆఖర్లో హర్మన్‌ప్రీత్ రిటైర్డ్‌హర్ట్‌గా నిష్క్రమించగా.. దీప్తి శర్మ (7 నాటౌట్), సజన (4 నాటౌట్) లాంఛనం ముగించారు. 18.5 ఓవర్లలోనే భారత్ 108 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. పాకిస్థాన్ బౌలర్లు చక్కగా బౌలింగ్ చేశారు. లైన్ అండ్ లెంగ్త్ తప్పకుండా బంతులు సంధించటంతో పరుగుల వేట కష్టమైంది. వికెట్ల మధ్య పరుగుతోనే భారత్ ఎక్కువగా పరుగులు చేసింది. పాక్ పేసర్ ఫాతిమా సనా (2/23) రెండు వికెట్లతో మెరిసింది.

అరుంధతి నిప్పులు

టాస్ నెగ్గిన పాకిస్థాన్ అమ్మాయిలు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నారు. ఓపెనర్ మునీబా అలీ (17) దూకుడుగా బ్యాటింగ్ చేసింది. కానీ రేణుక సింగ్ తొలి ఓవర్లోనే బ్రేక్ సాధించింది. దీప్తి శర్మ పవర్‌ప్లేలోనే సిద్ర (8)ను సాగనంపింది. ఆరు ఓవర్లలో 29/2తో నిలిచిన పాకిస్థాన్‌ను పేసర్ అరుంధతి రెడ్డి పుంజుకోనివ్వలేదు. నిప్పులు చెరిగే బంతులతో మూడు కీలక వికెట్లు పడగొట్టింది. పాకిస్థాన్‌కు కోలుకునే అవకాశం ఇవ్వలేదు. మిడిల్ ఆర్డర్‌లో టాప్ ఆర్డర్‌లో మునీబా, నిదా దార్ (28) మాత్రమే ఓ మోస్తరు పరుగులు చేశారు. డెత్ ఓవర్లలో ఫాతిమా (13), సయిదా (14) మెరుపులతో పాకిస్థాన్ 100 పరుగుల మార్క్ దాటగలిగింది. భారత పేసర్లు, స్పిన్నర్లు సమిష్టిగా మెరవటంతో పాకిస్థాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 105 పరుగులకే పరిమితం అయ్యింది. స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ రెండు వికెట్లు పడగొట్టగా.. రేణుక సింగ్, దీప్తి శర్మ, ఆశ శోభన తలా ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

స్కోరు వివరాలు :

పాకిస్థాన్ మహిళల ఇన్నింగ్స్ : మునీబా (స్టంప్డ్) రిచా (బి) శ్రేయాంక 17, ఫెరోజా (బి) రేణుక 0, సిద్ర (బి) దీప్తి , ఓమిమా (సి) షెఫాలీ (బి) అరుంధతి 3, నిదా (బి) అరుంధతి 4, అలియా (ఎల్బీ) అరుంధతి 4, ఫాతిమా (సి) రిచా (బి) శోభన 13, ట్యూబా (సి) షెఫాలీ (బి) శ్రేయాంక 0, సయిదా నాటౌట్ 14, నష్ర నాటౌట్ 6, ఎక్స్‌ట్రాలు :12, **మొత్తం :** (20 ఓవర్లలో 8 వికెట్లకు) 105.

వికెట్ల పతనం : 1-1, 2-25, 3-33, 4-41, 5-52, 6-70, 7-71, 8-99.

బౌలింగ్ : రేణుక సింగ్ 4-0-23-1, దీప్తి శర్మ 4-0-24-1, అరుంధతి రెడ్డి 4-0-19-3, శ్రేయాంక పాటిల్ 41-12-2, ఆశా శోభన 4-0-24-1.

భారత మహిళల ఇన్నింగ్స్ : షెఫాలీ (సి) అలియా (బి) ఒమిమా 32, మంధాన (సి) ట్యూబా (బి) సదియా 7, జెమీమా (సి) మునీబా (బి) ఫాతిమా 23, హర్మన్‌ప్రీత్ (రిటైర్డ్‌హర్ట్) 29, రిచా (సి) మునీబా (బి) ఫాతిమా 0, దీప్తి నాటౌట్ 7, సజన నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు :6, **మొత్తం :**(18.5 ఓవర్లలో 4 వికెట్లకు) 108.

వికెట్ల పతనం : 1-18, 2-61, 3-80, 4-80.

బౌలింగ్ : ఫాతిమా 4-0-23-2, సదియా 4-0-23-1, నిదా 1.5-0-10-0, ఒమిమా 3-0-17-1, నష్ర 4-0-21-0, ట్యూబా 2-0-14-0.

బోణీ అదిరింది

- విజృంభించిన అర్షదీప్, వరుణ్
- రాణించిన సూర్య, సంజు, హార్దిక్

తొలి టీ20లో బంగ్లాపై భారత్ ఘన విజయం



గ్వాలియర్‌లో టీమ్ ఇండియా రెచ్చిపోయింది. బంతితో, బ్యాట్‌తో చెలరేగిన సూర్యసేన బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి మూడు వికెట్ల మ్యాజిక్‌తో బంగ్లాదేశ్ ఆట కట్టించారు. స్వల్ప ఛేదనలో సూర్యకుమార్, సంజు శాంసన్, హార్దిక్ పాండ్య ఆడుతూ పాడుతూ దంచికొట్టారు. టీ20 సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది.

నవతెలంగాణ-గ్వాలియర్

కుర్రాళ్లు కదం తొక్కగా తొలి టీ20లో బంగ్లాదేశ్‌పై భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 128 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ 11.5 ఓవర్లలోనే ఊదేసింది. హార్దిక్ పాండ్య (39 నాటౌట్, 16 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు), సూర్య కుమార్ యాదవ్ (29, 14 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు), సంజు శాంసన్ (29, 19 బంతుల్లో 6 ఫోర్లు) ఛేదనలో చెలరేగారు. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 19.5 ఓవర్లలో 127 పరుగులకు కుప్పకూలింది. ఆల్‌రౌండర్ మెహిది హసన్ మిరాజ్ (35 నాటౌట్, 32 బంతుల్లో 3 ఫోర్లు), కెప్టెన్ నజ్ముల్ శాంటో (27, 25 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. పేసర్ అర్షదీప్ సింగ్ (3/19), స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (3/31) మూడేసి వికెట్లతో విజృంభించారు. భారత్, బంగ్లాదేశ్ రెండో టీ20 బుధవారం న్యూఢిల్లీలో జరుగనుంది.



ఆడుతూ పాడుతూ

స్వల్ప లక్ష్యాన్ని టీమ్ ఇండియా ఊదేసింది. ధనాధన్ దంచికొట్టిన బ్యాటర్లు అలవోకగా పరుగులు పిండుకున్నారు. కుర్ర ఓపెనర్ అభిషేక్ శర్మ (16, 7 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఆరంభంలోనే దడ పుట్టించాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (29) తనదైన ఇన్నింగ్స్ నమోదు చేశాడు. మూడు సిక్సర్లు, రెండు ఫోర్లతో చెలరేగిన సూర్యకుమార్ యాదవ్.. లక్ష్య ఛేదన సులభతరం చేశాడు. ఓపెనర్ సంజు శాంసన్ (29) బాధ్యతాయుతంగా ఆడాడు. హార్దిక్ పాండ్య (39 నాటౌట్) వచ్చీ రాగానే ఉతుకుడు మొదలెట్టాడు. తొలి బంతినే బౌండరీగా బాదిన హార్దిక్ అదే జోరు కొనసాగించాడు. ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో వీర విహారం చేశాడు. తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి (16 నాటౌట్) ఆకట్టుకున్నాడు. హార్దిక్ దంచుడుతో 11.5 ఓవర్లలోనే 132 పరుగులు చేసిన భారత్ మరో 49 బంతులు మిగిలి ఉండగానే లాంఛనం ముగించింది.

బంగ్లా ధమాల్

టాస్ నెగ్గిన భారత్ కొత్త పిచ్‌పై బౌలింగ్ ఎంచుకుంది. తొలి బంతి నుంచీ నిప్పులు చెరిగిన అర్షదీప్.. బంగ్లాదేశ్ బ్యాటర్లను హడలెత్తించాడు. ఓపెనర్లు లిటన్ దాస్ (4), పర్వేజ్ (8)లను అర్షదీప్ పవర్‌ప్లేలోనే సాగనంపాడు. ఆరు ఓవర్లలో బంగ్లా 39/2తో ఒత్తిడిలో పడింది. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మాయ చేశాడు. కెప్టెన్ నజ్ముల్ శాంటో (27) ఓ ఎండ్‌లో నిలిచినా పరుగుల వేటలో వేగం లోపించింది. తౌహిద్ (12), జేకర్ అలీ (8), రిషద్ (11)లను అవుట్ చేసిన వరుణ్ బంగ్లాను చావుదెబ్బ తీశాడు. ఆల్‌రౌండర్ మెహిది మిరాజ్ (35 నాటౌట్) మెరుపులతో బంగ్లాదేశ్ గౌరవప్రద స్కోరు చేసింది. మూడు ఫోర్లతో మెరిసిన మిరాజ్.. టెయిలెండర్లతో కలిసి పోరాడాడు. క్రమ తప్పకుండా వికెట్లు పడగొట్టిన భారత్ ఏ దశలోనూ బంగ్లాదేశ్‌కు పుంజుకునే అవకాశం ఇవ్వలేదు. 19.5 ఓవర్లలో 127 పరుగులకు బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ ముగిసింది. అర్షదీప్, వరుణ్‌లు మూడేసి వికెట్లు పడగొట్టగా.. హార్దిక్, మయాంక్, వాషింగ్టన్‌లు తలా ఓ వికెట్ తీసుకున్నారు. పేస్ సంచలనం మయాంక్ యాదవ్, తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డిలు తొలి టీ20లో అరంగ్రేటం చేశారు.

స్కోరు వివరాలు :

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ : పర్వేజ్ (బి) అర్షదీప్ 8, లిటన్ (సి) రింకూ (బి) అర్షదీప్ 4, నజ్ముల్ (సి,బి) వాషింగ్టన్ 27, తౌహిద్ (సి) హార్దిక్ (బి) వరుణ్ 12, మహ్మదుల్లా (సి) వాషింగ్టన్ (బి) మయాంక్ 1, అలీ (బి) వరుణ్ 8, మిరాజ్ నాటౌట్ 35, రిషద్ (సి) హార్దిక్ (బి) వరుణ్ 11, టస్కిన్ (రనౌట్) 12, ఇస్లాం (బి) హార్దిక్ 0, ముస్తాఫిజుర్ (బి) అర్షదీప్ 1, ఎక్స్‌ట్రాలు : 8, **మొత్తం :** (19.5 ఓవర్లలో ఆలౌట్) 127.

వికెట్ల పతనం : 1-5, 2-14, 3-40, 4-43, 5-57, 6-75, 7-93, 8-116, 9-117, 10-127.

బౌలింగ్ : అర్షదీప్ 3.5-0-14-3, హార్దిక్ 4-0-26-1, వరుణ్ 4-0-31-3, మయాంక్ 4-1-21-1, నితీశ్ 2-0-17-0, వాషింగ్టన్ 2-0-12-1.

భారత్ ఇన్నింగ్స్ : సంజు (సి) రిషద్ (బి) మిరాజ్ 29, అభిషేక్ (రనౌట్) 16, సూర్య (సి) అలీ (బి) ముస్తాఫిజుర్ 29, నితీశ్ నాటౌట్ 16, హార్దిక్ నాటౌట్ 39, ఎక్స్‌ట్రాలు :3, **మొత్తం :** (11.5 ఓవర్లలో 3 వికెట్లకు) 132.

వికెట్ల పతనం : 1-25, 2-65, 3-80.

బౌలింగ్ : ఇస్లాం 2-0-17-0, టస్కిన్ 2.5-0-44-0, ముస్తాఫిజుర్ 3-0-36-1, రిషద్ 3-0-26-0, మిరాజ్ 1-0-7-1.

నవచిత్రం

విశ్వంలో అన్నీ యూనిక్‌గా ఉంటాయి

గోపీచంద్, కావ్యథాపర్ జంటగా శ్రీను వైట్ల దర్శకత్వంలో వస్తున్న చిత్రం 'విశ్వం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. వేణు దోనేపూడి, టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈనెల 11న థియేటర్లలో విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా నాయిక కావ్యథాపర్ మీడియాతో ముచ్చటించారు.



కావ్యా థాపర్

- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఇందులో అన్నీ వైవిధ్యంగా ఉంటాయి. మల్టీపుల్ లొకేషన్స్, నటీనటులు. దాదాపు 16 మంది హాస్యనటీనటులు ఇందులో ఉన్నారు. చైతన్య భరద్వాజ సంగీతం బాగుంది. పాటలు ఇప్పటికే బిగ్ హిట్ అయ్యాయి.
- ఇందులో నా పాత్రని దర్శకుడు చాలా భిన్నంగా డిజైన్ చేశారు. ఇది నాకు పెద్ద చాలెంజింగ్‌గా అనిపించింది. నేను కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా స్టయిలీష్ పాత్ర చేశాను. మోడ్రన్‌గా ఉండే నేటి ట్రెండ్‌కు తగిన అమ్మాయిని.
- ఈ సినిమాకి కథే యూనిక్ పాయింట్. దర్శకుడు శ్రీను వైట్ల తీసిన విధానం యూనిక్. కెవి గుహన్ కెమెరా పనితం యూనిక్. ఇందులో నేను గ్రే తరహా పాత్ర చేశాను. అది కూడా యూనికే. ఒకరకంగా చెప్పాలంటే ఈ సినిమాలో అన్నీ చాలా యూనిక్‌గా ఉంటాయి.
- తొలుత ఈ చిత్రాన్ని చిత్రాలయ బ్యానర్ స్టార్ట్ చేసింది. ఆ తర్వాత పీపుల్స్ మీడియా కలవడంతో రేంజ్ పెరిగింది. నిర్మాణ విలువలు చాలా హైలో ఉన్నాయి.
- గోపీచంద్‌తో నటించటంతో చాలా విషయాలు నేర్చుకున్నా. నేను చాలా ఫాస్ట్‌గా అందరితో చాలా జోవియల్‌గా ఉంటా. కానీ ఆయన మాత్రం చాలా కామ్‌గా ఉంటారు. సెట్‌లో తన పనేదో తాను చేసుకుంటూ వెళ్తారు. దర్శకుడు శ్రీనువైట్ల చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. ఆయన అనుకున్న రీతిలో ఏదైనా సరే రావాల్సిందే. అది వచ్చేంత వరకు ఆయన కాంప్రమైజ్ అవ్వరు. అది నాకు చాలా బాగా నచ్చింది.



రుక్మిణి వసంత్, నిఖిల్


అప్పుడో ఇప్పుడో ఎప్పుడో..

హీరో నిఖిల్, దర్శకుడు సుధీర్ వర్మ కాంబినేషన్‌లో ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్ రూపొందుతోంది. బ్లాక్ బస్టర్ చిత్రాలు 'స్వామి రారా, కేశవ' తర్వాత వీరిద్దరి కాంబోలో రాబోతున్న సినిమా కావటం విశేషం.

శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి తమ 32వ చిత్రంగా దీన్ని రూపొందిస్తోంది. నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. కన్నడ సినీ ఇండస్ట్రీలో మంచి పాపులర్ హీరోయిన్‌గా అందరినీ అలరిస్తోన్న రుక్మిణి వసంత్ ఈ చిత్రంతో తెలుగులోకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తుండటం విశేషం.

మరో నాయిక దివ్యాంశ కౌశిక్ కీలక పాత్రలో నటిస్తోంది. హర్ష చెముడు ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. యోగేష్ సుధాకర్, సునీల్ షా, రాజా సుబ్రమణ్యం ఈ సినిమాకు కో ప్రొడ్యూసర్స్. బాపినీడు.బి ఈ చిత్రానికి సమర్పణ.

తండ్రీకొడుకుల అనుబంధానికి ప్రతీక



సుధీర్ బాబు

సుధీర్ బాబు నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మా నాన్న సూపర్ హీరో'.అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహించగా, సీఏఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి.సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను హీరో మహేష్ బాబు లాంచ్ చేశారు.

పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న సాయిచంద్ డబ్బు కోసం తన కొడుకును అమ్మేయాలనే హృదయాన్ని కదిలించే నిర్ణయం తీసుకున్నాడు. సుధీర్ బాబు తనను తండ్రిలా పెంచిన షాయాజీ షిండేకి అంకితభావంతో ఉన్నాడు. తండ్రి చాలా నిర్లక్ష్యంగా తన పట్ల శ్రద్ధ చూపకపోయినా, కొడుకు తన తండ్రి పట్ల చాలా శ్రద్ధ వహిస్తాడు. అసలు తండ్రి సుధీర్ జీవితంలోకి మళ్లీ ప్రవేశించినప్పుడు కథ రక్తికడుతుంది. డ్రామాను తీవ్రతరం చేస్తుంది. తన తండ్రికి సహాయం చేయడానికి సుధీర్ సాహసోపేతమైన అడుగు వేస్తాడు. ఇది ఊహించని ఇబ్బందులకు దారి తీస్తుంది. ఇందులో సుధీర్ తన పేరు మహేష్ బాబు అని సరదాగా చెప్పుకునే చమత్కారమైన సందర్భం కూడా ఉంది. దానికి సాయిచంద్ హాస్యభరితంగా సమాధానం చెప్పాడు. దర్శకుడు అభిలాష్ రెడ్డి కంకర హృదయానికి హత్తుకునేలా కథను అందించాడు. తండ్రీ కొడుకుల మధ్య బంధాన్ని చక్కగా రాసుకున్న పాత్రలు అద్భుతంగా చిత్రీకరించాయి. సుధీర్ బాబు తన పాత్రలో పూర్తిగా లీనమై, తన పాత్రకు భావోద్వేగాలను జోడించి, అసాధారణమైన నటనను అందించాడు.

సాయిచంద్, షాయాజీ షిండే తమ తమ పాత్రల్లో మెరిశారు. సుధీర్‌బాబు ప్రేమికురాలిగా ఆర్నా నటిస్తుండగా, ట్రైలర్‌లో రాజు సుందరం కూడా కనిపించాడు. ఈనెల 11న రాబోతున్న ఈ సినిమాపై ట్రైలర్ మరింత క్యూరియాసిటీని పెంచింది అని చిత్ర యూనిట్ తెలిపింది.

సరికొత్త ఐడియాతో దేవకి నందన వాసుదేవ

అశోక్ గల్లా హీరోగా రూపొందుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దేవకి నందన వాసుదేవ'. 'గుణ 369' దర్శకుడు అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాలకృష్ణ నిర్మించారు.

ఆదివారం ప్రసాద్ ల్యాబ్‌లో ఈ సినిమా విడుదల తేదీని నిర్మాతలు ప్రకటించారు. గురు పూర్ణిమ సందర్భంగా నవంబర్ 14న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ అందరిలోనూ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.



అశోక్ గల్లా, మానస

ఈ సందర్భంగా నిర్మాత బాలకృష్ణ మాట్లాడుతూ, 'మా సినిమా రిలీజ్ టైమ్‌లో మట్కా, కంగువా సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. అవి వచ్చినా సరే మా సినిమా మాదే. మాది సక్సెస్ అవుతుందనే నమ్ముతున్నాను. మేం కొత్తవాళ్లమే అయిన మంచి అవుట్‌పుట్‌తో మంచి ఇమేజ్‌ను క్రియేట్ చేసుకున్నాం. థియేటర్‌లో సినిమా చూశాక మంచి సినిమా తీశామనే ఫీలింగ్ మీకూ కలుగుతుంది. ప్రశాంత్ వర్మ సరికొత్త ఐడియాతో కథ రాశారు. సంగీత దర్శకుడు భీమ్స్ ఆకట్టుకునేలా మంచి బాణీలు ఇచ్చారు. సాయిమాధవ్ బుర్రా పదునైన మాటలు రాశారు. దర్శకుడు పర్‌ఫెక్ట్‌గా సినిమాను చేశారు' అని అన్నారు.

'ఇందులో నా పాత్రపేరు సత్యభామ. అందుకే పాత్రకు కనెక్ట్ అయ్యాను. తనకు ఎలాంటి ఒత్తిడిలు ఉన్నా ధైర్యంతో ముందుకుసాగే పాత్ర. కమర్షియల్ డివైన్ థ్రిల్లర్ సినిమాగా రూపొందించారు. అందరినీ అలరించేదిగా ఉంటుంది' అని కథానాయిక మానస చెప్పారు.

దర్శకుడు అర్జున్ మాట్లాడుతూ, 'గొప్ప చిత్రం చేశానని చెప్పగలను. ప్రశాంత్ ఇచ్చిన కథ యూనిక్ స్టయిల్‌లో ఉంది. పక్కా కమర్షియల్ సినిమాగా తీశాం. గతంలో ఇలాంటి కథ రాలేదు' అని తెలిపారు.

ఇది నాకు రెండో సినిమా. ప్రశాంత్ వర్మ కథ అంటే ప్రేక్షకులకు ఏదో గట్టి కథ ఉంటుందని గ్రహించేస్తారు. ఈ కథలో సోల్ చాలా డెప్త్‌గా ఉంటుంది. ఇంత కమర్షియల్ సినిమాను దర్శకుడు అద్భుతంగా తీశారు. ఇక హీరోయిన్ మానసకు ఇదొక ఛాలెంజింగ్ రోల్. ఈ సినిమా తర్వాత ఆమె స్థాయి పెరుగుతుంది. నవంబర్ 14న సినిమా సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాను. ఈ సినిమా నా కెరీర్‌కి టర్నింగ్ అవుతుంది.

- హీరో అశోక్ గల్లా



మిస్టర్ సెలెబ్రిటీకి అద్భుత స్పందన

పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు పరుచూరి సుదర్శన్ హీరోగా ఈనెల 4న 'మిస్టర్ సెలెబ్రిటీ' చిత్రం రిలీజైంది.

ఆర్‌పి సినిమాస్ బ్యానర్‌పై చిన్న రెడ్డయ్య, ఎన్. పాండురంగారావు నిర్మించిన ఈ మూవీకి చందిన రవి కిషోర్ దర్శకుడు.

ప్రేక్షకుల నుంచి ఈ చిత్రానికి మంచి రెస్పాన్స్ వస్తున్న తరుణంలో చిత్ర బృందం సక్సెస్‌మీట్ నిర్వహించింది. పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ,'మా మనవడు హీరోగా వచ్చిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు అద్భుతంగా ఆదరిస్తున్నారు. సెలెబ్రిటీల మీద పుకార్లు రావడం, వాటి వల్ల ఏర్పడే పర్యవసానాల మీద దర్శకుడు మంచి కథను అల్లుకున్నాడు. ట్విస్ట్ కూడా అందరినీ ఆకట్టుకుంది. కొత్త కాన్సెప్ట్‌తో వచ్చిన మా చిత్రం అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంది. నిర్మాత ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమా అద్భుతంగా నిర్మించారు' అని అన్నారు. 'మా సినిమాని ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్' అని నిర్మాత పాండు రంగారావు చెప్పారు.

దర్శకుడు చందిన రవి కిషోర్ మాట్లాడుతూ,'అన్ని చోట్ల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. కథ విన్న వెంటనే బాగుందని పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. స్క్రిప్ట్ మీద ఆయన చేయి పడింది కాబట్టే ఈ మూవీ ఇంత పెద్ద హిట్ అయింది. నేను ఈ రోజు ఇక్కడి వరకు వచ్చానంటే పరుచూరి ఫ్యామిలీయే కారణం. మా హీరో సుదర్శన్ ఇచ్చిన సపోర్ట్ వల్లే ఈ చిత్రానికి ఇంత గొప్ప ప్రమోషన్స్ దక్కాయి. ఈ సినిమాకు వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన బలం' అని చెప్పారు.




పూర్వాజ్

కిల్లర్

పలు సూపర్ హిట్ సీరియల్స్, సినిమాలలో నటించి పాన్ ఇండియా వీక్షకుల ఆదరణ పొందడంతో పాటు సోషల్ మీడియాలో ఎంతో క్రేజ్ తెచ్చుకున్న హీరోయిన్ జ్యోతి పూర్వజ్. ఆమె ప్రధాన పాత్రలో 'శుక్ర', 'మాటరాని మౌనమిది', 'ఏ మాస్టర్ పీస్' వంటి డిఫరెంట్ సినిమాలతో తనకంటూ ఓ ప్రత్యేకతను సొంతం చేసుకున్న దర్శకుడు పూర్వాజ్ 'కిల్లర్' అనే యాక్షన్ థ్రిల్లర్ మూవీని అనౌన్స్ చేశారు. ఆదివారం 'కిల్లర్' పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ మూవీ టైటిల్‌తో పాటు మోషన్ పోస్టర్‌ని మేకర్స్ లాంచ్ చేశారు. పవర్‌ఫుల్ లేడీ, గన్, చెస్ కాయిన్స్‌తో అల్ట్రా మోడరన్‌గా డిజైన చేసిన ఈ మూవీ మోషన్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు పూర్వాజ్, ప్రజయ్ కామత్. ఈ కలయికలో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది. పూర్వాజకీ చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - జగదీశ్ బొమ్మిశెట్టి, మ్యూజిక్ - అషీర్ ల్యూక్, సుమన్ జీవరత్నం, నిర్మాతలు - పూర్వాజ్, ప్రజయ్ కామత్, రచన,దర్శకత్వం - పూర్వాజ్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



'రోబో చెఫ్'


కెనడా : ఎవరైనా వండి పెడితే బాగుండు ... హాయిగా కూర్చొని తినొచ్చు ..! అని పనులు చేసీచేసీ ఓపిక లేని స్థితిలో చాలామంది అంటుంటారు. కానీ దైనందిన జీవితంలో ఎవరి ఇంటి వంట వారే చేసుకోకతప్పదు. ముఖ్యంగా ఉద్యోగస్తులకు వంట పెద్ద టాస్క్ అనే చెప్పాలి. ఇంటి చాకిరీ చేస్తూ టైంతో పరుగెడుతూ ఉంటారు. మరి ఇంటి పనులన్నీ చేసి చక్కగా వంట చేసి వడ్డించి పెట్టే మాంచి రోబో ఉంటే .. ! అవునండీ ... రోబో చెఫ్ వచ్చేసింది.

కెనడియన్ స్టార్టప్ కంపెనీ 'రోబో ఈట్జ్' ఈ రోబో చెఫ్‌ను రూపొందించింది. రెస్టరెంట్ నిపుణులు, ఏరోస్పేస్ ఇంజినీర్ల సంయుక్త కృషితో 'రోబో ఈట్జ్' ఈ రోబో చెఫ్‌ను విజయవంతంగా తయారు చేసింది. కార్పొరేట్ వంట గదుల్లోను, రెస్టారెంట్ల వంట గదుల్లోను, ఫాస్ట్‌ఫుడ్ చెయిన్స్ వంట గదుల్లోను ఉపయోగించడానికి అనువుగా ఈ రోబో చెఫ్‌ను తీర్చిదిద్దారు. ఇటీవల కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో (సీఈఎస్)లో దీని పనితీరును ప్రదర్శించారు. అంతర్జాతీయ శాస్త్రవేత్తల నుంచి దీని పనితీరుకు ప్రశంసలు లభించాయి.

అన్నీ ఇట్టే ...!


ఇది రోబో చెఫ్. ఎలాంటి వంటకాలనైనా చిటికెలో వండి వడ్డిస్తుంది. అంతేకాదండోయ్ ... వంటగదిలోని ప్రతి పనిని ఇది స్వయంగా చేస్తుంది. ఇందులో నిక్షిప్తమైన 80 రకాల పదార్థాలు, దినుసులను ఉపయోగించి ఎలాంటి వంటనైనా ఇట్టే చేసేస్తుంది. ఇది వెయ్యి రకాల వంటకాలను వండి పెడుతుంది. వంటకం తయారైన తర్వాత తినేంతవరకు తాజాదనం చెడకుండా ఉండేలా వేడి పదార్థాలను వేడిగాను, చల్లని పదార్థాలను చల్లగాను నిల్వచేసి మరీ ఉంచుతుంది.

' మంచి దొంగ '



లండన్ : దొంగల్లో చాలామంది వింతగా ప్రవర్తిస్తుంటారు. ఘరానా దొంగలు, వింత దొంగలు, భలే దొంగలు, గజ దొంగలు అంటూ ... రకరకాల టైటిల్స్‌తో అనేక వార్తలు వస్తుంటాయి. యూకేలోని మాన్ మౌత్ షైర్ లో ఓ మంచి దొంగ ఘటన వెలుగుచూసింది. డేమియన్ వాజినిలోవిక్జ్ లోని ఓ దొంగ గతంలో కూడా పలు నేరాలు చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. ఇటీవల మాన్ మౌత్ షైర్ లో ఓ ఇంట్లో చోరీ కోసం వెళ్లాడు. ఆ సమయంలో ఇంటి యజమానురాలు లేదు. ఇంట్లో ఒంటరి మహిళ నివాసముంటుందని తెలిసిన ఆ దొంగ ... దొంగతనానికి బదులు ఇంటి పనులన్నీ చేశాడు..! అవునండీ ... అన్ని పనులూ చేశాడు. ఇల్లంతా నీట్ గా సర్దేశాడు. బట్టలు ఉతకడంతోపాటు ఇంటి పనంతా చేశాడు. కిచెన్, ఫ్రిజ్ అన్నీ సర్దేశాడు. ఆపై ఫ్లోర్ తుడిచి నీట్ గా చేశాడు. ఆఫీసు నుంచి అలసిపోయి వస్తుందనే ఆలోచనతో ఇంటి యజమాని కోసం వంట చేసి భోజనం కూడా సిద్ధం చేసి పెట్టాడు. అయితే వెళుతూ వెళుతూ 'డోంట్ వర్రీ.. బీ హ్యాపీ' అంటూ ఓ పేపర్ పై రాసిపెట్టి వెళ్లాడు. ఇంట్లో ఉన్న రెడ్ వైన్ ను తాగి, ఆ సీసా, గ్లాసును మాత్రం టేబుల్ పై అలాగే వదిలేశాడు. ఇంట్లోకి అడుగుపెట్టిన యజమానురాలు ఇదంతా చూసి తీవ్ర భయాందోళనకు గురైంది. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చింది. ఇక ఒంటరిగా ఆ ఇంట్లో ఉండలేక తన స్నేహితురాలి దగ్గర ఉండిపోయింది. తాను ఒంటరిగా ఉంటున్న విషయం తెలుసుకున్న ఆ దొంగ ఏ క్షణంలో వచ్చి ఏం చేస్తాడోననే భయపడ్డానని చెప్పింది. రెండు వారాల తర్వాత దొంగ దొరికాడని పోలీసులు ఫోన్ చేయడంతో టెన్షన్ తగ్గిందని వివరించింది.

వేదికపై 'రామలీల' రాముడి పాత్ర కళాకారుడు మృతి



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా శరన్నవ రాత్రుల వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్తరాదిన నవరాత్రి వేడుకల్లో 'రామలీల'ను ప్రదర్శిస్తుంటారు. రాజధాని ఢిల్లీలోని ఒక ప్రాంతంలో 'రామలీల' ప్రదర్శిస్తుండగా వేదికపై విషాద ఘటన జరిగింది. ఢిల్లీలోని షహదారా ప్రాంతంలోని విశ్వకర్మ నగర్‌లో వేదికపై రామలీల ప్రదర్శిస్తుండగా రాముడి పాత్ర పోషిస్తున్న ఓ కళాకారుడు గుండెపోటుతో మతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. రాముని పాత్ర పోషిస్తున్న నటుని పేరు సుశీల్ కౌశిక్ (45) ఆయన స్టేజ్ పై రాముని పాత్రలో డైలాగులు చెప్పడం వీడియోలో కనిపిస్తుంది. ఈ సమయంలో, అతనితో పాటు ఇతర కళాకారులు కూడా వేదికపై ఉండటాన్ని చూడవచ్చు. ఇంతలో అకస్మాత్తుగా సుశీల్ తన గుండెపై చేయి వేసుకుని స్టేజి వెనుక వైపు వెళ్లడం కనిపిస్తుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేదికపై రాముని పాత్రధారి సుశీల్‌కు గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మతి చెందాడు. సుశీల్ కౌశిక్ వత్తిరీత్యా ప్రాపర్టీ డీలర్ అని తెలుస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆప్, ఎస్ఏడీ నేతల మధ్య వాగ్వివాదం..

- ఆప్ నేతపై కాల్పులు



చండీగఢ్ : పంజాబ్‌లో ఆప్, శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఏడీ) నేతల మధ్య జరిగిన వాగ్వివాదం కాల్పులకు దారితీసింది. ఈ ఘటనలో ఆప్ నేత మందీప్ సింగ్ బ్రార్‌కు బుల్లెట్ గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. పంజాబ్‌లోని ఫజిల్కా జిల్లాలో ఆదివారం ఉదయం ఈ ఘటన జరిగింది. వివరాల ప్రకారం.. ఓ పాఠశాలకు సంబంధించిన ఫైల్‌ను క్లియర్ చేయాల్సిందిగా ఎస్ఏడీ నేత వీర్‌దేవ్ సింగ్ తన అనుచరులతో కలిసి స్థానిక బ్లాక్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయత్ ఆఫీసర్ (బీడీపీఓ) కార్యాలయానికి వెళ్లారు. బీడీపీఓ సిబ్బంది నిరాకరించడంతో ఆగ్రహంతో బయటికి వెళ్లిపోయారు. కార్యాలయం ఎదుట ఆప్ నేత మందీప్ సింగ్ బ్రార్‌తో వాగ్వివాదానికి దిగారు. వెంటనే వీర్‌దేవ్ సింగ్ ఆప్ నేతపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆప్‌నేత మన్‌దీప్ సింగ్‌ను జలాలాబాద్ సిటీలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం లుథియానాలోని జిల్లా మెడికల్ సెంటర్‌లో చేర్చారు. ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు ఫజిల్కా సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. వీర్‌దేవ్ సింగ్ ఎస్ఏడీ మాజీ ఎంపీ జోరా సింగ్ మాన్ కుమారుడు. ఉద్దేశపూర్వకంగానే వీర్‌దేవ్ సింగ్ కాల్పులు జరిపినట్టు జలాలాబాద్ ఆప్ ఎమ్మెల్యే జగదీప్ కంబోజ్ గోల్డీ పేర్కొన్నారు. పంచాయితీ ఎన్నికలకు ముందు ఎస్ఏడి దాడులకు దిగుతోందని మండిపడ్డారు. 15న రాష్ట్ర వ్యాప్తంగా 13 వేలకు పైగా సర్పంచి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.



కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహించిన భారీ మానవహారంలో పాల్గొన్న ఉక్కు కార్మికులు, ప్రజలు

'ఉక్కు'ను అమ్మితే ఊరుకోం

- భారీ మానవహారం
- అగనంపూడి నుంచి గాజువాక వరకూ చేయిచేయి కలిపిన జనం
- మద్దతు తెలిపిన సీపీఐ(ఎం), సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శులు వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ

విశాఖపట్నం : 'చేయి చేయి కలుపుదాం... విశాఖ ఉక్కును కాపాడుకుందాం' పేరిట భారీ మానవహారానికి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఇచ్చిన పిలుపునకు ఆదివారం విశేష స్పందన లభించింది. అగనంపూడి నుంచి గాజువాక వరకూ ప్రజలు ఎక్కడికక్కడ చేయిచేయి కలిపి మానవహారంగా ఏర్పడ్డారు. ఉక్కు పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు, అధికారులు, వారి కుటుంబీకులు, ఉక్కు నిర్వాసితులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరాన్ని సీపీఐ(ఎం)ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సందర్శించి మద్దతు తెలిపారు. అక్కడి కూడలిలో జాతీయ రహదారిపై బైటాయించి ఉక్కు పరిరక్షణ నినాదాలు చేశారు. అనంతరం అక్కడ మానవహారం కొనసాగింది. దీక్షా శిబిరం వద్ద వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కుపై ఆటవిక న్యాయాన్ని ప్రదర్శిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌ను రక్షిస్తామని చెబుతున్న మాటలలో విశ్వాసం కానరా లేదన్నారు. రోజురోజుకూ ప్లాంట్‌లో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించేందుకు ఉత్తర్వులు ఇవ్వడం, ఉక్కు కార్మికులకు హెచ్ఆర్ఏ నిలుపుదల చేయడం, విద్యుత్ చార్జీలు పెంచడం, ఇతర పరిశ్రమలకు డిప్యుటేషన్ల పేరుతో అధికారులను పంపించడం వంటి చర్యలతో కార్మికులలో భయాందోళనలను సృష్టించడం తగదన్నారు. 8న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోడీతో మాట్లాడుతున్నారని, దానిలో విశాఖ ఉక్కు పరిరక్షణ అంశం ప్రధానంగా ఉండాలని అన్నారు. ఉక్కును రక్షించే చర్యలు చేపడితే స్వాగతిస్తామని, లేనిపక్షంలో కార్మికులతో కలిసి రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ 1333 రోజులుగా ఇక్కడ ఉద్యమం జరుగుతున్నా కార్మికుల ఘోష పాలకులకు పట్టకపోవడం దారుణమన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలూ ఉక్కు పరిరక్షణ కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. కూర్మన్నపాలెం కూడలిలో ఆందోళనకు దిగిన ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మెన్ సిహెచ్.నర్సింగరావును పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, సీపీఐ(ఎం) కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, డి.ఆదినారాయణ, నాయకులు జె.అయోధ్యరామ్, ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు. గాజువాకలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మద్దతు తెలిపారు.



జాతీయ రహదారిపై బైటాయించిన సీపీఐ(ఎం),సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి ఏడాది

- అమానవీయదాడులకు గాజాలో 42 వేల మంది మృతి
- లెబనాన్, ఇరాన్‌కూ విస్తరించిన దాడులు

కైరో : ఉగ్రవాదాన్ని అంతమొందించే పేరుతో పాలస్తీనా పౌరులను లక్ష్యంగా చేసుకొని గాజా స్ట్రిప్‌లో యుద్ధోన్మాదంతో ఇజ్రాయిల్ దాడులను ప్రారంభించి ఈ నెల 7 నాటికి ఏడాది పూర్తయింది. అమానవీయ దాడులను ప్రతిఘటించేందుకు ఇజ్రాయిల్‌లో హమాస్‌కు చెందిన సాయుధులు గతేడాది ఏడున దాడులకు పాల్పడ్డారు. వంద మంది పైగా ఇజ్రాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఇక అప్పటి నుంచి ఇజ్రాయిల్ గాజా స్ట్రిప్‌పై విరుచుకుపడుతోంది. చిన్నారులు, మహిళలు, శరణార్థులతో సహా అమాయక పాలస్తీనా ప్రజలను లక్ష్యంగా చేసుకొని వైమానిక, భూతల దాడులు చేస్తూవస్తోంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకు జీవుడా అంటూ అక్కడి ప్రజలు తలదాచుకున్న పాఠశాలలపైనా, ఆసుపత్రులపైనా, మసీదులపైనా ఇజ్రాయిల్ బలగాలు దాష్టీక దాడులకు తెగించాయి. వేలాది మంది ప్రాణాలను బలి తీసుకున్నాయి. ఘోరమైన హింసాత్మక దాడుల్లో చిక్కుకుపోయిన గాజా ప్రజానీకం అంతులేని పెను విషాదాన్ని చవిచూస్తున్నారు.

మరోవైపు ఎర్ర సముద్రంలో హౌతీ సాయుధుల దాడుల, ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు, అమెరికా నీచపు సైనిక ఎత్తుగడలతో మధ్యప్రాచ్య ప్రాంతం రణభూమిగా మారిపోయింది. ఈ నెల ప్రారంభంలో ఇజ్రాయిల్ మరింతగా రెచ్చిపోయి లెబనాన్‌లోనూ భూతల దాడులకు తెగించింది. ఈ దాడుల్లో అనేక మంది చనిపోయారు. వేలాది మంది రక్షిత ప్రాంతాలకు వలస వెళ్లారు. ఇరాన్‌కు కూడా ఈ దాడులు విస్తరించాయి. ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో ఒక్క గాజా స్ట్రిప్‌లోనే దాదాపు 42,000 మంది పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇది ఆ ప్రాంతంలోని మొత్తం జనాభాలో 2 శాతంగా ఉంది. ఇక్కడి జనాభాలో 90 శాతం కంటే ఎక్కువ మంది ప్రజలు బలవంతంగా తమ ఇళ్లను ఖాళీ చేసి రక్షిత ప్రాంతాలకు వలస వెళ్లారు. రక్షిత శిబిరాల్లో తలదాచుకుంటున్న బాధిత పాలస్తీనీయన్లకు మానవతాసాయం అందించేందుకు వెళ్తున్న అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలను కూడా ఇజ్రాయిల్ అడ్డుకుంటూ వస్తోంది. సహాయక సామగ్రి వెళ్లనీయకుండా భద్రతా బలగాలతో అడ్డుకుంది. కుటుంబాలకు కుటుంబాలు ఛిద్రమయ్యాయి. జీవనోపాధులకు దిక్కులేకుండా పోయింది. భవిష్యత్ సంపద అయిన చిన్నారులపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులు మాయనిమచ్చలుగా మిగిలిపోయాయి.

ఈ దాడుల్లో పాలుపంచుకున్న ఇజ్రాయిల్ సైనికులు కూడా పెద్ద సంఖ్యలోనే చనిపోయారు. గతేడాది అక్టోబరు 7న జరిగిన హమాస్ దాడిలో 1200 మంది ఇజ్రాయిలీలు చనిపోయారు. ఆ తర్వాత దాడులు, ఇతర ఘటనల్లో కనీసం 350 మంది ఇజ్రాయిలీ సైనికులు చనిపోయారు. అంతకంతకూ పెరిగిపోతున్న మానవ హననాన్ని, హింసకు అడ్డుకట్ట వేయాలని శాంతియుత చర్చలే అందుకు పరిష్కారమార్గమని అంతర్జాతీయంగా ప్రగతిశీల శక్తులన్నీ నినదిస్తూవున్నా..

ఇజ్రాయిల్‌లోని నెతన్యాహూ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు. అయితే ఈ విషయంలో అగ్రరాజ్యాలుగా చెప్పుకునే దేశాల తీరు చాలా దుర్మార్గంగా ఉంటోంది. ఎప్పటిలాగే అమెరికా తన యుద్ధోన్మాద వికృత రూపాన్ని నిస్సిగ్గుగా చాటుకుంటోంది. ఇజ్రాయిల్‌కు సైనికంగా, ఆర్థికంగా గణనీయమైన సహాయాన్ని అందిస్తూ దాడులకు ఆజ్యం పోస్తోంది. మరోవైపు కమ్యూనిస్టు చైనా శాంతియుత పరిష్కారం కోసం ఎనలేని కృషి చేస్తోంది. దాడులకు స్వస్తి పలికి కాల్పుల విరమణ పాటించాలని అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశించినా ఇజ్రాయిల్ పెడచెవిన పెట్టడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. ఇది అంతర్జాతీయ న్యాయాన్ని అపహాస్యం చేయడమేని ఐరాసలో చైనా శాశ్వత ప్రతినిధి ఫు కాంగ్ అన్నారు. ఇజ్రాయిల్ సాగిస్తున్న హింసకు తెరపడాలంటే అంతర్జాతీయ సమాజం ఒకతాటిపై నిలిచి దౌత్యపర ఒత్తిళ్లు తీసుకురావడం ద్వారానే ఇజ్రాయిల్‌కు ముకుతాడు వేయగలని వివిధ ప్రజా సమూహాలు నినదిస్తున్నాయి.

బీరుట్‌లో భీకరదాడులు

- 25 మంది మృతి

బీరుట్ : హిజ్బుల్లాను అంతమొందించే నెపంతో లెబనాన్‌పైనా విరుచుకుపడుతున్న ఇజ్రాయిల్ శనివారం రాత్రి బీరుట్ శివారు ప్రాంతంలో భారీ స్థాయిలో వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 25 మంది పైగా చనిపోయారు. ఇప్పటికే నస్రల్లా సహా పలువురు కీలక నేతలను చంపేసినట్లు ప్రకటించిన ఇజ్రాయిల్ తాజా దాడుల్లో మరికొందరు కీలక నేతలను చంపేసినట్లు వెల్లడించింది. కాగా బీరుట్‌లో ఇజ్రాయిల్ జరిపిన తాజా దాడుల్లో 25 మంది చనిపోయారని, మరో 127 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్యశాఖ తెలిపింది. బీరుట్ శివారు ప్రాంతాలపై ఇప్పటి వరకు ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో గత శనివారం రాత్రి జరిపినవే అత్యంత దారుణమైనవని లెబనాన్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు పాత్రికేయులు పేర్కొన్నారు.

బాణసంచాలా మొదలైన దాడులు అంతకంతకూ పెరుగుతూ ఆదివారం ఉదయం వరకూ భీకరంగా సాగాయని చెప్పారు.

గుజరాత్‌లో ఆగని బుల్డోజ్‌రాజ్

- కోర్టు ఆదేశాలను దిక్కరించి కూల్చివేతలు
- మసీదులు, ప్రార్థనా మందిరాలే లక్ష్యం
- మైనార్టీల ఆవాసాలూ నేలమట్టం



న్యూఢిల్లీ : గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వం తన విధ్వంసకర పాలన కొనసాగిస్తోంది. అక్రమ నిర్మాణాలుగా ముద్ర వేసి మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని సాగిస్తున్న కూల్చివేతలను తక్షణమే నిలిపివేయాలని, బుల్డోజ్‌రాజ్‌కు చరమగీతం పాడాలంటూ ఇటీవల దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను కూడా కాషాయ పార్టీ లెక్క చేయడం లేదు. ముస్లిం ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేస్తోంది. అనేక జనావాసాలను కూడా నేలమట్టం చేస్తోంది. గిర్ సోమనాథ్ జిల్లాలోని వెవరాల్ ప్రాంతంలో గత నెల 28న పిర్ షా సిలార్ దర్గాతో పాటు మరో 8 మత కట్టడాలను అధికారులు కూల్చివేశారు. ఇవన్నీ ముస్లింలకు చెందినవే. ఆ ప్రాంతంలో ముస్లింలు నివసిస్తున్న 37 ఇళ్లను కూడా నామరూపాలు లేకుండా చేశారు. కేవలం ఆరు గంటల వ్యవధిలోనే అవన్నీ గత జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.

అన్యాయాన్ని ప్రశ్నిస్తే నిర్బంధం..

వెవరాల్‌లోని పిర్ షా సిలార్ దర్గా ఈ నాటికి కాదు. ఈ పురాతన మందిరంలో అబ్దుల్ హమీద్ (51) ముత్తాత, తాత, తండ్రి ప్రార్థనలు చేసే వారు. ఈ దర్గాకు హమీద్ 11వ తరం భక్తుడు. దానిని తన కళ్ల ఎదుటే కూల్చివేస్తుంటే కన్నీటిని ఆపుకునేందుకు హమీద్ విఫల యత్నం చేశారు. ఇళ్ల కూల్చివేత కారణంగా 200 మంది స్థానికులు నిరాశ్రయులయ్యారని హమీద్ ఆవేదనతో చెప్పారు. ఓ వైపు కూల్చివేతలు కొనసాగుతుండగానే ఈ అన్యాయాన్ని ప్రశ్నించిన 150 మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని నిర్బంధించారని హమిద్ తెలిపారు.

మోడీ నేతృత్వంలోని ట్రస్ట్ కోసం...

కూల్చివేతలకు జిల్లా మెజిస్ట్రేట్, కలెక్టర్ డీడీ జడేజా ఆదేశాలు జారీ చేశారు. వెవరాల్ ప్రాంతంలోని 100 ఎకరాల భూమిపై తమకు హక్కులు ఉన్నాయని శ్రీ సోమనాథ్ ట్రస్ట్, రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకుంటున్నాయి. మత ధార్మిక సంస్థ అయిన ఈ ట్రస్ట్‌కు సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వం వహిస్తున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బిజెపి సీనియర్ నేత ఎల్‌కె అద్వానీ దీనిలో ట్రస్టీలు.

భయపెట్టి ఖాళీ చేయించేందుకే...

ప్రభాస్ పటాన్ ప్రాంతంలో అనేక చారిత్రక మసీదులు ఉన్నాయి. హాజీ మంగ్రోల్ షా దర్గా, షా సిలార్ దర్గా, గరీబ్ షా దర్గా, జాఫర్ ముజఫర్ దర్గా...వీటన్నింటినీ బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. 1924 నాటి జునాగఢ్ రాష్ట్ర రెవెన్యూ రికార్డులలో హాజీ మంగ్రోల్ షా దర్గా పేరు ఉంది. ముస్లింలను భయపెట్టి వెరావల్ నుండి వారిని ఖాళీ చేయించేందుకే కూల్చివేతలు చేపట్టారని పిసిసి ఉపాధ్యక్షులు, అదే ప్రాంతానికి చెందిన నస్రత్ పంజా అన్నారు. కూల్చివేసిన నిర్మాణాలు పురాతనమైనవి, చారిత్రకమైనవి అని ఆయన తెలిపారు. 'ఘన చరిత్ర కలిగిన ఇస్లామిక్ నిర్మాణాలను ఇళ్లతో పాటే ధ్వంసం చేశారు. ఈ మసీదులు 800 సంవత్సరాల నాటివి. వీటికి చట్టబద్ధమైన పత్రాలు కూడా ఉన్నాయి. అలాంటప్పుడు కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం వీటిని ఎందుకు కూల్చివేసింది?' అని ఆయన ప్రశ్నించారు.

ఆటవిక చర్య

హైడ్రాలిక్ క్రేన్లు, కనీసం 60 ఎక్సవేటర్లు, 50 ట్రాక్టర్ ట్రెలర్లు, ఐదు డంపర్లు, 1400 మంది పోలీసుల సాయంతో కూల్చివేతలను పూర్తి చేశారు. ఇది కేవలం రాజకీయపరమైన చర్య అని, ఆటవికమైనదని సామాజిక కార్యకర్త బసీర్ గోయల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సూరత్‌లో కొద్ది రోజుల క్రితం ఇలాంటిదే జరిగిందని ఆయన గుర్తు చేశారు. కాగా ఆక్రమణదారులు తమ చట్టబద్ధతను నిరూపించుకోలేదని, అందుకే కూల్చివేతలు జరిపామని కలెక్టర్ జడేజా తమ చర్యలను సమర్థించుకున్నారు. ఈ వ్యవహారం కోర్టులో ఉన్నప్పటికీ ఎందుకు కూల్చివేతలు సాగించారని ప్రశ్నించగా ఆయన సరైన సమాధానం ఇవ్వలేదు.

కోర్టు ఆదేశించినా...

హడావిడిగా కూల్చివేతలు జరపడంపై గుజరాత్ మైనారిటీ కోఆర్డినేషన్ కమిటీ నిరసన వ్యక్తం చేసింది. గత నెల 28వ తేదీన ఈ కమిటీ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు లేఖ రాస్తూ ముస్లిం సమాజానికి న్యాయం చేయాలని కోరింది. తన అనుమతి లేకుండా అక్టోబర్ 1వ తేదీ వరకూ దేశంలో ఎక్కడా కూల్చివేతలు జరపవద్దంటూ గత నెల 17న సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన విషయాన్ని ఆ లేఖలో ప్రస్తావించింది. కూల్చివేతలు చట్టవిరుద్ధమని, రాజ్యాంగ వ్యతిరేక చర్య అని రాష్ట్ర హైకోర్టు కూడా తప్పుపట్టింది. అయితే రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం తన పని తాను చేసుకుపోయింది.

అమెరికాను చూసి ప్రపంచం నవ్వుతోంది



ట్రంప్

ప్రపంచ వేదికపై అమెరికా గౌరవం కోల్పోయి నవ్వుల పాలయిందని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వింగ్ స్టేట్ పెన్సిల్వేనియాలో జరిగిన ప్రచార కార్యక్రమంలో అన్నాడు. ట్రంప్ శనివారం బట్లర్ నగరంలో తన ఎన్నికల ప్రచారానికి మద్దతుగా ర్యాలీని నిర్వహించాడు. జూలైలో హత్యాయత్నం నుంచి బయటపడిన ప్రదేశానికి తిరిగి వచ్చాడు. రిపబ్లికన్ పార్టీ నామినీ అయిన డోనాల్డ్ ట్రంప్ అమెరికా ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తానని, హింసాత్మక నేరాలను ఎదుర్కొంటానని, దక్షిణ సరిహద్దు ద్వారా సాగే అక్రమ వలసలను అణిచివేస్తానని ప్రతిజ్ఞ చేశాడు.

"ప్రతిదీ ఉత్తమంగా ఉండాలి," అని అతను చెప్పాడు. "మనం అత్యుత్తమ పాఠశాలలను కలిగి ఉండాలి. మనకు బలమైన సరిహద్దులు ఉండాలి. చెడ్డ వ్యక్తులు వచ్చి మమ్మల్ని బాధపెట్టడం మాకు ఇష్టం లేదు. మళ్లీ వస్తువులను నిర్మించే, విషయాలను మెరుగుపరిచే, మరోసారి నక్షత్రాలను లక్ష్యంగా చేసుకునే దేశానికి మీరు అర్హులు. మరోసారి మీరు పోయిన గౌరవాన్ని తిరిగి పొందుతారు. మేము నాలుగేండ్ల క్రితం గౌరవాన్ని పొందాలనుకుంటున్నాం" అని అతను చెప్పాడు. ప్రపంచం మొత్తం మనల్ని గౌరవించింది. వారు మనల్ని గౌరవించారు. ఎప్పుడూ గౌరవించని దానికంటే ఎక్కువగా గౌరవించారు. ఇప్పుడు వారు మనల్ని చూసి నవ్వుతున్నారు.

తన ప్రచారమంతా, అధ్యక్షుడు జో బైడెన్, డెమొక్రాటిక్ అభ్యర్థి కమలా హారిస్‌ల 'బలహీనమైన' పరిపాలన అమెరికా ప్రతిష్టను దెబ్బతీసిందని ట్రంప్ ఆరోపించాడు. ఉక్రెయిన్, గాజాలో వివాదాలు తాను అధ్యక్షుడిగా ఉంటే చెలరేగి ఉండేవి కావని ఆయన వాదించాడు. వ్లాదిమిర్ పుతిన్, జీ జిన్‌పింగ్ సహా ప్రపంచ నేతలందరితోనూ తనకు మంచి సంబంధాలు ఉన్నాయని ట్రంప్ చెప్పాడు. నవంబర్‌లో రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైతే రష్యా-ఉక్రెయిన్ వివాదాన్ని త్వరగా పరిష్కరిస్తానని కూడా ఆయన అన్నాడు.

అదే సమయంలో బైడెన్, హారిస్‌లు ట్రంప్ నాటోను అణగదొక్కాడని, రష్యాను ఎదుర్కోవడంలో విఫలమయ్యాడని ఆరోపించారు. గత నెలలో టెలివిజన్ చర్చ సందర్భంగా హారిస్ ట్రంప్‌తో మాట్లాడుతూ "మీరు ఇకపై అధ్యక్షుడు కానందుకు మా నాటో మిత్రదేశాలు చాలా కతజ్ఞతలు తెలుపుతున్నాయి" అని అన్నది.

హమాస్ లక్ష్యం.. ఇజ్రాయిల్ పెద్ద యుద్ధంలో చిక్కుకోవడమే

న్యూయార్క్ టైమ్స్

ఇజ్రాయిల్‌ను విస్తత ప్రాంతీయ వివాదంలోకి లాగాలని హమాస్ నాయకుడు యాహ్యా సిన్వార్ కోరుకుంటున్నాడని అమెరికా నిఘా వర్గాలను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ శుక్రవారం పేర్కొంది. వారి అంచనా ప్రకారం, మధ్యప్రాచ్యంలో ఒక "పెద్ద యుద్ధం" పశ్చిమ జెరూసలేం దష్టిని మరల్చుతుంది. ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ ఒత్తిడి తెస్తుంది. ఇది గాజా నుంచి ఇతర సరిహద్దులకు దష్టిని మార్చవలసి ఉంటుంది.

ఇజ్రాయిల్‌పై హమాస్ ఆకస్మిక దాడిని ప్రారంభించి వచ్చే వారానికి ఏడాది అవుతుంది. ఇది మిలిటెంట్ గ్రూప్‌పై యుద్ధం ప్రకటించడం ద్వారా, గాజాపై దాదాపు మొత్తం ముట్టడిని విధించడం ద్వారా ప్రతిస్పందించింది. ఇజ్రాయిల్, హమాస్ కతార్‌లో కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించే లక్ష్యంతో అనేక రౌండ్ల పరోక్ష చర్చలు జరిపాయి, అయితే అవి ఇప్పటివరకు ఫలించలేదు. అధికారులు వార్తాపత్రికతో మాట్లాడిన ప్రకారం, హమాస్ కొత్త నాయకుడు సిన్వార్‌కు ఇజ్రాయిల్‌తో "ఒప్పందం కుదుర్చుకునే ఉద్దేశ్యం లేదు" అని ఆరోపించినందున, చర్చలు ఎప్పుడైనా అర్థవంతమై ఫలితాలను ఇచ్చే అవకాశం లేదు. కొంతమంది ఇజ్రాయిల్ అధికారులు సిన్వార్ సజీవంగా ఉన్నారా అని ప్రశ్నించారు. అయితే అమెరికా వద్ద దీనికి



విరుద్ధంగా ఎటువంటి ఆధారాలు లేవని న్యూయార్క్ టైమ్స్ వర్గాలు తెలిపాయి.

సిన్వార్ ఈ వేసవిలో టెహ్రాన్‌లో హత్యకు గురైన అతని పూర్వీకుడు ఇస్మాయిల్ హనియెహ్ కంటే చాలా గట్టి సంధానకర్త. ఇజ్రాయిల్ తన సైనిక దష్టిని ఇరాన్, లెబనాన్-ఆధారిత హిజ్బుల్లా వైపు మళ్లిస్తుందని, హమాస్‌ను తిరిగి సమీకరించడానికి అవకాశం కల్పిస్తుందని ఆశతో సిన్వార్ ప్రస్తుత పోరాట దశను ఎంచుకున్నట్టు టైమ్స్ రాసింది. ఇరాన్, హిజ్బుల్లా రెండూ యుద్ధంలో హమాస్‌కు మద్దతునిచ్చాయి. అయితే వారి సైనిక ప్రమేయం ఇప్పటివరకు పరిమితం చేయబడింది. అయితే ఇజ్రాయిల్ మిలిటెంట్ గ్రూపులకు వ్యతిరేకంగా తన యుద్ధం "కొత్త దశ" ప్రకటించిన తర్వాత, లెబనాన్‌లో గ్రౌండ్ ఆపరేషన్ ప్రారంభించిన తర్వాత ఇటీవలి వారాల్లో పరిస్థితి తీవ్రమైంది. పశ్చిమ జెరూసలేం ప్రకటించిన హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రుల్లా హత్యను ఇది అనుసరించింది. ప్రతిస్పందనగా, ఇరాన్ ఈ వారం ప్రారంభంలో ఇజ్రాయిల్‌పై భారీ క్షిపణి దాడి చేసింది.

గాజాలో ఇజ్రాయిల్ కార్యకలాపాలు నెమ్మదిస్తున్నాయి. ఇజ్రాయిలీ సైన్యం ఇప్పుడు గాజాలో కొన్ని స్థావరాలను మాత్రమే నిర్వహిస్తోందని అమెరికా అధికారులు న్యూయార్క్ టైమ్స్‌కి చెప్పారు. దక్షిణ లెబనాన్‌లో పోరాటం ఇప్పటికే ఇజ్రాయిల్‌కు కష్టమని నిరూపించబడిందని వారు పేర్కొన్నారు. సిన్వార్ అనుకున్న వ్యూహం విజయవంతం కాగలదని అంచనా వేశారు. పోరాటం తీవ్రంగా కొనసాగితే ఇజ్రాయిల్ "మల్టీ ఫ్రంట్ వార్"లో కూరుకుపోతుంది. అయినప్పటికీ, ఇరాన్ ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రారంభించదని అధికారులు భావిస్తున్నారు. ఎందుకంటే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి గనుక. "నస్రుల్లా హత్యపై ఇరాన్ పగతో ఉంటుంది. కానీ వారి చర్యలు పరిమితం. ఇరాన్ త్వరలో ఇజ్రాయిల్‌తో తలపడుతుందని నేను అనుకోవటం లేదు" అని అమెరికన్ డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ మాజీ అధిపతి స్కాట్ బెరియర్ న్యూయార్క్ టైమ్స్‌తో అన్నాడు.